ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 192 పేజీలు: 8+4 వెల: 6.50

ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం'
జెపిపిఎస్‌సి మాజీ చైర్మన్ అరెస్టు 5లో

## జూనియర్ వైద్యుల సమరశంఖం

### సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం

### అత్యవసర సేవలు, తీవ్ర అనారోగ్య విభాగాలకు మినహాయింపు

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం దశలవారీ ఆందోళనకు పిలుపునిచ్చింది. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్లు సంఘం ప్రకటించింది. సంఘం అధ్యక్షుడు డాక్టర్ యు. ఈశ్వర్ శంకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బలగం దినకర్ సాయి శ్రీనివాస్ తదితరులు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆందోళన కార్యాచరణను వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న సంబంధిత జూనియర్ వైద్యులు, వైద్య శిక్షణార్థులు, సూపర్ ప్రత్యేకతల వైద్య శిక్షణార్థులు, సీనియర్ వైద్య శిక్షణార్థులు తదితరులు అత్యవసరం కాని వైద్య సేవలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు



గుంటూరు ప్రభుత్వ వైద్యశాల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జూనియర్ వైద్యులు

నిలిపివేయనున్నట్లు తెలిపారు. తదుపరి దశలో ఆగస్టు 12 నుంచి 15 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం కాని వైద్య సేవలను పూర్తిగా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వ ఉద్యమానికి మద్దతుగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర సేవలకు మినహాయింపుఆందోళన కారణంగా రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలను యథావిధిగా కొనసాగిస్తామని సంఘం స్పష్టం చేసింది. అత్యవసర విభాగాలు, ప్రసవ సేవలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అన్ని తీవ్ర అనారోగ్య విభాగాల సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొంది. సమస్యలు పరిష్కారం కాకుంటే మరింత ఉధృతంపై దశల్లో చేపట్టిన ఆందోళనల అనంతరం కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 17 నుంచి మూడో దశలో ఆందోళనను మరింత ఉధృతం చేయనున్నట్లు సంఘం వెల్లడించింది. వైద్య శిక్షణ, పరిధి, ఇతర అంశాలపై తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అత్యవసర విభాగాలను కొనసాగిస్తూనే తమ ఆందోళనను చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది.

### భూ రికార్డుల ప్రక్షాళనకే

# రెవెన్యూ రిఫార్మ్స్



సోమవారం కలిదిండి సభలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

వచ్చే 7 నెలల్లో 68.64 లక్షల పాస్ పుస్తకాల జారీ

ఆగస్టు చివరకు 32.22 లక్షల పుస్తకాలు రైతులకు అప్పగింత

పట్టాదారు పాస్ పుస్తకాలకు టెక్నాలజీ రక్షణ కవచం

పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ

డీఎస్సీపై టీచర్లు తిరగబడినా గొడ్డలి పార్టీకి బుద్ధిరాలేదు

కలిదిండిలో మీ భూమి మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఏలూరు/కలిదిండి, ఆగస్టు 10:ప్రభాతవార్త:** రైతులకు తమ భూమిపై పూర్తి భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని,గత పాలనలో అస్తవ్యస్తంగా మారిన భూమి రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రికార్డుల రిఫార్మ్స్ 2026 తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే అజెండాగా కూటమి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. 2027 నాటికి రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమి మీ హక్కు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఇకేవైసీ పూర్తి చేసిన అనంతరం నల్లజర్ల దుర్గా భవానీ అనే మహిళా రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని సీఎం జారీ చేశారు. రీసర్వే ప్రక్రియకు సంబంధించి కలిదిండిలో నిర్వహించిన గ్రామసభకు హాజరైనట్టుగా సీఎం రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ప్రజలు, రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధి చేస్తోందన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని 22ఏలో పెడితే దానిని పరిష్కరించి వారికి పట్టాలు ఇచ్చా >>2



## 3 డిమాండ్లపై స్పష్టత ఇవ్వండి

### అప్పుడే లోక్‌సభ ప్రతిష్టంభనకు ముగింపు: రాహుల్ గాంధీ

### లోక్‌సభలో అమిత్‌షా వివరణకు మేం సిద్ధమే: కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడాలంటే ప్రతిపక్షం పేర్కొన్న మూడు డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని లోక్‌సభలో >>2

## నిఘా వైఫల్యంతోనే ఇంతియాజ్ హత్య

### పక్కా ప్లాన్ ప్రకారమే చేశారు

### వైసిపి నేతల ఆగడాలపై మంత్రి టిజి భరత్ మండిపాటు

**కర్నూల్ (హాస్పిటల్), ఆగస్టు 10 ప్రభాతవార్త:** కర్నూలులో వైసిపి రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలు చేస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ మండిపడ్డారు. పక్కా పథకం ప్రకారమే టిడిపి కార్యకర్త ఇంతియాజ్ బాషాను దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. వైసిపి రాజకీయ హత్యలకు పాల్పడుతోందన్నారు. కర్నూలులో మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, >>2



సోమవారం ప్రియాంక భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మంత్రి టి.జి.భరత్

## ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

### రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేసిన మంత్రి టిజి భరత్

### ప్రియాంక భౌతికకాయానికి నివాళి, కుటుంబ సభ్యులకు పరామర్శ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త బ్యూరో:** రాజమండ్రిలో ఇద్దరు వ్యక్తులు నిరక్ష్యంగా కారు నడిపి ఢీ కొన్న ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి టిజి భరత్ పరామర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి వెళ్లిన మంత్రి, ప్రియాంక >>2



## మరుగుతున్న జార్ఖండ్

### అసెంబ్లీకి విద్యార్థుల ర్యాలీ

### జలఫిరంగులతో పోలీసులు

**రాంచి, ఆగస్టు 10:** ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాట >>2



సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

### ఎఫ్‌సివి పొగాకు రైతుకు

# నష్టం రానివ్వం

### నిర్ణయించిన ధరలకు రేపటి నుంచే కొనుగోళ్లు

### నిబంధనలు పాటించని కంపెనీలపై కఠిన చర్యలు

### ప్రతి పొగాకు రైతుకు రూ.50వేల వడ్డీలేని రుణం

### ఆఫ్‌స్టైల్, లోగ్రేడ్ పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం

### వచ్చే సీజన్‌లో 80 మిలియన్ కేజీలకు మించి సాగుకు అనుమతి లేదు

### పొగాకు రైతుల కోసం సిఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎఫ్‌సివి పొగాకు రైతులను ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగానిలుస్తుందని రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, ధరలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, పొగాకు పండించే ప్రాంతాల శాసనసభ్యులు, పొగాకు బోర్డు చైర్మన్, ఇడి, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రాంతాల రైతులతో సుమారు రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సమస్యలు, కంపెనీల కొనుగోలు తీరు, ధరల అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈఏడాది ఎఫ్‌సివి పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. పొగాకు బోర్డు 140మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, గత సీజన్ చివరిలో మంచి ధరలు రావడంతో రైతులు ఆశతో సాగును పెంచారని, ఫలితంగా సుమారు 240మిలియన్ కేజీల వరకు పొగాకు ఉత్పత్తి >>2



## అర్హులందరికీ 'నేతన్న సేవలో' ఆర్థిక సాయం

### కొత్తగా 13,678 దరఖాస్తులు

### అర్హులను గుర్తించి, అందిస్తాం: మంత్రి సవిత వెల్లడి

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అర్హులైన నేతన్నలందరికీ 'నేతన్నల సేవల్లో' పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో అర్హులను గుర్తించి, వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రాష్ట్ర సచివాయంలోని తన ఛాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలందరూ గౌరవ ప్రదమైన జీవనం సాగించాలన్నదే సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా చేనేత రంగ అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 50యేళ్ల నిండిన చేనేతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50యేళ్ల నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా చేనేతలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. 62,541 మందికి నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ >>2

### 'రూఫ్ టాప్ సోలార్'లో

## ఎస్‌పిడిసిఎల్ రికార్డు

### 50 వేల సర్వీసులు గ్రిడ్‌కు అనుసంధానం

### రాష్ట్రంలో తొలి విద్యుత్ పంపిణీ సంస్థగా గుర్తింపు

### దేశంలో 4వ స్థానంలో నిలిచిన ఎస్‌పిడిసిఎల్

### సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకువచ్చే పనులను ఎస్‌పిడిసిఎల్ వేగవంతం చేసింది. ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, వాటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసే క్రమంలో ఎస్‌పిడిసిఎల్ 50వేల సర్వీసుల మైలు రాయిని చేరుకుంది. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో అమలు చేస్తున్న రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనుల్లో 50 వేల సర్వీసులను గ్రిడ్‌కు అనుసంధానం చేసిన తొలి విద్యుత్ పంపిణీ సంస్థగా ఎపి ఎస్‌పిడిసిఎల్ నిలిచింది. రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు అంశంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో నిలవడం గొప్ప విషయం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న >>2




## కొలంబియాలో భారీ భూకంపం

# 100 మంది మృతి?

### రిక్టర్ స్కేలుపై తీవ్రత 7.4గా నమోదు

**బొగోటా,ఆగస్టు 10:** పశ్చిమ కొలంబియాలో సంభవించిన 7.4 తీవ్రతతో కూడిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య 100కి చేరింది. భూకంప ధాటికి పలు భవనాలు కూలిపోగా, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సోమవారం హటాత్తుగాస ంభవించిన ఈ భూప్రకంపనలతో ప్రజలు భీతిల్లి వీధుల్లోకి పరుగులు తీసారు. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. ప్రజలు పరుగులుతీస్తూ కొందరు భవనాల శిథిలాల్లోనే చిక్కుకున్నట్లు స్థానిక అధికారుల సమాచారం. సహాయక సిబ్బంది శిథిలాలను తొలగిస్తూ ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. భూకంపం కారణంగా ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. రాజధాని బొగోటాలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే, కొలంబియా భూగర్భ శాస్త్ర అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చోకో ప్రాంతంలోని సుమారు 4,800 మంది జనాభా ఉన్న శాన్ జోసే డెల్ పాల్మార్ సమీపంలో భూకంపం సంభవించింది. బొగోటాకు ఇది సుమారు 400కిలోమీటర్ల దూరంలో ఉంది. భూకంప కేంద్రం 107 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎస్‌జిసి వెల్లడించింది. పొరుగున ఉన్న ఈక్వెడార్, పనామాల్లోనూ ప్రకంపనలు అనిపించాయి. అయితే అక్కడ పరిమిత నష్టం మాత్రమే నమోదైంది. పలు నగరాల్లో భారీ నష్టంపశ్చిమ కొలంబియాలో భూకంపం తీవ్ర నష్టం కలిగించింది. పెరీరాలో 18 మంది, మానిజలెస్‌లో మరో ఇద్దరు మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కాలిలో పలు భవనాలు కూలిపోగా, కనీసం 19 భవనాల్లో ప్రజలు చిక్కుకున్నట్లు మేయర్ అలెజాండ్రో ఎడెర్ తెలిపారు. క్విబ్డోలోనూ భారీగా భవనాలు దెబ్బతిన్నాయి. పెరీరా,కాలి, క్విబ్డో నగరాల్లో ఇళ్లు, చిన్న భవనాలు కూలిపోయిన దృశ్యాలు స్థానిక మీడియాలో ప్రసారమయ్యాయి. మానిజలెస్‌లోని నియోగోతిక్ కేథడ్రల్‌లోని ఓటవర్ కూలి ప్రధాన ప్రార్థనా మం దిరంలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందినటు >>2




### తిరుమల శేషాచల కొండల్లో

## 'పవన' విద్యుత్

### రూ.6 కోట్ల వ్యయంతో 800 కిలోవాట్ల సామర్థ్యం

### 1.39 ఎకరాలలో గాలి టర్బైన్స్ ఏర్పాటు

### యేటా 16లక్షల యూనిట్ల ఉత్పత్తి లక్ష్యం

### టిటిడి అధికారుల ముమ్మర కసరత్తు

**తిరుమల, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం కొండల్లోని తిరుమలలో గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే >>2


సోమవారం కలిదిండి సభలో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు

## భూ రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రిఫార్మ్స్

>> మన్నారు. మీ భూమి మీ హక్కు దానిపై ఇతరులు పెత్తనం చేయడానికి వీల్లేదు. పాస్ పుస్తకాలపై గత పాలకులు ఫోటోలు ఎలా వేసుకుంటారు. 2019-24 మధ్య గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా రెవెన్యూ రికార్డులు ధ్వంసం అయ్యాయి. వారికి ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని డిజిటల్ గా 22ఏలో పెట్టేసి వివాదాస్పదం చేశారు. 2024లో అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయి. అప్పుడే వీటన్నిటినీ పరిష్కరిం చాలని నిశ్చయించుకున్నామన్నారు. ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ప్రతీ నెలా సమావేశాల ద్వారా వారిని కలుస్తున్నామన్నారు. . కరెన్సీకి ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టా దారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. వచ్చే ఏడు నెలల్లో 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేస్తాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'ఇప్పటి వరకూ 41 వేల ఎకరాల మేర భూ సమస్యలు క్లియర్ చేశాం. దీని ద్వారా 1.27 లక్షల మందికి పైగా రైతులు, పరిశ్రమలు, ప్రజలకు ప్రయోజన కలిగింది. 1.36 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశాం. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజ ముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలు జారీ చేసే వరకూ విశ్రమించమన్నారు.

కొల్లేరు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించేలా రూ.36 కోట్లను కైకలూరుకు మంజూరు చేశాం. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పదేపదే మరమ్మత్తులు వచ్చే రహదారులకు కూడా శాశ్వత పరిష్కారం ఉండేలా సిమెంట్ రోడ్లు వేయాలని ఆలోచన చేస్తున్నామన్నారు.

ఓ దౌర్భాగ్యపు పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. నక్సల్స్ నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా కేవలం ప్రజల కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నాను. రాయలసీమలో ఫ్యాక్షన్, హైదరాబాద్‌లో మత విద్వేషాలను కూడా సమర్థంగా నియంత్రించామన్నారు. ఆ తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి జరిగి సంపద పెరిగిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తే దానిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పూర్తి మెరిట్ తో ఉద్యోగాలు సంపాదించిన యువతను కించ పరిచేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోందన్నారు. ఢిల్లీలో నీట్ పరీక్ష పేపరు లీక్ అయితే..ఇక్కడ కూడా లోకేష్ రాజీనామా చేయాలని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారన్నారు. మెగా డీఎస్సీ లో ఉద్యోగాలు పొందిన టీచర్లు రోడ్లపైకి వచ్చి ర్యాలీ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎవరు ప్రజలకు ఇబ్బంది కలిగించినా వదిలి పెట్టేది లేదు అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సీఎస్ సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

## అర్హులందరికీ 'నేతన్న సేవలో' ఆర్థిక సాయం

>> పథకం కింద 200 యూనిట్లు, 500 యూనిట్లు అందజేస్తున్నామన్నారు. చేనేత కుటుంబాలకు మరింత ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సిఎం చంద్రబాబునాయుడు ఇటీవలే 'నేతన్న సేవలో' పథకానిక్కి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా 71,536 మందికి రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించామన్నారు. అర్హులు ఇంకా ఉన్నారన్న ఉద్దేశంతో దరఖాస్తులు కూడా స్వీకరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,678 మంది 'నేతన్న సేవలో' పథకానికి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారిలో అర్హులను గుర్తించి వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని మంత్రి సవిత తెలిపారు.

**ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదు రాకూడదు:** అంతకుముందు చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి సవిత తన ఛాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కల్పించాలన్నది సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' పథకానికి అర్హులకు అందజేయాలన్నారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హుల ను గుర్తించాలన్నారు. తమకు ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదులుగాని, దరఖాస్తులుగాని మరోసారి రాకూడదన్నారు. ఈ సమీక్షా సమావేశంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, వర్చువల్‌గా ఆయా జిల్లాలకు చెందిన ఎడిలు పాల్గొన్నారు.

## 'రూఫ్ టాప్ సోలార్'లో ఎస్‌పిడిసిఎల్ రికార్డు

>> పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద దేశవ్యాప్తంగా ఒక కోటి రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 415 మెగావాట్ల సామర్థంతో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయడంపై ఎపిఎస్పిడిసిఎల్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ పనుల్లో భాగంగా ప్రస్తుతం నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఇ) పోర్టల్ యుటిలిటీ లెడ్ ఆగ్రిగేషన్ (యుఎల్ఎ) అధికారిక గణాంకాల మేరకు 203.95 మెగావాట్ల సామర్థంతో 1.01 లక్షల గృహాలపై సోలార్ వ్యవస్థలను ఎస్పిడిసిఎల్ ఏర్పాటు చేసింది. మిగిలిన గృహాలకు కూడా సోలార్ ఏర్పాటు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల నుంచి అంగీకార పత్రాల స్వీకరణ నుంచి సౌర వ్యవస్థ ఏర్పాటు, తనిఖీ, గ్రిడ్ కు అనుసంధానం చేసే వరకు ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతోంది. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు తమ గృహాలపై సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, ఉత్పత్తి చేసిన విద్యుత్తును గ్రిడ్ కు పంపించడం ద్వారా సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతోంది.

**అధికారులు, సిబ్బందికి అభినందనలు:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో బాటు సంబంధిత ఏజెన్సీల సమన్వయంతో సోలార్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తోందని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించడంతోపాటు గ్రిడ్‌కు అనుసంధానం పనుల్లో సంస్థ 50 వేల మైలు రాయిని చేరుకోవడం చాలా సంతోషంగా వుంది. ఈ ప్రక్రియలో సంస్థ అధికారులు, సిబ్బంది, సోలార్ ఏజెన్సీల కృషి అభినందనీయం. ఇప్పటివరకు 1.01లక్ష గృహాలపై సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేశాం. మిగిలిన 1.06 లక్షల గృహాలపై కూడా నిర్ణీత గడువులోగా సోలార్ ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

## తిరుమల శేషాచల కొండల్లో 'పవన' విద్యుత్

>>తిరుమలలో కాకులకొండ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఈ విండ్‌పవర్ టర్బైన్స్‌తో కొంతమేరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూడా తిరుమలకొండపై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదు. ఇప్పుడు ఈ ఉత్పత్తిని మరింత పెంపొందించే దిశగా టిటిడి బోర్డు, అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. ఇప్పటికే తిరుమల శేషాచలంకొండలు పచ్చదనం పెంపుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ముందుకు వెళుతున్నారు. తిరుమల కొండలపై పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు టిటిడి సన్నాహాలు చేస్తోంది. గ్రీన్ ఎనర్జీని సమకూర్చుకునేలా నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. జీఎన్‌సి నర్సరీ సమీపంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రక్కనే ఈ విండ్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు టిటిడి 1.39 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ భారీ ప్రాజెక్ట్ కు మూడు నెలల్లో శ్రీకారం చుట్టనున్నారు. వీచే గాలిలోని శక్తిని ఉపయోగించి విద్యుత్‌ను తయారు చేసే పరికరం. తిరుమలలో నూతన విండ్ టర్బైన్ ఏర్పాటు కానుంది. ముంబైకి చెందిన ఓ ప్రముఖ రవాణా, మౌలిక సదుపాయాల సంస్థ ఈ అత్యాధునిక టర్బైన్‌ను టిటిడికి విరాళంగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అదనపు ఏర్పాట్లుతో ప్రతి సంవత్సరం దాదాపు 16 లక్షల యూనిట్ల పవన విద్యుత్ ఉత్పత్తి అవుతుందని టిటిడి ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పవన విద్యుత్ విధానంలో మాత్రం పరిమిత స్థలంలో 1.39 ఎకరాల్లోనే 16 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేయడానికి టర్బైన్‌ప్లాంట్‌ను నెలకొల్పుతున్నారు. టర్బైన్ ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంటును నేరుగా టిటిడి పరిధిలోని 11 కేవీ ఫీడర్‌కు అనుసంధానం చేస్తారు. ముంబైకి చెందిన విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎల్ఎల్‌పి అనే సంస్థ సుమారు రూ.6 కోట్ల వ్యయంతో 800 కిలోవాట్ల సామర్థం గల పవన విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. దీని ద్వారా టిటిడికి ఏటా సుమారు రూ.1.45 కోట్ల కరెంటు బిల్లుల భారం తప్పుతుంది. మూడు నెలల్లో ఈ నూతన టర్బైన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఉన్న తొమ్మిది విండ్ మిల్స్‌కు ఇది అదనంగా చేరుతుంది. ప్రస్తుతం తిరుమలలో వసతి గృహాలు, ఆలయాలు, ఇతర సేవల అవసరాల కోసం టిటిడి ప్రతి సంవత్సరం సుమారు ఆరు కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తోంది. ఇందులో దాదాపు కోటి యూనిట్ల విద్యుత్‌ను ఇప్పటికే ఉన్న పవన విద్యుత్ కేంద్రాల సహాయంతో సొంతంగా ఉత్పత్తి చేసుకుంటోంది. మిగిలిన అయిదు కోట్ల యూనిట్లను ఎపి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎస్‌పిడిసిఎల్)నుండి కొనుగోలు చేస్తోంది. ఈ విండ్ టర్బైన్ ఏర్పాటైన తరువాత ఈ కొనుగోలు వ్యయం గణనీయంగా తగ్గుతుందనేది భావిస్తున్నారు. విష్ విండ్ ఇన్ ఫ్రా సంస్థే ఈ టర్బైన్‌ను ఉచితంగా అందజేస్తుంది. దీన్ని ఏర్పాటుచేసిన తరువాత రానున్న 25 సంవత్సరాల పాటు ఎలాంటి అదనపు భారం లేకుండా ఉచితంగానే నిర్వహిస్తుంది. పాతికేళ్ల సుదీర్ఘ కాలపరిమితిలో టిటిడికి దాదాపు రూ.36.32 కోట్లు ఆదా అవుతాయనే అంచనా.

## నిఘా వైఫల్యంతోనే ఇంతియాజ్ హత్య



సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

>> గత ఎన్నికల్లో ఇంతియాజ్ బాషా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారని తెలిపారు. తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని అప్పట్లో వైసిపి వర్గీయులు ఇంతియాజ్‌ను బెదిరించారని, ఆయన ఇంటికి వెళ్లి గొడవకు దిగారని చెప్పారు. అనంతరం ఇంతియాజ్ టిడిపిలో చేరారని తెలిపారు. ఇంతియాజ్ బాషా హంద్రీ నదిలో వైసిపి కబ్జాలను, అక్రమాలను బయటపెట్టారని మంత్రి పేర్కొన్నారు. వైసిపి అక్రమాలను ప్రశ్నించినందుకే ఇంతియాజ్‌ను హత్య చేశారని ఆరోపించారు. గత రెండేళ్లలో కర్నూలులో మూడు హత్యలు జరిగాయని, ప్రతిహత్యలోనూ వైసిపి ప్రమేయం ఉందని మంత్రి ఆరోపించారు. ఇంతియాజ్‌ను చంపుతామని పరోక్షంగా వారం రోజుల ముందే సోషల్ మీడియాలో పోస్టులు వచ్చినా ఇంటెలిజెన్స్ వర్గాలుఎందుకు అంచనా వేయలేక పోయాయని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుందో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి" అని మంత్రి అన్నారు. గతంలో కావాలనే తన కార్యాలయం ఎదురుగా రెచ్చగొట్టే విధంగా వైసిపి నేతలు ర్యాలీలు నిర్వహించారని టిజి భరత్ తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పి, తన కార్యాలయం ఉన్న మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో నిరసనలు చేసుకునేలా చూడాలని కోరినప్పటికీ వైసిపి నేతల ధోరణిలో మార్పు రాలేదన్నారు. పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కర్నూలులో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వివరిస్తానని మంత్రి తెలిపారు. వైసిపి ధోరణి ఇలాగే ఉంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 1994 నుంచి 2004 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో కర్నూలులో ఫ్యాక్షనిజాన్ని అదుపులోకి తెచ్చామని టిజి భరత్ గుర్తు చేశారు. అవసరమైతే మళ్లీ కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలను అంతమొందించినట్లే, ఇప్పుడున్న రౌడీ మూకలను కూడా తుడిచిపెట్టేలా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి టిజి భరత్ స్పష్టం చేశారు.

## ఎఫ్‌సివి పొగాకు రైతుకు నష్టం రానివ్వం

>> జరిగిందన్నారు. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, సిగరెట్లకు సంబంధించిన పరిణామాలు తదితర కారణాలతో ధరలు తగ్గాయని పేర్కొన్నారు. పొగాకు బోర్డు ఏర్పడిన తర్వాత రైతుల సమస్యలపై ఈ స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి మరొకరు లేరని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆరుసార్లు గంటల తరబడి సమావేశాలు నిర్వహించి, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఈ సంక్షోభం నుంచి బయటపడేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర వాణిజ్య శాఖతో పాటు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తోను పలుమార్లు చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. పొగాకును నాలుగు గ్రేడ్లుగా విభజించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే తక్కువకు కొనుగోలు చేయవద్దని కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. బ్రైట్ గ్రేడ్‌కు కిలో రూ.230కు తగ్గకుండా, మీడియం గ్రేడ్‌కు రూ.190కు తగ్గకుండా, ఆఫ్‌స్టైల్‌కు రూ.130కు తగ్గకుండా, లో గ్రేడ్‌కు రూ.110కు తగ్గకుండా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఈ ధరలపై నిర్ణయం తీసుకున్నారని, అనంతరం కేంద్ర సహాయ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పొగాకు బోర్డు అధికారులు, ట్రేడర్లతో మాట్లాడి నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారని తెలిపారు. రేపటి నుంచి నాలుగు గ్రేడ్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే ప్లాట్‌ఫారమ్‌లపై కొనుగోళ్లు జరగాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవు' అని మంత్రి హెచ్చరించారు. పొగాకు బోర్డు రైతులు చెల్లించిన నిధులతోనే నడుస్తున్న నేపథ్యంలో రైతులకు తిరిగి అండగా నిలవాల్సిన బాధ్యత బోర్డుపై ఉందని కేంద్రానికి స్పష్టం చేశామని మంత్రి తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించి ప్రతి రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాలపాటు వడ్డీలేని రుణం అందించేందుకు అంగీకరించారని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దీనితోపాటు ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అండగా నిలవాలని నిర్ణయించిందన్నారు. 94 మిలియన్ కేజీల ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకుకు క్వింటాల్‌కు రూ.1,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించాలని నిర్ణయించిందని, అంటే కిలోకు రూ.10 మేర అదనపు సాయం అందుతుందని తెలిపారు.

## ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండ

>> మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఆర్థిక సాయం చెక్కును ప్రియాంక తండ్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ ప్రియాంక మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఇందుకు కారణమైన నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుని, వారికి కఠిన శిక్షలు పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంక చికిత్స పొందిన సమయంలో ఆసుపత్రిలో అయిన వైద్య ఖర్చులతో పాటు, ఆమె మెడికల్ పీజీ సీటుకు సంబంధించిన ఫీజు ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిస్తామని మంత్రి తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ముగిసిన అంత్యక్రియలు:** ప్రియాంక మృతదేహానికి సోమవారం గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. అనంతరం, పార్థివ దేహం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చేరుకుంది. అంత్యక్రియల్లో తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని ప్రియాంక మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రియాంక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్టు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రియాంక కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ప్రియాంక పాడే మోశారు.

## 100 మంది మృతి?

>> మేయర్ జార్జ్ ఎడువార్డో రోజాస్ తెలిపారు. భూకంపం అనంతరం ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బయటే ఉండాలని ఆయన సూచించారు. **సహాయక చర్యలు ముమ్మరం:** చోకో గవర్నర్ నూబియా కొర్డోబా మాట్లాడుతూ ప్రాంతీయ రాజధాని క్విబ్డోలో పలువురు గాయపడటంతో పాటు భవనాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అత్యవసర బృందాలు రంగంలోకి దిగాయి. నష్ట తీవ్రతను అంచనా వేస్తూ సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. కొలంబియా అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా శాన్ జోసే డెల్ పాల్మార్‌లో సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మీరు ఒంటరిగా లేరు. ప్రభుత్వం ఇక్కడే ఉంది చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కొలంబియాలోని మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో భూకంపాలు సాధారణమే అయినప్పటికీ, 6కి పైగా తీవ్రతతో కూడిన భూకంపాలు అరుదుగా సంభవిస్తాయి. 1999లో ఆర్మేనియా సమీపంలో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపంలో 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

## 3 డిమాండ్లపై స్పష్టత ఇవ్వండి

>>ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం పునరుద్ఘాటించారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన విద్యార్థుల ఆందోళనల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న కాల్పులపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయడం, విద్యార్థుల ఆందోళనల నిర్వహణపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పడం, అయోధ్య రామ మందిరంలో జరిగినట్లు ఆరోపిస్తున్న చోరీపై బాధ్యత వహించడం తమ ప్రధాన డిమాండ్లని తెలిపారు. విద్యార్థులపై కాల్పులు, బలప్రయోగానికి ఎవరు అనుమతిచ్చారో అమిత్ షా స్పష్టం చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ ప్రయోగించారని, విద్యార్థులపై గోళ్లతో కూడిన లాఠీలతో దాడులు జరిగాయని ఆరోపించారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చారా లేదా అన్నది హోంమంత్రి తేల్చి చెప్పాలని అన్నారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చి ఉంటే విద్యార్థులపై కాల్పులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని, తెలియకపోతే అది అసమర్థతకు నిదర్శనమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఆందోళనల నిర్వహణపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అమిత్ షా సాధారణ అంశాలపై ప్రసంగం చేయడం తమ డిమాండ్ కాదని, నిర్దిష్ట అంశాలపై స్పష్టమైన సమాధానాలు కావాలని చెప్పారు. అయోధ్య రామ మందిరంలో జరిగినట్లు ఆరోపిస్తున్న చోరీపై కూడా ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు. ప్రధానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులు రామ మందిరంలో చోరీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. గత 15 రోజులుగా ప్రధాని, హోంమంత్రి పార్లమెంట్‌కు వచ్చి ఈ అంశాలపై సమాధానం చెప్పేందుకు ముందుకు రాలేదని రాహుల్ ఆరోపించారు. ముందుగా కాల్పులకు ఎవరు అనుమతిచ్చారో స్పష్టత ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర అంశాలపై చర్చ జరగాలని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయి, సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హోంమంత్రి ప్రకటన, చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించకుండా సమాధానాన్ని వినాలని రిజిజు కోరారు. చర్చ ప్రారంభమైన తర్వాత అంశంపై సమగ్రంగా చర్చించవచ్చని తెలిపారు. కొనసాగుతున్న ప్రతిష్టంభప్రభుత్వం సమగ్ర చర్చకు సిద్ధంగా ఉందని చెబుతుండగా, ప్రతిపక్షం మాత్రం నిర్దిష్ట ప్రశ్నలకు ముందుగా సమాధానాలు ఇవ్వాలని పట్టుబడుతోంది. దీంతో పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమిత్ షా ప్రకటనతో ఇరు పక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు వచ్చి తదుపరి చర్చలకు వీలవుతుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్ : మంత్రి కందుల దుర్గేష్

**సచివాలయం,ఆగష్టు 10,ప్రభాతవార్త :**దేశంలోనే అత్యంత వైవిధ్యమైన పర్యాటక ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.ఏపి పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళేందుకు రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్,ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు,హోటల్ రంగానికి చెందిన ప్రముఖులతో మంత్రి దుర్గేష్ నేతృత్వంలో ఏపి పర్యాటక శాఖ సోమవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం మరియు విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అపారమైన పర్యాటక అవకాశాలున్నాయని,అధ్యాత్మిక,సాంస్కృతి, చారిత్రక,తీరప్రాంత ప్రకృతి క్రూయిట్ టూరిజం విరాజిల్లుతోందన్నారు.

## వెయిటింగ్‌లో ఉన్న ఎస్పీ రామాంజనేయులుకు కీలక బాధ్యతలు

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం ఎస్పీ(ఎన్‌సి) వెయిటింగ్‌లో ఉన్న ఎన్.వి రామాంజినేయులును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటన విభాగంలో ఎస్పీ(ఎన్‌సి)/ఆర్వీఅండ్ ఇఒగా నియమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్పీ (ఎన్‌సి), వెయిటింగ్‌లో ఎన్.వి. రామాంజనేయులు ఉన్నారు. రామాంజనేయులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హోంశాఖ ఆధ్వర్యంలో జిఒ ఆర్టీ నంబర్ 994 ద్వారా జి. విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## హౌసింగ్ శాఖ కార్యదర్శిగా కొర్లపాటి హెప్సీబా బాధ్యతల స్వీకరణ

కొర్లపాటి హెప్సీబా సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ శాఖ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె అధికారికంగా బాధ్యతలు చేపట్టి, హౌసింగ్ శాఖ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమెకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## పిపిపి పాలసీ -2026ను విడుదల చేసిన ప్రభుత్వం

**విజయవాడ,ఆగస్టు10,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పాలసీ 2026ను విడుదల చేసింది. స్వర్ణాంధ్ర విజన్2047కు అనుగుణంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు, పట్టణ మౌలిక వసతులు, వైద్యం, విద్య, పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం తదితర రంగాల్లో పీపీపీ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ.1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్ ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,500 కోట్ల స్టేట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రభుత్వం కేటాయించింది. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక మూలధన అవసరాలకు సర్కార్ భర్తీ చేయనుంది. ప్రారంభ దశలో ఆర్థికంగా లాభదాయకంగా లేని, భవిష్యత్తులో ఆదాయాన్ని సమకూర్చే అవకాశం ఉన్న ప్రాజెక్టులకు ప్రాజెక్ట్ వయబిలిటీ బ్రిడ్జి ఫండ్ ద్వారా వడ్డీలేని రుణాన్ని అందించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రైవేట్ రంగ పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం, నిర్వహణ సామర్థ్యాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్ట్ ప్రధానఉద్దేశమని పేర్కొంది. నాణ్యమైన ప్రజా సేవలను అందించడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూలమైన మౌలిక వసతుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పీపీపీ విధానాలను పరిశీలించడంతో పాటు, సంబంధిత స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు పీపీపీ పాలసీ2026ను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## కీలక అధికారుల బదలీలపై నిషేధం పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కీలక అధికారుల బదలీలపై నిషేధాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కీలక ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగులపై నిషేధాన్ని అక్టోబర్ 3 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కీలక అధికారుల బదిలీలకు బ్రేక్ పడనుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు జులై 1, 2026 అర్హత తేదీగా నిర్ణయించారు. ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం(ఈసీ) సవరించింది. దీని ప్రకారం, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగనుంది. అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ సవరించిన షెడ్యూల్ నేపథ్యంలో బదిలీల నిషేధాన్ని ఏపీ ప్రభుత్వం పొడిగించింది. ఈ నిర్ణయం ప్రకారం ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన కీలక అధికారులు అక్టోబర్ 3 వరకు అదే స్థానాల్లో కొనసాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పేరుతో జీవోఆర్టీనెం.1545 జారీ అయింది.

## మరుగుతున్న జార్ఖండ్

>> దంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

### ఏసీబీ అధికారి అంటూ ఘరానా మోసం

### రూ.40 వేల లంచం తీసుకున్న నిందితుడు అరెస్ట్

**పులివెందుల, ఆగస్టు 10: ప్రభాతవార్త:** ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా పరిచయం చేసుకొని వీఆర్వోకు డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీలో అనుకూల నివేదిక తెప్పిస్తానని నమ్మబలికి రూ.40 వేల లంచం తీసుకున్న నిందితుడిని పులివెందుల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పులివెందుల ఎస్‌డీపీవో బి. మురళి పర్యవేక్షణలో యూజీ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అర్బన్ సీఐ శ్రీరామ్ వివరాలు వెల్లడించారు.

## వారం - వర్జ్యం

11-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.చతుర్దశి రా.1.54 న.పునర్వసు ఉ.10.10
వ.సా.5.27-సా.6.54
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. రా.11.40-రా.12.31
రాహు. మ.3.00-సా.4.30 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** వచ్చిన ఒక సదవకాశమును సద్వినియోగ పరచుకోగలిగితే మేలు జరుగుతుంది. మిత్రుల కలయిక.

**వృషభం :** విధుల నిర్వహణలో గానీ, వ్యాపారములో గానీ, మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం :** రాజకీయములు, సంఘములు, యూనియన్లు మొదలగు కార్యములకు అనుకూలం. కాంట్రాక్టులు లభిస్తాయి.

**కర్కాటకం :** బంధువులతో కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయ సందర్శన చేస్తారు. ఆర్థికంగా మెరుగుపడుతుంది.

**సింహం :** మీరు చేపట్టే కార్యక్రమములకు చిన్న, చిన్న ఆటంకములు, ఎదురు అవుతాయి. వాహనయోగం కలదు.

**కన్య :** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను ఉన్నతాధికారులు సైతం పాటించడం మీకు సంతృప్తిని కలిగిస్తుంది.

**తుల :** గతములో మీరు పోగొట్టుకున్న ఉద్యోగమును తిరిగి పొందగలుగుతారు. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం :** మీ అధికార పరిధి, ఆర్థిక స్థితిగతులు మంచి ఫలితములనిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** చిన్ననాటి స్నేహితులను, తండ్రి సమకాలికులను కలుసుకొనుట జరుగుతుంది. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** అవకాశము ఉండీ సమాచారము అందని లోపము వలన ఆత్మీయులకు సాయపడలేనందుకు విచారిస్తారు.

**కుంభం :** సహోదర వర్గముతో ఏకత్వమును సాధించు యత్నములు ఓ దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమముల చర్చలు, అమలు చేయు పనులు వాయిదాపడతాయి. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలి

### 'అనే నేను శీర్షికతో తమ సంకల్పాన్ని తెలుపుతూ పోస్టు చేయాలి'

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామ్యం చేసే లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనే నేను కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని సమాచార పౌరసంబంధాల శాఖ డైరక్టర్ కె.ఎస్. విశ్వనాధన్ విజ్ఞప్తి చేశారు. భారతదేశ స్వాతంత్ర్యం లభించి 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆరోజు నాటికి వ్యక్తిగా తాము, తమ ప్రాంతం, దేశం ఏవిధంగా చెందాలని కోరుకుంటున్నారో తెలుపుతూ ప్రజలంతా సామాజిక మాధ్యమాలు వేదికగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. అదేవిధంగా తమ ప్రాంత, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో తాను ఏవిధంగా భాగస్వామ్యం కావాలనుకుంటున్నారో తెలుపుతూ 'అనే నేన్ను శీర్షికతో సామాజిక మాధ్యమాల్లో పోస్టుల ద్వారా తమ సంకల్పాన్ని తెలియజేయాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవంలోగా ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను తెలుపుతూ తమ సామాజిక మాధ్యమ అకౌంట్ల ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. పౌరులు తమ అభిప్రాయాలను అధికారిక సైట్లకు పంపాలని యాష్టా టాగ్‌లకు జత చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయాలని కోరారు.

## 'ఆ జిఒకు ఆ కథనానికి సంబంధం లేద్ను

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫార్చ్యూన్ ఇండియా పత్రికలో మంత్రి నారా లోకేశ్‌పై వ్యాసం కోసం రూ.కోటి పైగా ప్రభుత్వ ధనం ఖర్చు చేశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం స్పష్టం చేసింది. లోకేశ్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవోకు, ఫార్చ్యూన్ ఇండియా కథనానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 18-1-2025న జారీ చేసిన జిఒ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎపి పెట్టుబడి అవకాశాల ప్రచారం కోసం ఇచ్చిందని, ఓ ఆంగ్ల ఛానల్‌కు చెల్లింపులు చేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాలే ఆ జిఒలో ఉన్నాయని ఎపి సర్కార్ వెల్లడించింది. ఫార్చ్యూన్ ఇండియా, సిఎన్‌బిసి, టివి రెండు వేర్వేరు సంస్థలని, రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని సర్కార్ వివరణ ఇచ్చింది. జిఒను వక్రీకరించి మంత్రి నారా లోకేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ప్రజలకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించడం నేరమని హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. తప్పుడు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఎపి ప్రభుత్వం స్పష్టీకరించింది.

## డిసిపి కుమార్తె మృతిపై సిఎం, డి.సిఎం సంతాపం

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో విజయవాడ డిసిపి షరీన్ బేగం కుమార్తె మృతిపై సిఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. షరీన్ బేగం కుమార్తె అసిఫా మృతిచెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. 'అసిఫా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. చిన్న వయస్సులోనే ప్రమాదం బారినపడి దూరమవడం బాధాకరం. ఆసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా అని ఎక్స్ వేదికగా సిఎం స్పందించారు. షరీన్‌బేగం కుమార్తె మృతి పట్లు డి.సిఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఇది తీరని వ్యథ అని, షరీన్ బేగం నిబ్బరంగా ఉండాలన్నారు. పలువురు డిసిపిలు, ఎడిసిపిలు, ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలు ఇతర సిబ్బంది న్యూరాజ రాజేశ్వరీపేటలోని షిరీన్‌బేగం ఇంటికి వచ్చి ఆమెను పరామర్శించారు. డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా ఇతర పోలీసు ఉన్నతాధికారులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డిసిపి షిరీన్ బేగంను పరామర్శించి ఆసిఫాకు నివాళి అర్పించారు.

## 17 నుండి అసెంబ్లీ

### - సమావేశాల నిర్వహణపై నోటిఫికేషన్

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేది నుండి జరగనున్నాయి. ఈమేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ ఉత్వర్వులు జారీ చేశారు. 17వ తేదీ ఉ.9గం.లకు అసెంబ్లీ భవనంలోని అసెంబ్లీ హాల్లో శాసన సభ సమావేశాలు ప్రారంభం అవుతాయి. అదే రోజు శాసన మండలి సమావేశాలు అసెంబ్లీ భవనంలోని కౌన్సిల్ హాల్లో శాసన మండలి సమావేశాలు ప్రారంభవుమతాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.




# 'తల్లీబిడ్డ 'ఎక్స్‌ప్రెస్' వాహనాల్లో అత్యాధునిక భద్రతా సదుపాయాలు

**● '102' వాహనాల్లో ఎయిర్ బ్యాగులు ● సీట్ బెల్టులు, ఫుట్‌రెస్టులు సౌకర్యాల కల్పన - తొలిదశలో 300 అధునాతన వాహనాల రెడీ ● మిగిలిన 200 వాహనాలు త్వరలో సిద్ధం ● వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లీబిడ్డల సురక్షిత ప్రయాణానికి '102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సేవలకు ప్రభుత్వం కొత్త రూపునిస్తోంది. దేశంలోనే తొలిసారిగా తల్లీ బిడ్డల భద్రత, ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వాహనాలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మేరకు వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటన జారీ చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రూపు రేఖలు, బ్రాండింగ్‌ను ఖరారు చేశారు. తల్లులు, నవజాత శిశువులు సులభంగా ఎక్కడం, దిగడం, ప్రయాణంలో భద్రత, అవసరమైన సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని వాహనాలు రూపొందిస్తున్నారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో తల్లి, శిశువులకు ఎదురయ్యే రవాణా సమస్యను తొలగించడం, ప్రసవానంతర సంరక్షణను మెరుగుపరచడం, అధిక ప్రమాద (హైరిస్క్) గర్భిణులకు అవసరమైన సమయంలో రవాణా అందించడం ద్వారా మాతా, శిశు మరణాలను తగ్గించడమే ఈ సేవల ప్రధాన లక్ష్యం. కొత్త వాహనాల ప్రారంభ కార్యక్రమం ఆగస్టు 11న నరసరావుపేటలో జరగనుంది. మంత్రి సత్యకుమార్ యాదవ్ నూతన వాహన సేవలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి అనుగుణంగా జిల్లాల్లోనూ కొత్త వాహనాల సేవలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసావాలకు గర్భిణులకు మాత్రమే సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఈ మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన వారికి మాత్రమే ఉచిత వాహన సదుపాయం:** రాష్ట్రవ్యాప్తంగా '102 (తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు) సేవల్ని ఆధునిక విధానం మరింత విస్తరించేందుకు ప్రభుత్వం మొత్తం 500 వాహనాలను సమకూర్చుతోంది. తొలిదశలో 300 వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగిలిన 200 వాహనాలను త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సదరు జిల్లాల్లో ప్రసవాల ఆధారంగా ఈ వాహనాలు కేటాయించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన తల్లి, నవజాత శిశువును ఆసుపత్రి నుంచి ఇంటికి చేర్చే డ్రాప్‌బ్యాక్ సేవ పూర్తిగా ఉచితం. తల్లితో పాటు ఇద్దరు సహాయకులు కూడా ప్రయాణించవచ్చు. అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో రక్తమార్పిడి అవసరమైన గర్భిణులకు ప్రత్యేక పికప్, డ్రాప్‌బ్యాక్ సేవలు అందిస్తారు. 2025-26లో '102 సేవల ద్వారా 2,05,914 ప్రయాణాలు నిర్వహించారు. ఇందులో 1,65,093 ప్రసవానంతర డ్రాప్ బ్యాక్ ప్రయాణాలు, 40,821 హైరిస్క్ గర్భిణుల రవాణా సేవలు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను విద్యవేద ఫౌండేషన్ అండ్ మెసర్స్ శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు తాజాగా ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థనే సొంత వాహనాలను నడుపుతోంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 102సేవల కోసం ప్రభుత్వం రూ.37.40 కోట్ల ప్రతిపాదిత బడ్జెట్‌ను కేటాయించింది.

**భద్రతకు అధునాతన ఫీచర్లు:** కొత్త వాహనాలు ఎయిర్ కండిషన్డ్ ఎస్‌యువి/ ఎంయువి తరహాలో ఉంటాయి. గర్భిణులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ప్రత్యేక ఫుట్‌రెస్టులు, లోపల పట్టుకునేందుకు హ్యాండ్‌రెయిల్స్ ఏర్పాటు చేశారు. దురదృష్టవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాల్లో రక్షణగా ఉండేందుకు వాహనాల పక్కల కలిపి ఆరు ఎయిర్ బ్యాగులు ఉన్నాయి. వెనుక సీట్లకు సీట్‌బెల్టులు, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు, చైల్డ్ లాక్ స్లైడింగ్ డోర్లు, ఎబిఎస్, ఇబిడి, ఇఎస్‌పి, 80కి.మీ. వేగం దాటితే హెచ్చరించే స్పీడ్ అలర్ట్, అగ్నిమాపక పరికరాలు ఉన్నాయి. వాహనాల్లో ఉష్ణోగ్రత నియంత్రణతో ఎసి ఉంటుంది. నవజాత శిశువుకు అనుకూలమైన ఉష్ణోగ్రతఉండేలా దీనిని రూపొందించారు.

**అత్యవసరమైతే.. ఎస్ఓఎస్:** గర్భిణి కూర్చున్న సీటు వద్దే ఎమర్జెన్సీ ఎస్ఓఎస్ బటన్ ఏర్పాటు చేశారు. నొక్కగానే 102 కాల్‌సెంటర్‌కు సమాచారం చేరుతుంది. వాహనం ఉన్న ప్రదేశాన్ని లైవ్ జిపిఎస్ ద్వారా కంట్రోల్ సెంటర్‌కు పంపే వీలుంది. అవసరమైతే సమీప ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసి వైద్య సహాయం అందిస్తారు. వాహనాల్లో ఎఐఎస్- 140 ప్రమాణాలకు అనుగుణమైన జిపిఎస్/ విఎల్‌టిడి ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. జిపిఎస్‌తో పాటు భారత ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ నావిక్ ద్వారా ద్వంద్వ ఉపగ్రహ కవరేజీ లభిస్తుంది. డ్యూయల్ సిమ్ 4జీ, నెట్‌వర్క్ లేని సమయంలో సమాచారాన్ని నిల్వచేసే ఆఫ్‌లైన్ డేటా సదుపాయం, బ్యాకప్‌బ్యాటరీ ఏర్పాటు చేశారు.

**ప్రయాణంలోనే ఆరోగ్య సూచనలు:** ప్రయాణంలో ఫోన్ ఛార్జ్ చేసుకునేందుకు మొబైల్ ఛార్జింగ్ పోర్టులు, హ్యాండ్ శానిటైజర్, టిష్యూ పేపర్, స్టెయిన్‌లెస్ స్టీల్ డస్ట్‌బిన్, ఫస్ట్‌ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచారు. ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ఆడియో వ్యవస్థ ద్వారా ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశు సంరక్షణ, తల్లిపాలు, శిశువుల పోషణ, టీకాలు, ప్రమాద సంకేతాలు, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రభుత్వ సూచనలు వినిపిస్తాయి. డ్రైవర్ యాప్ మ్యాపింగ్, కాల్‌సెంటర్ అనుసంధానం, ఆర్‌సీహెచ్ ధ్రువీకరణలను ఐటీ వ్యవస్థలోకి తీసుకొచ్చారు. జిపిఎస్ ద్వారా వాహనం ఎక్కడ ఉందో తెలుసుకుని, అందుబాటులో ఉన్న వాహనాన్ని అవసరమైన చోటుకు కేటాయించడం, ప్రయాణాన్ని పర్యవేక్షించడం సులభమవుతుంది. రాష్ట్రంలోని ఏ ఫోన్ నుంచైనా టోల్‌ఫ్రీ 102ను సంప్రదించవచ్చు.

## పోలవరం ప్రాజెక్టు తొలిదశ మరో యేడాది పాటు పొడిగింపు

**● రాజ్యసభలో కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి వెల్లడి**



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు తొలిదశను మరో ఏడాది పాటు పొడిగించినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తొలిదశలో 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసేందుకు వీలుందని 2023 ధరల ప్రకారం దీని అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు కాగా, అందులో రూ.12,157.53 కోట్లు కేంద్రం గ్రాంటుగా వెల్లడించింది. అలాగే 2021-22 నుంచి 2025-26 వరకు ప్రాజెక్టుకు రూ.12,620.53 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం పేర్కొంది. నిర్మాణ పురోగతి విషయానికి వస్తే, స్పిల్‌వే మట్టి పనులు 96.8శాతం, కాంక్రీట్ పనులు 98.8శాతం, స్టీల్ పనులు 92.9శాతం పూర్తయ్యాయి. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ మట్టి పనులు 75.5శాతం, కాంక్రీట్ పనులు 81.9శాతం, స్టీల్ పనులు 81.3శాతం కాగా, ప్రధాన కాలువల మట్టి పనులు 98.9 శాతం, కాంక్రీట్ పనులు 88.4శాతం, స్టీల్ పనులు 55.6 శాతం పూర్తయ్యాయి. మొత్తం ప్రాజెక్టు వల్ల 96,660 మంది నిర్వాసితులు అవుతుండగా తొలిదశ నీటి నిల్వ కారణంగా ముంపునకు గురయ్యే 17,892 మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సహాయ పునరావాస చర్యల కోసం ఇప్పటివరకు రూ.1,373.01 కోట్లు ఖర్చు చేయగా, మొదటి దశ పునరావాసం పూర్తి చేయడానికి మరో రూ.1,581.08 కోట్లు అవసరమవుతాయని కేంద్రం స్పష్టం చేసింది. ఇక తాజా నిర్ణయంతో పోలవరం ప్రాజెక్ట్ 2027 మార్చినాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



## కేంద్ర మంత్రి అమిత్ షాతో టిడిపి ఎంపిలు భేటీ

విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సోమవారం టిడిపి ఎంపిల బృందం మర్యాదపూర్వకంగా కలిసారు. లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బైరెడ్డి శబరి, బికె పార్థసారథి, తెన్నేటి కృష్ణప్రసాద్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, చింతకాయల విజయ్, ఇతర ఎంపిలు అమిత్‌షాను కలిసారు. ఎపి రాజధాని అమరావతివిజన్, అభివృద్ధి పురోగతి, భవిష్యత్తు ప్రాధాన్యతను కళ్లకు కట్టేలా వివరించే ప్రత్యేక పుస్తకాన్ని కేంద్ర మంత్రికి ఎంపిలు అందజేసారు. అమరావతి గొప్పతనాన్ని వివరించేలా రూపొందించిన పుస్తకాన్ని ఎంపిల చొరవపై అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాష్ట్రాభివృద్ధికి మరింత సహకరించాలని ఎంపిలు అమిత్‌షాను అభ్యర్థించారు.

## రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు రెడీ

**● 13న సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం ● ప్రజాప్రతినిధుల నివాసాల టవర్లు అందుబాటులోకి**



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి చేరుకోవడానికి కీలకమైన రాదారుల్లో ఒకటిగా ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ నెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ప్రజాప్రతినిధుల టవర్లు ప్రారంభం ప్రారంభించనున్నారు. దీంతో ఈ కార్యక్రమానికి సీఆర్డీఏ అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. విజయవాడ-మంగళగిరి రహదారిని సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానించేందుకు బకింగ్‌హాం కెనాల్, గుంటూరు ఛానళ్లపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను ముఖ్యమంత్రి మొదట ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అపార్ట్‌మెంట్ టవర్ల వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 6 ఎమ్మెల్యే టవర్లు, 3 ఎమ్మెల్సీ టవర్లలో మొత్తం 207 అత్యాధునిక ఫ్లాట్లు సిద్ధం చేశారు. వాటి తాళాలను సిఆర్‌డిఎ అధికారులు సీఎంకు అందజేస్తారు. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల సమయంలో ప్రజాప్రతినిధులకు ఈ ఫ్లాట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం దొండపాడు నుంచి విజయవాడ - మంగళగిరి రోడ్డు వరకు 18.270 కిలోమీటర్ల మేర 9 వరుసల రహదారిగా సీడ్ యాక్సెస్ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. రాజధానిలో ఉత్తరం నుంచి దక్షిణానికి నిర్మిస్తున్న ప్రతి రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానమవుతాయి. దీన్ని తొమ్మిది వరుసల రహదారిగా నిర్మించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని మణిపాల్ ఆసుపత్రి వరకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడమే కాకుండా రాజధానిలో ఉత్తర - దక్షిణ రహదారులన్నింటినీ దీనికి అనుసంధానిస్తున్నారు. అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులు ప్రజలకు వేగవంతమైన పరిపాలనను చేరవేసేందుకు దోహదపడతాయి.

## లండన్‌లో పురపాలక శాఖ మంత్రి నారాయణ

### అమరావతి ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై కీలక చర్చలు



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించనున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై స్పష్టతనిచ్చేందుకు ఎపి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం లండన్‌లో పర్యటిస్తోంది. లండన్‌లోని 'ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ కార్యాలయాన్ని సందర్శించింది. అమరావతి రాజధానిలో నిర్మించబోయే ఐకానిక్ భవనాల డిజైన్లను గతంలో ఈ సంస్థే రూపొందించింది.
ఈ పర్యటనలో భాగంగా ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్‌అండ్‌టి ప్రతినిధులతో మంత్రి నారాయణ బృందం సుదీర్ఘంగా సమావేశమై, ఐకానిక్ భవనాల నిర్మాణ పురోగతిపై చర్చించింది. ముఖ్యంగా అమరావతి అసెంబ్లీ భవనంపై ప్రతిపాదించిన అత్యంత ఎత్తైన టవర్ నిర్మాణం గురించి ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. ఈ టవర్‌ను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే అంశంపై ఎల్‌అండ్‌టి సంస్థ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చింది. భవనాల వెలుపలి డిజైన్లలో మార్పులు, చేర్పులపై నార్మన్ ఫోస్టర్ ప్రతినిధులు పలు కీలక సూచనలు చేశారు. మంత్రి నారాయణతో పాటు సిఆర్‌డిఎ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు ఈ లండన్ పర్యటనలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా ఏర్పడే అవకాశం


**● మూడు రోజుల పాటు వానలు కురిసే అవకాశం**

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో బుధవారం నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్క జల్లు వానల నుంచి మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఈదురుగాలులు కొన్ని ప్రాంతాల్లో వీస్తున్నాయి. సోమవారం సాయంత్రం 5గంటల నాటికి అనకాపల్లి జిల్లా పరవాడలో 37.5మిమీ, విజయనగరం జిల్లా వేపాడలో 32.9మిమీ, అనకాపల్లి జిల్లా సాలపువానిపాలెంలో 32మిమీ, కొప్పాకలో 27.7మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. మంగళవారం విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు.

# గిరిజన సంస్కృతి పరిరక్షణతో పాటు విద్య, ఉపాధికి సమప్రాధాన్యత

**● గిరిజన కళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం ● గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్**

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, నృత్య రీతులను పరిరక్షించడంతో పాటు గిరిజన విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా రాష్ట్ర ప్రభుత్వం సమప్రాధాన్యత ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం 2026లో భాగంగా రెండో రోజు ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్, ఆర్ట్ ఎగ్జిబిషన్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలు, కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.మల్లిఖార్జున నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన సంస్కృతిని కాపాడుకుంటూనే ఆధునిక విద్యను అభ్యసించడం ద్వారా గిరిజనుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. థింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడంలో గిరిజన సంక్షేమ శాఖ చేసిన కృషిని ఆయన అభినందించారు.



ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్

మిగిలిన గిరిజన నృత్యాలు, కళారూపాలు, కళాకారులకు కూడా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ డైరెక్టర్ డా. మందారాణి స్వాగత ఉపన్యాసం చేస్తూ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (మైసూర్) భాగస్వామ్యంతో ఆరు గిరిజన భాషల్లో ప్రైమర్లు, నిఘంటువులను ఈమాడ్యూల్స్ రూపంలో రూపొందిస్తున్నామని తెలిపారు. సికిల్ సెల్ వ్యాధిపై గిరిజన భాషల్లో అవగాహన మాడ్యూల్స్ రూపొందించి ఐటిడిఎలకు అందించామని చెప్పారు. టెర్రకోట, క్లే మోడలింగ్, వెదురు ఉత్పత్తులు, పూసల తయారీ తదితర రంగాల్లో గిరిజనులకు ఉపాధి శిక్షణలు అందిస్తున్నామని తెలిపారు. గురుకులాల కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, కళలు వారి జీవన విధానంలో అంతర్భాగంగా ఉన్నాయని అన్నారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు విద్యే అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గొప్ప పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. థింసా, కొమ్ముకోయ, సవర ఆర్ట్, చెంచు చెంచాట, తప్పెటగుళ్లు, లంబాడీ తదితర గిరిజన కళారూపాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. యోగా తరహాలో గిరిజన నృత్యాలను కూడా పాఠశాల విద్యలో ఒక భాగంగా చేర్చి భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యానాది, నక్కల, చెంచు వంటి ప్రత్యేక గిరిజన తెగల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎసి సభ్యులు రావుల కొండలు, ఎస్టీ సెల్ నాయకులు ధారూ నాయక్, ట్రైకార్ ఎండి మణికుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ట్రైబల్ రీసెర్చ్ మిషన్ అధికారులు, గిరిజన కళాకారులు, విద్యార్థులు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 'సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసాం'

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త:** గత ఎన్నికల్లో కూటమిపార్టీలు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను సమర్థవంతంగా అమలు చేసామని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం తెలిపారు. విజయవాడలోని 13వడివిజన్‌లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి సోమవారం రెండేళ్ళ నమ్మకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండేళ్ళ అభివృద్ధిపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసారు. ఈసందర్భంగా పట్టాభి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీకోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ముమ్మినేని ప్రసాద్, టిడిపి నాయకులు గద్దె ప్రసాద్, చలసాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**VIJAYAWADA MUNICIPAL CORPORATION**
'E' Procurement Notice No.18/VMC/CDB/2026-27, Dt.10-08-2026
Roads, Drain, repairs, Monsoon works, maintenance works
(Total 151 works)-Est. Amount **Rs.1990.71 Lakhs.**
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @www.tender.apeprocurement.gov.in.
S/d- For COMMISSIONER

వార్త


పుస్తకాలు చదవాలనే అభిలాష ఉన్నవారు ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటారు.

- ఆస్కార్‌వైల్డ్

# మలి ప్రస్థానంలో 'జెన్‌జి'


ఒకటోసారి అనూహ్య విజయం. రెండోసారి 'జెన్‌జీ'కి తలొగ్గక తప్పలేదు. యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎవరైనా దిగిరావాల్సిందే. నిన్నమొన్నటి జెఎన్‌జి విజయం మరింత ముందుకు అడుగులు వేసే స్థాయికి యువతను ప్రేరేపిస్తోంది. ఆష్టరాల్ 'జెన్‌జి' అంటూ పెదవి విరచిన వారంతా వామ్మో! అని గొప్పగా చెప్పుకుంటున్నారు. జెన్‌జిని ఇగ్నోర్ చేయలేమని వాళ్ల ఉద్యమం దెబ్బకు రాజీనామా సమర్పించిన నాటి కేంద్రవిద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారు. 'జెన్‌జి' ఉద్యమం విషయంలో తొలుత కేంద్రప్రభుత్వ పెద్దలు మాత్రమే అంచనా వేయలేక అదెంత? అనుకుంటూ కాలయాపన చేసి 'జెన్‌జీ'కి ఓ స్పష్టమైన రూపం బహిర్గతమవడానికి కారణమయ్యారు. తాజాగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత, ప్రధాని మోడీ, మరెందరో ప్రముఖులు జెన్‌జి సత్తాను ఎత్తిపడేస్తున్నారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధనలోయువత బాధ్యులుకావాలని ప్రధాని నరేంద్రమోడీ క్రాక్‌చేల ఉద్యమానంతరం వాటి గురించి బహిరంగంగా విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడడం ఇదే ప్రథమం. ఐఐటి ఢిల్లీ 57వ వార్షికోత్సవ సభలో ప్రధాని మాట్లాడుతున్నారంటే యువత కేరింతలు కొట్టారు. యువత కాలేజీల్లోంచి బయటకు వెళ్తున్నారంటే వారు ఎదురు చూసేది తొలి జాబ్ ఆఫర్ కోసం. అందుకోబోతున్న మొదటి నెల జీతం కోసమేనన్నారు. దాదాపు ప్రపంచమంతా జెన్‌జి ఉద్యమాలతో సతమతమవుతుంటే భారత్ మాత్రం యువతను ఆ మధ్య పెద్దగా పట్టించుకున్నట్లు కనపడలేదు. తీరా ఇప్పుడు పట్టించుకోక తప్పలేదు. వికసిత్ భారత్ సాధనలో జెన్‌జీ తరం అవసరం ఎక్కువగా ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. యువత అధికంగా వినియోగించే సోషల్ మీడియా యాప్ 'స్నాప్ చాట్' తాజాగా తన అధికారిక చానల్‌ను ప్రారంభించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇదే అదనుగా ఇందిరా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అధికార ఎన్‌డిఎ ప్రభుత్వాన్నుద్దేశించి ఒక రాగాలాపన చేశారు. దేశంలో విద్యాప్రమాణాలు పడిపోవడమే కాకుండా యువతలో నైరాశ్యంలో మునిగిపోయిందని ప్రయాగ రాజ్ కెపి గ్రౌండ్స్‌లో జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. యువతకు సామర్థ్యాలున్నా ఉద్యోగావకాశాల్లేవని ఎత్తి చూపారు. ఇప్పుడు 'జెన్‌జి' విజృంభిస్తున్నది కేవలం కేంద్రప్రభుత్వ వ్యవహారశైలి మీదనే కాదు, జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆ రాష్ట్ర అసెంబ్లీని ముట్టడించారు. నిరసనల సమయంలో పెల్లెట్‌గన్ కాల్పుల, లాఠీచార్జిని ఎదుర్కొన్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహాబోరా మీద ఓ అంగతకుడు సిరా జల్లి దుర్భాషలు మాట్లాడడం అక్కడ ఉద్రిక్తతలకు దారితీసింది. అదంతా ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు డ్రామా ఆడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి. జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడమొక్కటే జార్ఖండ్ యువత కోరుకున్నారు. అది కూడా దాదాపు సాధించినట్లే. పేపరు లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై జార్ఖండ్ సర్కార్ దిగి వచ్చింది. అయినా విద్యార్థుల ఆందోళన ఆగలేదు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చి విజయవంతంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వద్ద ఉద్రికత్త మొదలైంది. ప్రభుత్వం కొన్ని అంశాల్లో తలొగ్గినా జార్ఖండ్ విద్యార్థులు పట్టువదల్లేదు. జెపిఎస్‌సి, జెఎస్‌ఎస్‌సి జడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరగడంతో తమ భవిష్యత్ నాశనమౌతోందని విద్యార్థుల ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో యువత క్రాక్‌చ్ పార్టీ నేతృత్వంలో ఆందోళన చేపట్టింది. అందులో పాల్గొన్న వారంతా యువత కనుక జెన్‌జి ఉద్యమంగా పిలువబడుతోంది. ఎంతో క్రమశిక్షణతో జరిగిన ఆ ఉద్యమం ప్రజల మన్ననలనూ అందుకుంది. రాజకీయులు ఆ ఉద్యమానికి రాజకీయ రంగు పులమాలని చూసినా ఎక్కడా ప్రత్యర్థులకు ఆ అవకాశం చిక్కనీయకుండా జాగ్రత్తపడ్డారు. యువత మలి అడుగు జార్ఖండ్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెంట పడింది. ఎలా అయినా ఈ ఉద్యమానికి మచ్చి ఊపుతేవాలని యువజనులంతా తాపత్రయపడ్డారు. జార్ఖండ్‌లో కూడా యువత ఆగ్రహావేశాలు తెంచుకున్నప్పుడు విద్యార్థి నేత దేవేంద్ర మహతోవారిని అదుపులో ఉంచి పోలీసులతో వాగ్వివాదానికి దిగొద్దని సూచించారు. ఇలాంటి ఉద్యమాల్లో ఎవరూ ఒక మాట మీద నిలబడే అవకాశం ఉండదు. అయినా క్రమశిక్షణగా మెలగడమే విశేషం. రాష్ట్రంలోని ఎన్నో జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, తదితర వాహనాల్లో అసెంబ్లీకి బయలుదేరారు. ఉద్యమాన్ని రక్తి కట్టించారు. పోలీసులు కూడా అసెంబ్లీలోకి ప్రవేశించబోయిన విద్యార్థులపై వాటర్ క్యాన్లు ఉపయోగించారు. బారికేడ్లు దాటి వచ్చిన విద్యార్థులను అదుపు చేయడం ఎంతోకష్టమైంది. నియామక ప్రక్రియలో సంస్కరణలు అవసరమని ముక్తకంఠంతో ఎలుగెత్తారు. క్రిమినల్ అంశాలను రాష్ట్ర సిఐడి దర్యాప్తుచేస్తుందని, 2023, 25బ్యాక్‌లాగ్ నియామకాలు అక్రమాల్లో దర్యాప్తు చేస్తామని అంగీకరించారు. ఢిల్లీలో యువత ఆందోళన తర్వాత వివిధ రాజకీయ పార్టీలు వారిని నడిపించే పార్టీలు సైతంయువత ఉద్యమాలపై తమతమఅభిప్రాయాలు మార్చుకున్నాయి. యువతను దేశ నిర్మాణ సాధ నాలుగా మార్చుకోవాలని ఆర్.ఎస్.ఎస్ చీఫ్ డా.మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. యువత ప్రశ్నించడాన్ని తప్పుపట్టలేమని, వారి ఆలోచనలను తొక్కి పారేయడం కన్నా దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలని సందేశం సారాంశం.

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ల లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మిమ్మల్ని బంధిస్తాయి.



హెచ్. లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు

### పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతి మించి పోతూవున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలుతప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యంమత్తులో వాహనాలు నడపొద్దనిఅధికారులుహెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటిపడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాల్లో అయితే ఇక చెప్పనక్కర్లేదు. మద్యం మత్తులో ఏం చేస్తున్నామో తెలియక మందుబాబులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రహదారులను సైతం అడ్డాగా మార్చుకొని మరీతాగుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో రాత్రి పూట తాగి సీసాలు పగుల గొట్టి, మలమూత్ర విసర్జనచేస్తూ అటు పాటశాలల వాతావరణం కలుషితం చేస్తూ వున్నారు. గది, కిటికీ అద్దాలు పగుల గొట్టడం వస్తువులను దొంగిలిస్తున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### వయిలెంట్‌గా మారుతున్న పిల్లలు

అక్రమ సంబంధాలు పెట్టుకుని భర్తలనుభార్యలు, భార్యలను భర్తలు అంతమొందిస్తున్నారు. కడుపున పుట్టిన పిల్లలు అడ్డుగా ఉన్నారనుకుంటే వారినీ కిరాతకంగా హత మారుస్తున్నారు. కన్నకూతుళ్లపైనే తండ్రులు అత్యాచారాలు చేస్తున్నారు. బాల్యం నుంచే పిల్లలు వాయిలెంట్‌గా ఉంటూ సమాజాన్ని హడలెత్తిస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత ఉండటం లేదు. ఆస్థి కోసం డబ్బుల కోసం కలహించుకుంటున్నారు. ఒకర్నొకరు మోసగించుకుంటున్నారు. స్నేహితులు కూడా ఇలానే ఉంటున్నారు. స్వార్థబుద్ధితో ప్రవర్తిస్తారని, దుష్ట ఆలోచనలతో ఉంటారని వీర బ్రహ్మంద్రే స్వామి ఎప్పుడో చెప్పారు.

- మిథునం, హైదరాబాద్

### సైబర్ నేరగాళ్ళ పట్ల జాగ్రత్త

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసాలకు పాల్పడుతూ అమాయక ప్రజలు అయిన రైతులు, ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉంటూ మీ వ్యక్తిగత వివరాలు ఎవరికి కూడా చెప్పరాదు. అపరిచితుల వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఇదెక్కడి విచిత్రం

రిజిస్టర్ చేద్దామని పోస్టాఫీసుకు వెళ్తే , డబ్బులు వద్దు ఫోన్ పే చేయండి అని పోస్టల్ వాళ్ళు చెప్తున్నారు. మోడీ వచ్చిన తరువాత రకరకాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. కేంద్రం తిక్కతిక్క వేషాలు వేస్తుంది. ఇంతకు ముందు రిజిస్టర్‌కు 26 రూపాయలు తీసుకునేవారు. ఇప్పుడది ఎత్తేసి మినిమం 55 రూపాయలు చేశారు. 150 కోట్ల జనాభాలో ఫోన్లు ఉపయోగించుకునేది ఎంతమంది? వారిలో ఫోన్ పే ఎంత మందికి తెలుసు? చదువుకున్నవారిలోనే చాలామందికి అదేంటో తెలియదు. డబ్బులు ఇస్తామంటే కాదు ..ఫోన్ పే చెయ్యాలి అనిచెప్పడం వెనుక ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ను ప్రోత్సహించటమా అనుమానంగా ఉంది. కొన్నిటికి రిజిస్టర్ చెయ్యాలంటే పోస్టల్ స్టాంపులు తీసుకోండి అంటున్నారు. గగతంలో ఇలా లేదు. డబ్బులు తీసుకొని వాళ్లే వేసేవారు. రైల్వే వాళ్ళు కూడా ఈ మధ్య టికెట్ ఇవ్వమంటే ఎదురుగా ప్రైవేట్ వాళ్ళదగ్గరకు వెళ్ళండి అని అంటున్నారు. ఇలాంటి వాటిని గట్టిగా ఎదుర్కోవలసి వస్తుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం

నీట్ పరీక్షాపేపర్ లీక్ ఉదంతం జరిగిన చాన్నాళ్ల తరువాత ప్రధాని మోడీ పెదవి విప్పారు. నీట్ పేపర్ లీక్ అవటం మహా పాపమని ఈ పాపానికి ఒడిగట్టిన వారిని శిక్షిస్తామని ఫాస్ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని అన్నారు. అన్నట్లుగానే ఆ పని వెంటన చేశారు. విద్యామంత్రి చేత రాజీనామా కూడా చేయించారు. అయితే ఇవన్నీ చేయడంవల్ల విద్యార్థులకు జరిగిన భారీ నష్టం భర్తీ అవుతుందా? చనిపోయిన వారు బతికి తిరిగొస్తారా? ఇలాంటివి జరగకుండా ముందే జాగ్రత్తపడాలి. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. అంతా అయిపోయాక ఎన్ని చేసినా ఏంటి ప్రయోజనం?

- శాస్త్రి, హైదరాబాద్

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఉపాధి హామీ లేక కొత్తగా వచ్చిన వీబీజీరామ్‌జీ పథకంలో భాగం అయిన ఉద్యోగుల కోరిక సహేతుకమైనది. వాళ్ళేమి నెల విడిచి సాము చేయడంలేదు. ఉద్యోగంలో స్థిరత్వం అడుగుతున్నారు. మీరు ఇచ్చిన హామీనే కదా మరి మీరెందుకు నాంచుతున్నారు. వాళ్లు కూడా ప్రభుత్వంలో భాగం కావాలి అనుకుంటున్నారు. మీ ఆలస్యమవుతున్న నిర్ణయం వల్ల వాళ్ళ కుటుంబాలు మాత్రమే కాదు ఉపాధి కూలీలు కూడా నష్టపోతున్నారు. ఇదిగ్రామీణ ఆర్థికవ్యవస్థను అస్థిర పరుస్తుంది.

-భారత అవినాష్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# మట్టి టోకెన్ల నుంచి ప్లాస్టిక్ నోట్ల వరకు..

**గతదశాబ్దంలో ప్రపంచం, ముఖ్యంగా భారతదేశం, పెద్దమార్పునుచూసింది. యూపీఐ, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. అయితే ఇవి కొత్త కరెన్సీలుకావు. రూపాయివంటి ప్రస్తుత కరెన్సీలను వినియోగించే కొత్తచెల్లింపు పద్ధతులు మాత్రమే. మట్టి టోకెన్లతో ప్రారంభమైన కరెన్సీ ప్రయాణం లోహనాణేలు, కాగితపునోట్లు, ఇప్పుడు పాలిమర్ నోట్లవరకు చేరుకుంది. ప్రతి దశ వెనుక ఒకే లక్ష్యంఉంది. లావాదేవీలను మరింత సురక్షితంగా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చడం. రేపుసాంకేతిక పరిజ్ఞానం మరింత ముందుకు వెళితే కరెన్సీ మరోకొత్త రూపాన్ని సంతరించుకోవచ్చు. అందువల్ల పాలిమర్‌నోట్లు కరెన్సీ పరిణామానికి చివరి మజిలీకావు.**



కృష్ణ బాలాజి పల్లపోతు

ఇటీవల భారత ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు 10, 20 రూపాయల నోట్లకు అదనంగా పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, సింగపూర్ వంటి అనేక దేశాలు పాలిమర్ నోట్లు చెలామణిలో ఉన్నాయి. ఎక్కువకాలం మన్నడం, నీటికి తడవకపోవడం, అనుకరణ మరింత కష్టతరం వంటి ప్రయోజనాల వల్ల ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా వేగం పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో మట్టి టోకెన్ల నుంచి ప్లాస్టిక్ నోట్ల వరకు సాగిన ఈ ఐదు వేల ఏళ్ల కరెన్సీ ప్రయాణాన్ని సింహావలోకనం చేసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. నాగరికత ప్రారంభంలో ప్రపంచమంతా వస్తు మార్పిడి (బార్టర్) పద్ధతిపైనే ఆధారపడేది. కరెన్సీ అవసరం లేకుండానే, లావాదేవీల నికర విలువ ఆధారంగా వస్తుమార్పిడి జరిగేది. అయితే ఈ విధానంలో ఆర్థికశాస్త్రంలో 'డబుల్ కోఇన్సిడెన్స్ ఆఫ్ వాంట్స్' గా పిలిచే ఒక ప్రధాన సమస్య ఎదురయ్యేది. ఒకే సమయంలో ఇరువురికీ అవతలి వ్యక్తి వద్ద ఉన్న వస్తువే అవసరమై ఉండాలి. ఈ ఇబ్బందే మరింత సమర్థవంతమైన మార్పిడి వ్యవస్థ అవసరాన్ని సృష్టించి, కరెన్సీ పుట్టుకకు నాంది పలికింది. ఆసక్తికరంగా, వస్తు మార్పిడి సూత్రం పూర్తిగా కనుమరుగై పోలేదు. నేటికీ స్టాక్ ఎక్స్ఛేంజీల క్లియరింగ్ వ్యవస్థల్లో, కొన్ని అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీల్లో, పరస్పర బాకీల నెట్టింగ్ విధానంలో ఇదే భావన ఆధునిక రూపంలో కనిపిస్తుంది. లావాదేవీలు చాలావరకూ ఒకదానితో వేరొకటి పరిష్కారం అయిపోగా, నికర విలువ మాత్రమే చేతులు మారుతుంది. సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం మెసపొటేమియాకు చెందిన సుమేరియన్, అక్కాడియన్ నాగరికతల్లో ధాన్యం, నూనె, పశువులు వంటి వస్తువుల విలువను సూచించే మట్టి టోకెన్లు ఒక నిర్దిష్ట విలువను సూచించే ప్రతీకలుగా ఉపయోగించబడేవి. వాణిజ్య లావాదేవీలు, గిడ్డంగి నిల్వలు, పన్నులు మొదలైన వాటి లెక్కల నిర్వహణకు టోకెన్లు ఉపయోగపడేవి. వాస్తవానికి ఈటోకెన్ల ఆధారంగా లావాదేవీలను నమోదు చేయాల్సిన అవసరమే మానవ చరిత్రలో 'లిపి' అభివృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చరిత్రకారులు భావిస్తున్నారు. అందుకే మట్టి టోకెన్లు తొలినాటి కరెన్సీగా మాత్రమే గాక అకౌంటింగ్, పరిపాలన, నాగరికత పరిణామంలో కూడా ఒక కీలక మైలురాయిగా నిలిచాయి. వాణిజ్యం విస్తరించడంతో మరింత విశ్వసనీయమైన మార్పిడి సాధనం అవసరమైంది. ఫలితంగా బంగారం, వెండి, రాగి వంటి లోహాలతోనాణేలు తయారయ్యాయి. లోహానికి సహజసిద్ధమైన విలువ ఉండటం, దీర్ఘకాలం మన్నడం వల్ల అవి వేగంగా ప్రజాదరణ పొందాయి. భారతదేశం కూడా ఈ రంగంలో అగ్రస్థానంలోనే నిలిచింది. ప్రాచీన పంచ్‌మార్క్ నాణేలు, మౌర్యులు, శాతవాహనులు జారీ చేసిన నాణేలు భారతదేశపు సమృద్ధమైన ద్రవ్య చరిత్రకు నిదర్శనం. విజయనగరసామ్రాజ్యం జారీ చేసిన బంగారు పగోడా (వరాహ) నాణేలు దక్షిణ భారతదేశంలోనే కాకుండా హిందూ మహాసముద్ర వాణిజ్యంలోనూ విశ్వసనీయ కరెన్సీగా గుర్తింపు పొందాయి. నాణేలు కేవలం లావాదేవీల సాధనాలుగానే కాకుండా, రాజవంశాల కాలక్రమం, పాలకుల పేర్లు, బిరుదులు, మత విశ్వాసాలు, ఆర్థిక పరిస్థితులను పునర్నిర్మించడంలో చరిత్రకారులకు అమూల్యమైన ఆధారాలుగా ఉపయోగపడ్డాయి. లోహ నాణేలు విశ్వసనీయమైనవే అయినప్పటికీ, వాటిని భారీ సంఖ్యలో ముద్రించడం, రవాణా చేయడం, పెద్ద మొత్తాల



లావాదేవీల్లో వినియోగించడం క్రమంగా భారంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో తోలు, వస్త్రం వంటి ప్రత్యామ్నాయాలను పరిమితంగా ఉపయోగించబడ్డాయి. అయితే తక్కువబరువు, తక్కువ ముద్రణా వ్యయం, సులభమైన రవాణా, పెద్ద మొత్తాల చెల్లింపులకు అనుకూలత కారణంగా కాగితపునోట్లు ప్రపంచవ్యాప్తంగా క్రమంగా విస్తరించాయి. ఈ సందర్భంలో, కరెన్సీ దానికి ఆపాదించిన విలువను ఎలా సంతరించుకుంటుందనేది ఆసక్తికరమైన అంశం. తొలినాళ్లలో బంగారం, వెండి నాణేల విలువ వాటిలోని లోహం విలువకు దగ్గరగా ఉండేది. దీనిని అంతర్గత విలువ (ఇంట్రిన్సిక్ వ్యాల్యూ) కలిగిన ద్రవ్యంగా భావించవచ్చు. కానీ, ఉదాహరణకు ప్రస్తుతం రూ.100 నోటు తయారీ ఖర్చు రూ.100 కాదు. అంత కంటే ఎంతో తక్కువ ఉంటుంది. అంటే, వాటి విలువ లోహంలోనో, కాగితంలోనో లేదు. దానిని జారీ చేసిన ప్రభుత్వం, కేంద్ర బ్యాంకుపై ప్రజలు ఉంచిన విశ్వాసంలోఉంది. ఇలాంటి ద్రవ్యాన్నే టోకెన్‌కరెన్సీ లేదా ఫిద్యూషియరీ కరెన్సీ అంటారు. ఈవ్యవస్థ అమలులో ఉన్నందు వలన దేశ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు కొత్త నోట్లను ప్రవేశపెట్టగలుగుతున్నాయి. పాత నోట్లను ఉపసంహరించుకోగలుగుతున్నాయి. అవసరమైతే కరెన్సీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టగలుగుతున్నాయి. భారతదేశంలో పెద్ద నోట్లరద్దు, బ్రెజిల్, టర్కీవంటి దేశాల్లో తీవ్రమైన ద్రవ్యోల్బణం తరువాత చేపట్టిన కరెన్సీ సంస్కరణలు దీనికి ఉదాహరణలు. ప్రపంచంలో అప్పటికే అమలులో ఉన్న టోకెన్ కరెన్సీ భావనను, భారతదేశంలో అత్యంత సాహసోపేతంగా అమలు చేయడానికి ప్రయత్నించిన పాలకుడు మహమ్మద్ బిన్ తుగ్లక్. 14వ శతాబ్దంలో ఆయన వెండి నాణేలకు ప్రత్యామ్నాయంగా రాగి, ఇత్తడితో టోకెన్ కరెన్సీని హడావిడిగా ప్రవేశపెట్టాడు. అయితే నకిలీనాణేలను అరికట్టే సాంకేతికత, కఠిన నియంత్రణ వ్యవస్థలు లేకపోవడంతో ప్రజలు పెద్దఎత్తున నకిలీనాణేలను తయారుచేశారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై, చివరకు తుగ్లక్ తన ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. కానీ తుగ్లక్ ప్రయోగం టోకెన్ కరెన్సీ విజయవంతం కావాలంటే ప్రజల విశ్వాసాన్ని కాపాడగల సాంకేతికత, సమర్థమైన పరిపాలనా వ్యవస్థ అవసరమనే విషయాన్ని మాత్రం స్పష్టం చేసింది. మన్నిక, పరిశుభ్రత, నకిలీ నిరోధకత వంటి అంశాల్లో కాగితపు నోట్లు ఎదుర్కొంటున్న పరిమితులను అధిగమించేందుకు అనేకదేశాలు పాలిమర్ (ప్లాస్టిక్)నోట్లను ప్రవేశపెడుతున్నాయి. ఇవి ఎక్కువకాలం మన్నుతాయి. నీటికి తడవవు. ఆధునిక భద్రతా లక్షణాల వల్ల నకిలీ చేయడం మరింత కష్టతరం. నోట్ల జీవితకాలం పెరగడంతోదీర్ఘకాలంలోముద్రణ వ్యయం కూడా తగ్గేఅవకాశం ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందడం, నకిలీ కరెన్సీని అరికట్టాల్సిన అవసరం పెరగడంవంటి కారణాలతో, ఇంతకు ముందే ప్రతిపాదించిన ఈప్రయత్నం మరోసారి ఊపందుకుంది. 'ప్లాస్టిక్' అనగానే సహజంగానే పర్యావరణంపై సందేహాలు తలెత్తుతాయి. అయితే, పాలి మర్ నోట్లు కాగితపు నోట్లకంటే రెండు నుంచి నాలుగురెట్లు ఎక్కువకాలం మన్నడం వల్ల కొత్త నోట్ల ముద్రణ, రవాణా, భర్తీ ప్రక్రియలకు అవసరమయ్యే ముడి పదార్థాలు, ఇంధన వినియోగం తగ్గే అవకాశం ఉంటుంది. వాటిని పునర్వినియోగం చేయడం కూడా సాధ్యమే. అందువల్ల పర్యావరణ ప్రభావాన్ని కేవలం తయారీ పదార్థం ఆధారంగా కాకుండా, మొత్తం జీవితచక్రం ఆధారంగా అంచనా వేయడం అవసరం. అయితే పాలిమర్ నోట్ల పర్యావరణ ప్రయోజనాలు, వినియోగానంతరం వాటిని సమర్థంగా సేకరించి, పునర్వినియోగం చేయగల వ్యవస్థ ఉన్నప్పుడే పూర్తిగా సాకారమవుతాయి. గతదశాబ్దంలో ప్రపంచం, ముఖ్యంగా భారతదేశం, పెద్దమార్పునుచూసింది. యూపీఐ, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. అయితే ఇవి కొత్త కరెన్సీలుకావు. రూపాయివంటి ప్రస్తుత కరెన్సీలను వినియోగించే కొత్త చెల్లింపు పద్ధతులు మాత్రమే. మట్టి టోకెన్లతో ప్రారంభమైన కరెన్సీ ప్రయాణం లోహ నాణేలు, కాగితపు నోట్లు, ఇప్పుడు పాలిమర్ నోట్లవరకు చేరుకుంది. ప్రతి దశ వెనుక ఒకే లక్ష్యంఉంది. లావాదేవీలను మరింత సురక్షితంగా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చడం. రేపు సాంకేతిక పరిజ్ఞానం మరింత ముందుకు వెళితే కరెన్సీ మరోకొత్త రూపాన్ని సంతరించుకోవచ్చు. అందువల్ల పాలిమర్‌నోట్లు కరెన్సీ పరిణామానికి చివరి మజిలీకావు. మానవ నాగరికతఆర్థిక ప్రయాణంలో మరోసహజమైన మైలురాయి మాత్రమే. •

# బలమైన ప్రతిపక్షం చరిత్రాత్మక అవసరం

సురేష్ కాలేరు

ప్రతిపక్షాల పునర్నిర్మాణమే ప్రజాస్వామ్యానికి బలం భారతదేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ప్రతి దశలోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా కొత్త రాజకీయ శక్తులు, కొత్త భావజాలాలు ఆవిర్భవించాయి. స్వాతంత్ర్యానంతరం భారత జాతీయ కాంగ్రెస్ దేశ రాజకీయాలను దశాబ్దాల పాటు ప్రభావితం చేసింది. అనంతరం అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) నేపథ్యంలో జనతా పార్టీ ఆవిర్భావం, ప్రాంతీయ పార్టీల ఎదుగుదల, సామాజిక న్యాయ ఉద్యమాల ప్రభావంతో వెనుకబడిన వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం వంటి పరిణామాలు భారత ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతం చేశాయి. మండల్ ఉద్యమం, రైతాంగ పోరాటాలు, దళిత బహుజన ఉద్యమాలు, ప్రాంతీయ స్వాభిమాన ఉద్యమాలు దేశ రాజకీయాలకు కొత్త దిశను చూపించాయి. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడంద్వారా సమాఖ్య వ్యవస్థ మరింత బలపడింది. కేంద్రరాష్ట్ర సంబంధాలపై కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే గత దశాబ్దంలో బిజెపి దేశ రాజకీయాల్లో ప్రధాన శక్తిగా ఎదిగింది. బలమైన సంస్థాగత నిర్మాణం, విస్తృత ఎన్నికల వ్యూహం, నాయకత్వ కేంద్రీకరణ, సంక్షేమ పథకాల ప్రచారం, డిజిటల్ ప్రచార వ్యవస్థ వంటి అంశాలు ఆపార్టీ విజయాలకు దోహదపడ్డాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అనేకరాష్ట్రాల్లో కూడా ఆ పార్టీ తన ప్రభావాన్ని విస్తరించగలిగింది. ఇదే సమయంలో ప్రతిపక్ష రాజకీయాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. భావజాల స్పష్టత లోపించడం, నాయకత్వ విభేదాలు, ప్రాంతీయ ప్రయోజనాలకే పరిమితమవడం, సమన్వయ లోపం, దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజల ముందుంచడంలో వైఫల్యం వంటి కారణాలు ప్రతిపక్షాల బలహీనతకు దారితీశాయి. కేవలం అధికార వ్యతిరేకత సరిపోదు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే విధానాలు, విశ్వసనీయ నాయకత్వం, కార్యాచరణ కూడా అవసరం. ఈనేపథ్యంలో కాంగ్రెస్, వివిధ ప్రాంతీయ పార్టీలు, రైతు, కార్మిక, విద్యార్థి, మహిళా, దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల ప్రజా సంఘాలు పరస్పర సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే అలాంటి సమన్వయం రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలు, విధానాలపై ఆధారపడాలి. కేవలం ఎన్నికల కూటమిగా మాత్రమే పరిమితం కాకూడదు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, సమాఖ్య వ్యవస్థ, పారదర్శక పరిపాలన, ఉపాధి, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఆర్థికాభివృద్ధి వంటిఅంశాలపై ప్రత్యామ్నాయ కార్యాచరణను ప్రజలకు వివరించగలిగితేనే బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడే అవకాశంఉంటుంది. భారత ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే అధికార పక్షంఎంత బలంగా ఉండాలో, అంతేబలమైన, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కూడా అవసరం. అధికారాన్ని ప్రశ్నించే స్వరం ప్రజాస్వామ్యానికి అంతర్భాగం. అదే సమయంలో ప్రతిపక్షం కూడా విమర్శలతో పాటు నిర్మాణాత్మక సూచనలు, అమలు చేయగల విధానాలను ప్రజల ముందుంచాలి. భారత రాజకీ యాల భవిష్యత్తు ఒకే పార్టీ విజయం లేదా ఓటమితో నిర్ణ యించబడదు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే రాజకీయ వ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తినికాపాడే ప్రజాస్వామ్య సంస్కృతి, సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేసే విధానాలు, బాధ్యతాయుత రాజకీయ పోటీ ఇవే దేశ ప్రగతికి నిజమైన పునాదులు. •

# యువశక్తికి మత్తు సంకెళ్లు - వికసిత్ భారత్‌కు ముప్పు

రామ కిష్టయ్య సంగన భట్ల

సమగ్ర ప్రగతికి, సుస్థిర వికాసానికి, ఆర్థిక పురోగతికి భావి భారత పౌరులే ప్రధాన శక్తులు. 'యువతయే దేశానికి వెన్నెముక' అనే ఆర్యోక్తి ఊరికే రాలేదు. నేడు జగత్తులోనే అత్యధికంగా పాతికేళ్ల లోపు వయస్సు ఉన్న యువజన జనాభా కలిగిన సమ్మోహన శక్తిన కలిగిన ఏకైక దేశం మన భారతదేశం. ఈ అనంతమైన శారీరక, మానసిక, సృజనాత్మక శక్తి సరైన దిశలో పయనిస్తే 'వికసిత భారత్ 2047' స్వప్నం నెరవేరడం తథ్యం. కానీ, సరిగ్గా ఇదే సమయంలో మన దేశ ప్రగతిని దెబ్బతీయడానికి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడానికి మాదకద్రవ్యాలనే విష నాగులు సమాజంలోకి జొరబడుతున్నాయి. ఈ వ్యసన భూతం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాకుండా కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నంచేస్తూ, సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, అంతిమంగా దేశ ఆర్థిక పురోగతికి తీవ్ర ప్రతిబంధకంగా మారుతోంది. నూతన యుగంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అంతే వేగంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థ రూపాంతరం చెందుతోంది. చీకటి జాలం, గూఢ ధనాలు, సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని కృత్రిమ మత్తు పదార్థాలు, రసాయన మత్తు బిళ్లలు, హెరాయిన్ వంటి ప్రమాదకర పదార్థాలు నేడు విద్యాసంస్థల ముంగిటకు చేరుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు ముప్పై కోట్లకు పైగా ప్రజలు వివిధ రకాల మాదకద్రవ్యాల బారిన పడి ఉన్నారు. భారతదేశ విషయానికి వస్తే, జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలో సుమారు మూడు కోట్ల మందికి పైగా గంజాయిని, రెండుకోట్ల మందికి పైగా అఫీము ఆధారిత పదార్థాలను, దాదాపు కోటి మందికి పైగా వివిధ రకాల ప్రమాదకర నిద్రమాత్రలను వినియోగిస్తున్నారు. ఇందులో అత్యధిక భాగం పదిహేను నుంచి ముప్పై ఐదు సంవత్సరాల మధ్య వయస్సు గల పాఠశాల, కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, పట్టణ ప్రాంతవాసులే ఉండటం అత్యంత విచారకరం. మత్తు పదార్థాల వ్యాపారం కేవలం స్వదేశీ విక్రేతల వ్యాపారం మాత్రమే కాదు, దీని వెనుక అంతర్జాతీయ నేర ముఠాలు, సరిహద్దు అవతలి శత్రుదేశాల కుట్రలు దాగి ఉన్నాయి. దీనినే 'మత్తు తీవ్రవాదం' అంటారు. పంజాబ్, జమ్మూ కాశ్మీర్, గుజరాత్ తీరప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల గుండావిమాన రహిత యంత్రాలు, సముద్ర మార్గాలు, రవాణా వాహనాల ద్వారా దేశంలోకి వేల కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలను తోస్తున్నారు. భారతదేశ యువశక్తిని మానసికంగా, శారీరకంగా వికలాంగులను చేయడం ద్వారా భారత ప్రజాస్వామిక, ఆర్థిక శక్తులను బలహీనపరచాలనేది ఈ దేశ వ్యతిరేక శక్తుల ప్రధాన వ్యూహం. ఒకసారి ఈ వ్యసనంలో కూరుకుపోతే వ్యక్తి ఆలోచనా శక్తి నశిస్తుంది. తీవ్ర మానసిక రుగ్మతలతో పాటు కాలేయం, గుండె, నరాలవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటాయి. విద్య, ఉద్యోగాలు కోల్పోయి, నేరపూరిత కార్యకలాపాల వైపు అడుగులు వేయడం ద్వారా కుటుంబ



శ్రేయస్సు పూర్తిగా నాశనమవుతుంది. ఈ తీవ్రమైన సంక్షోభాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణాన్ని ఒక ప్రాధాన్య జాతీయ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఆగస్టు రెండున అద్భుతమైన 'మత్తు రహిత యువత - వికసిత భారత్ సంకల్ప ఉద్యమం' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించారు. 'మాదకద్రవ్య రహిత యువతే వికసిత భారత్-2047 లక్ష్యానికి బలమైన పునాది'అని చాటిచెప్పిన ఈ కార్యక్రమంలో ఒకేసారి దేశవ్యాప్తంగా కోటికి పైగా యువత మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ పూనడం అపూర్వ చరిత్రను తిరగరాసింది. ఈ ఉద్యమం కేవలం ఒక ప్రభుత్వ ఆదేశంగా కాక, ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఒక చైతన్య వంతమైన ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ వేదికను ఉపయోగించి కోట్ల మంది వాలంటీర్లను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఈ ఉద్యమం ద్వారా జాతీయస్థాయి ప్రశ్నోత్తరి, వ్యాసరచన, చిత్రలేఖనం, నినాదాల రచనలు నిర్వహించడం జరుగుతోంది. నాటికలు, అభినయ ప్రదర్శనలు, జానపద గేయాలు, వీధి నాటకాలు, లఘు చిత్రాల ద్వారా మత్తు పదార్థాల దుష్పరిణామాలను గ్రామీణ స్థాయిలోని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. యువతను క్రీడా రంగానికి ఆకర్షితులను చేస్తూ, మానసిక ఉల్లాసానికి స్థానిక క్రీడా పోటీలు, యోగా సాధన, మానసిక పరిపక్వత సలహాలు, ఉచిత వైద్య తనిఖీ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో యువజన సంఘాలను ఏర్పాటు చేసి, మత్తుకు బానిసలైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు పంపేలా నడిపిస్తున్నారు. ఈబృహత్తర ప్రచార కార్యక్రమం ఆగస్టు పద్నాలుగున నిర్వహించబోయే 'జాతీయ యువ సమ్మేళనం' తో ముగియనుంది. మత్తు రహిత సమాజ స్థాపనకు కేవలం ప్రచారం మాత్రమే సరిపోదు, దీనికి బహుముఖ వ్యూహం అవసరం. ఒకవైపు చట్టపరమైన ఉక్కుపాదం, మరొకవైపు పునరావాసం కలగలిపి పనిచేయాలి. మత్తు పదార్థాల నియంత్రణ సంస్థ, రాష్ట్ర పోలీసులు, తీర రక్షక దళం, సుంకముల శాఖల మధ్య మెరుగైన సమన్వయంతో సరిహద్దులలో నిఘాను తీవ్రతరం చేయాలి. పాఠశాలలు, కళాశాలల సమీపంలో మాదకద్రవ్యాలు విక్రయించే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచి, విద్యాసంస్థలను మత్తు రహిత ప్రాంతాలుగా ప్రకటించాలి. వ్యసనపరులను నేరస్థులుగా చూడకుండా, బాధితులుగా పరిగణించి వారికి అవసరమైన మానసిక పరిపక్వత సలహాలు, వైద్య సహాయం అందించాలి. ప్రత్యేక ఉచిత సలహాదారుల ద్వారా సలహాలు అందించాలి. భారతీయ సంస్కృతి ఎల్లప్పుడూ శరీర ధర్మాన్ని, మానసిక పరిశుద్ధతను అత్యున్నతంగా భావించింది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే ఆర్యోక్తిని స్మరిస్తూ సంస్కారవంతమైన, ఆరోగ్యకరమైన జీవనశైలే వికసిత భారత్‌కు ప్రాణాధారమని గుర్తించాలి. 'మత్తు రహిత యువత - వికసిత భారత్' అనేది కేవలం ప్రభుత్వానికి చెందిన ఒక సంక్షేమ పథకం కాదు. ఇది ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, విద్యాసంస్థ, స్వచ్ఛంద సంస్థ, పౌరుడు స్వీకరించాల్సిన జాతీయ ధర్మం. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ, వారికి కావలసిన ప్రేమను, మానసిక ధైర్యాన్ని ఇంట్లో అందించాలి. మత్తు వదిలి లక్ష్యం వైపు అడుగులు వేస్తేనే వికసిత భారత స్వప్నం సాకారమవుతుంది. •

# ఎర్రకోటపై తొలిసారి 'వందేమాతరం'



## స్వాతంత్ర్య వేడుకల్లో కొత్త క్రమం

## జాతీయ గీతానికి ముందు ఆలాపన

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆగస్టు 15న ఎర్రకోట ప్రాకారాల నుంచి తొలిసారిగా జాతీయ గీతం వందేమాతరం మార్మోగనుంది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ గీతానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. అదే సమయంలో దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. జాతీయ గీతానికి ముందు వందేమాతరం ఈసారి ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమ క్రమంలో మార్పులు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలుత ఎర్రకోటకు చేరుకుంటారు. అనంతరం వందేమాతరం గానం జరుగుతుంది. ఆ తర్వాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించనున్నారు. యువ శక్తి – వికసిత్ భారత్ ప్రయాణానికి నాయకత్వం అనే ఇతివృత్తంతో ఈ ఏడాది వేడుకలు నిర్వహించనున్నారు. దేశ అభివృద్ధిలో యువత పోషిస్తున్న కీలక పాత్రను ఈ థీమ్ ప్రతిబింబించనుంది. ఆహ్వాన పత్రికల్లో పూర్తిస్థాయి గీతంఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రికల్లోనూ రక్షణ శాఖ మరో కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. వందేమాతరం పూర్తి సాహిత్యాన్ని ఆహ్వాన పత్రికలపై ముద్రించింది. ఇందులో జాతీయ గీతంలోని మొత్తం ఆరు చరణాలను పొందుపరిచారు. ఎర్రకోట వేడుకలకు కేంద్ర మంత్రులు, ఉన్నత స్థాయి సైనికాధికారులు, ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, విద్యార్థులు, వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులను ఆహ్వానించారు. జాతీయ గీతంతో సమాన హోదాఇటీవలే పార్లమెంట్ ఆమోదించిన జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ)బిల్లు2026తో వందేమాతరానికి జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన హోదా కల్పించారు. సవరించిన చట్టం ప్రకారం వందేమాతరం గానాన్ని అవమానించడం లేదా ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం శిక్షార్హ నేరంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఇంతకుముందు ఇలాంటి చట్టపరమైన రక్షణ జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగానికి మాత్రమే ఉండేది. బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అత్యంత కీలకమైన దేశభక్తి గీతాల్లో ఒకటిగా నిలిచింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అనేక తరాల స్వాతంత్ర్య సమరయోధులకు ఇది స్ఫూర్తినిచ్చింది. 1882లో బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన ఆనందమఠం నవలలో వందేమాతరం తొలిసారి ప్రచురితమైంది. అనంతరం దాని తొలి పంక్తులను దేశ జాతీయ గీతంగా స్వీకరించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వందేమాతరం జాతీయవాద ఉద్యమానికి ప్రతీకగా మారింది. మాతృభూమి పట్ల ప్రేమ, దేశభక్తి, త్యాగం, ఐక్యత వంటి భావాలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. భారత స్వాతంత్ర్యపోరాటంతో ఉన్న ఈ చారిత్రక అనుబంధం కారణంగా దేశ ప్రజల మనస్సుల్లో వందేమాతరంకు ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది.

# వణికిస్తున్న 'డాల్ఫిన్' తుపాను



## సురక్షిత ప్రాంతాలకు పది లక్షలమంది

**బీజింగ్, ఆగస్టు 10:** చైనాలో భారీ వర్షాలు, ఈదురు గాలుల బీభత్సం సృష్టిస్తున్నాయి. శక్తివంతమైన డాల్ఫిన్ తుపాను తీరాన్ని తాకడంతో ఆ ప్రాంతం వణుకుతోంది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి పడటం, వరదలు పోటెత్తే ప్రమాదం ఉండటంతో తీరప్రాంత నగరాల్లో దాదాపు 10 లక్షల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 1,500కు పైగా తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. షాంఘైలో గత 24 గంటల వ్యవధిలో దాదాపు 313 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గత 150యేళ్ల చరిత్రలో ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు పేర్కొన్నారు. వందకుపైగా వీధులు జలమయం అవ్వడంతో ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రధాన విమానాశ్రయాల్లో 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. కొండచరియలు విరిగిపడడంతో అనేక ప్రాంతాల్లో రోడ్డు, రైలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చైనాలోని డాల్ఫిన్ తుపాను ప్రభావం తైవాన్, భారత్‌లపైనా పడే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీని వల్ల చైనా సరిహద్దుల్లో ఉన్న భారత భూభాగంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

**2,230 విమానాలు రద్దు:** చైనా తూర్పు తీరంలోని జెజియాంగ్ ప్రావిన్స్‌ను ఆదివారం మధ్యాహ్నం డాల్ఫిన్ తుపాను తాకింది. ఈ సంవత్సరం చైనాలో సంభవించిన తుపానుల్లో ఇది 13వది. దీంతో చైనా జాతీయ వాతావరణ సంస్థ అత్యున్నత స్థాయి రెడ్‌అలర్ట్ జారీ చేసింది. ఈ తుపాను వల్ల గాలులు ఒక సెకనుకు 42 మీటర్ల వేగంతో వీస్తున్నాయి. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రముఖ విమానాశ్రయాల్లో దాదాపు 2,230 విమానాలు రద్దయ్యాయి. 720 సోమవారం వరకు రద్దయ్యాయి. హాంగ్‌జావ్ నగరంలోని విమానాశ్రయంలో రాకపోకలు సాగించాల్సిన దాదాపు 500 విమానాలు రద్దయ్యాయి.

# జెపిపిఎస్‌సి మాజీ ఛైర్మన్ అరెస్టు..

## ఉద్రిక్తంగా మారిన విద్యార్థుల ఆందోళన



**రాంచి, ఆగస్టు 10:** జార్ఖండ్‌లో విద్యార్థులు చేపట్టిన ఆందోళన సోమవారం ఉద్రిక్తంగా మారింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. మరోవైపు జేపీఎస్‌సీ మాజీ ఛైర్మన్ ఎల్ ఖియాంగ్తేను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. జేపీఎస్‌సీ పేపర్ లీకేజీ కేసులో యాంగ్తేను సోమవారం అరెస్టు చేశారు. బ్లాక్‌లిస్టులో పెట్టిన టీడీపీఎల్ సంస్థకు ఈ పరీక్షలు నిర్వహించే బాధ్యత అప్పగించడంపై అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. ఖియాంగ్తే గతంలో జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత ఆయనను ప్రభుత్వం జేపీఎస్‌సీ ఛైర్మన్‌గా నియమించింది. పేపర్ లీకేజీ ఆరోపణలు, విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో గత నెల 22న అతడు తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ లీకేజీపై స్పష్టమైన, నిష్పక్షపాత విచారణ జరగాలనే ఉద్దేశంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అరెస్టుకు ముందే సీఐడీ అధికారులు పలుసార్లు ఆయనను ఈ అంశంపై ప్రశ్నించారు. జేపీఎస్‌సీతోపాటు, జేఎస్ఎస్‌సీలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలపై విద్యార్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. సీఎం ఇంటితోపాటు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు దేవేంద్ర మహతో కూడా ఈ నిరసనకు మద్దతు తెలిపారు. జార్ఖండ్ ప్రతిపక్ష నేత బాబూలాల్ మరాండీ కూడా విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ పేపర్ లీకేజీలపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.



# షరియత్ చట్టం మేరకే ముస్లిం వివాహం

## కర్ణాటక హైకోర్టు తీర్పు

**బెంగళూరు, ఆగస్టు 10:** ముస్లిం వ్యక్తిగత చట్టం (షరియత్ చట్టం) ప్రకారం జరిగిన వివాహం, తదనంతరం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్, 1954 కింద నమోదు చేయబడినప్పటికీ, ఆ చట్టం (షరియత్ చట్టం) పరిధిలోనే కొనసాగుతుందని కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చింది. 1954 చట్టం కింద నమోదు చేసినంత మాత్రాన అటువంటి వివాహం చట్టపరమైన స్వభావం మారదని లేదా విడాకుల విషయంలో స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ నిబంధనలు వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్ 27(1)(డి), (ఇ) కింద దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను నిలవదు అని పేర్కొంటూ ఫ్యామిలీ కోర్టు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ ఒక ముస్లిం భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ డి.కె. సింగ్, జస్టిస్ టి.ఎం. నాదాఫ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. "సంబంధిత వర్గంయొక్క చట్టం ప్రకారం (అంటే ముస్లింలకు షరియత్ చట్టం, హిందువులకు హిందూ వివాహ చట్టం లేదా క్రైస్తవులకు క్రైస్తవ వివాహ చట్టం మొదలైనవి) జరిగిన వివాహాన్ని కేవలం నమోదు చేసినంత మాత్రాన, ఆ చట్టం ప్రకారం జరిగిన వివాహం అనే స్వభావాన్ని అది కోల్పోదని ధర్మాసనం పేర్కొంది. "సంబంధిత వర్గానికి వర్తించే చట్టం ప్రకారం వివాహం జరిగిన తర్వాత, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద నమోదు చేసినంత మాత్రాన, అది షరియత్ చట్టం లేదా హిందూ చట్టం లేదా క్రైస్తవ చట్టం ప్రకారం జరిగిన వివాహం అనే స్వభా వాన్ని, ప్రభావాన్ని కోల్పోద్దు అని వ్యాఖ్యానించింది.

# సీటు బెల్టు పెట్టుకోనని చిన్నారి మారాం..

## ఏకంగా విమాన సర్వీస్ రద్దు



**ఒట్టావా, ఆగస్టు 10:** ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడంతో ఏకంగా విమాన సర్వీసునే రద్దు చేశారు. ఈ ఘటన కెనడాలో చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం.. విక్టోరియా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోర్టర్ ఎయిర్‌లైన్స్ విమానం టొరంటోకు వెళ్లడానికి సిద్ధమైంది. రన్‌వేపై టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో విమానంలోని ఓ చిన్నారి సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా సీటుపై నిల్చొని ఉండడాన్ని సిబ్బంది గమనించారు. పాప తల్లి, క్యాబిన్ సిబ్బంది కలిసి సీట్‌బెల్ట్ పెట్టడానికి కొన్ని నిమిషాల పాటు ప్రయత్నించారు. అయితే చిన్నారి ఎంతకూ వినకుండా ఏడుస్తూ.. మారాం చేయడంతో ఏమీ చేయలేకపోయారు. సీట్‌బెల్ట్ పెట్టుకోకపోతే విమానాన్ని టేకాఫ్ చేయడం సురక్షితం కాదని భావించిన సిబ్బంది వారిని దించేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విమానం తిరిగి టెర్మినల్‌కు వెళ్లింది. చిన్నారిని, వారి తల్లిదండ్రులను విమానం నుంచి దించేసి.. నిబంధనల ప్రకారం వారి ఫ్లైట్ ప్లాన్‌లను తిరిగి ఫైల్ చేసేసరికి రాత్రి 12.30 గంటలు దాటింది. ఆ సమయానికి రన్‌వేను మూసివేయడంతో విమానం సర్వీసు రద్దు చేశారు. దీంతో అందులోని ప్రయాణికులు రాత్రి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. మరునాడు వారిని అదే విమానంలో గమ్య స్థానాలకు తీసుకెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్‌లైన్స్ క్షమాపణలు తెలియజేసింది.

# ప్రధాని మోడీతో బాక్సర్ సరదా సంభాషణ

## పగలబడి నవ్విన ప్రధాని



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** క్రీడారంగంలో మైదానంలో జరిగే పోటీలే కాదు, మైదానం బయట జరిగే కొన్ని సంఘటనలు కూడా దశాబ్దాల పాటు గుర్తుండిపోతాయి. అలాంటి ఓ సరదా సంఘటనను భారత బాక్సర్ నరేందర్ బెర్వాల్, ప్రధాని నరేంద్ర మోడీతో పంచుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకం గెలిచిన క్రీడాకారులను అభినందించేందుకు ప్రధాని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆసక్తికర సంభాషణ జరిగింది. నరేందర్ చెప్పిన కథ విని ప్రధాని మోడీ సైతం పగలబడి నవ్వారు. 2015లో జరిగిన వరల్డ్ మిలిటరీ గేమ్స్‌లో తన తొలి బౌట్ పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిందని నరేందర్ గుర్తుచేసుకున్నారు. అది మిలిటరీ గేమ్స్ కావడం, ఇరు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు ఉండటంతో పాకిస్థాన్‌పై ఎట్టిపరిస్థితుల్లోనూ ఓడిపోవద్దని తనకు సైనిక అధికారుల నుంచి ఫోన్లు వచ్చాయని ఆయన వెల్లడించారు. ఆ మ్యాచ్‌లో తాను 41, 32 తేడాతో గెలిచానని, అయితే ఇద్దరికీ గాయాలయ్యాయని తెలిపారు. దీంతో కుట్లు వేయించుకోవడానికి ఇద్దరూ కలిసి ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. ఆసుపత్రిలో జరిగిన సంభాషణను నరేందర్ వివరిస్తూ, 2014లో మీరు తొలిసారి ప్రధాని అయ్యారు. మాతో ఉన్న ఆర్మీ కోచ్ పేరు నరేంద్ర రాణా. నా పేరు నరేందర్. ఈ విషయాలను గమనించిన పాక్ బాక్సర్ నా దగ్గరకు వచ్చి సోదరా, ఒకమాట చెప్పనా అని అడిగాడు. చెప్పమని అన్నానని ఆ పాక్ బాక్సర్ నీ పేరు నరేందర్, నీ కోచ్ పేరు నరేందర్, మీ ప్రధాని పేరుకూడా నరేంద్ర. నాకు ఈ నరేంద్ర అనే పేరు వింటేనే ద్వేషం వచ్చేస్తోందని అన్నాడని నరేందర్ చెప్పగానే ప్రధాని మోడీ ఒక్కసారిగా పగలబడి నవ్వారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ పలువురు క్రీడా కారులతో ప్రత్యేకంగా మాట్లాడి, భారత క్రీడారంగానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు.

# బిజెపికి మేలుచేసే వ్యాఖ్యలు మానుకోవాలి..



## శశిథరూర్‌కు కెసి వేణుగోపాల్ హితవు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమాన్ని ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ఉద్యమంతో పోల్చుతూ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారానికి దారితీశాయి. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. పార్టీ నేతలంతా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బిజెపికి మేలు చేసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని వేణుగోపాల్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై ఎవరైనా విమర్శలు చేస్తే బిజెపి సంతోషిస్తుందని అయితే థరూర్ ఉద్దేశపూర్వకంగా అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారని తాను భావించడం లేదన్నారు. రాహుల్‌గాంధీ కార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన వచ్చిందని వేణుగోపాల్ చెప్పారు. అలహాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జెన్‌జీ యువత పాల్గొందన్నారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. నిరసనల్లో పోలీసుల చర్యతో గాయపడిన విద్యార్థుల సమస్యను రాహుల్‌గాంధీ తొలుత ప్రజల ముందుకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇటీవల ప్రతిపక్ష పార్టీలు యువతతో ఎందుకు పూర్తిగా అనుసంధానం కాలేకపోతున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని శశిథరూర్ అన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనకు వచ్చిన యువతకు రాజకీయ పార్టీల్లోకి రావడానికి సరైన మార్గంకల్పించలేకపోయామని చెప్పారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమానికి జంతర్‌మంతర్ నిరసన స్థాయిలో స్పందన రాలేదా అని ప్రశ్నించగా అవును. అందుకే మనం ఏం చేయలేకపోయామో ఆలోచించాలి అని థరూర్ బదులిచ్చారు. అయితే తన వ్యాఖ్యలను మీడియావక్రీకరించిందని తర్వాత వివరణ ఇచ్చారు. యువతకు రాజకీయాల్లో చోటు కల్పించాల్సిన అవసరాన్ని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు.



మ్యాగీ నూడుల్స్ వివాదానికి తెర

# 2 క్రిమినల్ కేసులు కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** మ్యాగీ నూడుల్స్‌లో అధిక సీసం కంటెంట్ ఉన్నట్లు గుర్తించారనే ఆరోపణలపై, దాని రిటైలర్లు సరఫరా గొలుసులోని ఇతర వ్యక్తులపై 2015లో దాఖలైన క్రిమినల్ ఫిర్యాదులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అసలు పరీక్ష నివేదికలు తదనంతరం చెల్లవని తేలినప్పటికీ విచారణలను కొనసాగించడం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం కింద రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీ అయిన మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ) ద్వారా మ్యాగీ నూడుల్స్ నమూనాలకు కొత్తగా పరీక్షలు జరపాలని సుప్రీం కోర్టు ఆదేశించిన తర్వాత, ఆ నివేదికలో సీసం పరిమాణం అనుమతించదగిన పరిమితుల్లోనే ఉందని తేలిన తర్వాత, ప్రస్తుత ప్రాసిక్యూషన్‌లకు ఆధారమైన అసలు ఢిల్లీ ఫుడ్ ల్యాబొరేటరీ నివేదికల సాక్ష్య విలువ గణనీయంగా తగ్గిపోయిందని జస్టిస్ మధు జైన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం పేర్కొంది. "బాంబే హైకోర్టు జారీ చేసిన తదుపరి ఉత్తర్వులు, సిఎఫ్‌టిఆర్ఐ ద్వారా కొత్త విశ్లేషణకు దారితీసిన సుప్రీం కోర్టు ఆదేశాలు, ఎన్‌సిడిఆర్‌సి ముందు జరిగిన విచారణల ముగింపు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హైకోర్టులు వెలువరించిన తదుపరి తీర్పులను పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత ప్రాసిక్యూషన్‌లను కొనసాగించడానికి అనుమతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ప్రాసిక్యూషన్ పునాదే గణనీయంగా బలహీనపడినప్పటికీ, ఫిర్యాదులను కొనసాగించడం పిటిషనర్లను సుదీర్ఘమైన క్రిమినల్ విచారణకు గురిచేస్తుంది" అని ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది రాజేష్ బాత్రా, ప్రతివాది తరఫున ఎపిపి దిగమ్ సింగ్ దాగర్ వాదనలు వినిపించారు.

# ప్రజల్లోకి వెళ్లేముందు హెడ్‌సెట్ పెట్టుకోండి

## మమతా బెనర్జీపై బెంగాల్ సిఎం సెటైర్లు



**కోల్‌కత్తా, ఆగస్టు 10:** మమతా బెనర్జీ ప్రజల్లోకి వెళ్లేటప్పుడు హెడ్‌సెట్ పెట్టుకుంటే మంచిదని, అప్పుడు దొంగ అంటూ జనం చేసే నినాదాలు వినపడవని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సూచించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బిజ్‌పూర్‌లో మమత పర్యటన సందర్భంగా ఆమె కాన్వాయ్‌పై దాడి జరగడం, నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పోలీసు కస్టడీలో మరణించిన తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్త బిర్జు కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత ఆదివారం బిజ్‌పూర్‌కు వెళ్లారు. ఈ సమయంలో ఆమె తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. కొందరు నిరసనకారులు మమత కాన్వాయ్‌పైకి బూట్లు, బురద, రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడి వెనుక బీజేపీ గూండాలు ఉన్నారని మమత ఆరోపించారు. కారు అద్దాలు తెరిచి ఉంటే తనకు ప్రాణహాని జరిగి ఉండేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మమత ఆరోపణలను సీఎం సువేందు అధికారి పూర్తిగా ఖండించారు. ఇది పూర్తిగా ప్రజాఆగ్రహం వల్ల జరిగిన ఘటన అని, ఇందులో భారతీయ జనతా పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. టీవీ ఫుటేజీలో తనకు బీజేపీ జెండాలు గానీ, తెలిసిన కార్యకర్తల ముఖాలు గానీ కనిపించలేదని ఆయన అన్నారు. మమతకు ఇంకా జడ్‌ప్లస్ కేటగిరీ భద్రత కొనసాగుతోందని, ఈ ఘటన సమయంలో కూడా పోలీసులు ఆమెకు పూర్తి భద్రత కల్పించారని గుర్తుచేశారు. మరో వైపు, మృతుడు బిర్జు కియోట్ కుటుంబ సభ్యులు కూడా మమత రాకను వ్యతిరేకించినట్లు సువేందు తెలిపారు. తమకు రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం ఉందని, అతడి మృతిపై న్యాయం జరగాలని కోరు తున్నారని, మమతను తాము పిలవలేదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.

# అధికారిక కార్యక్రమాల్లో తమిళ తాయ్ వాళ్తు తప్పనిసరి..

## తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

**చెన్నై, ఆగస్టు 10:** తమిళనాడులోని అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఇకపై రాష్ట్ర గీతం తమిళ తాయ్ వాళ్తుకే ప్రథమ ప్రాధాన్యం లభించనుంది. కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం తమిళనాడు శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రాష్ట్రంలోని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ వాయిస్ ఓటు ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు వెల్లడించారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, తమిళ భాష తమ రాష్ట్రానికి ప్రాణనాడి, భావోద్వేగం, అస్తిత్వమని అభివర్ణించారు.

# సంక్షిప్త వార్తలు

## రైట్‌వింగ్ విశ్లేషకుడు మోహన్‌దాస్ అరెస్టు




**కొచ్చి, ఆగస్టు 10:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై, ముఖ్యంగా మహిళలపై అత్యంత హేయమైన, హింసాత్మక వ్యాఖ్యలుచేసిన ప్రముఖ రైట్‌వింగ్ విశ్లేషకుడు టి.జి. మోహన్‌దాస్‌ను కేరళ పోలీసులు అరెస్ట్‌చేశారు. కొచ్చి లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు, సోమవారం ఉదయం అరెస్ట్‌ను అధికారికంగా నమోదు చేశారు. ఈ ఘటన కేరళలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. మోహన్‌దాస్ తన పత్రిక అనే యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

## అయోధ్య సిఇఒ పోస్టుకు 18 మందితో జాబితా



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టు కోసం 18 మందిని ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేశారు. రామాలయం ఈసీవో పోస్టు కోసం సుమారు 5300 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్క్రీనింగ్ కమిటీ సుమారు 18 మంది అభ్య ర్థులను ఇంటర్వ్యూ కోసం షార్ట్‌లిస్టు చేసింది. అయితే అడ్మినిస్ట్రేటివ్ అనుభవం ఉన్న వారికి ప్రాముఖ్యత ఇవ్వనున్నారు. షార్టలిస్టు అయిన అభ్యర్థులను మంగళ, బుధవారం ఆలయ పరి సరాల్లోనే ఇంటర్వ్యూ చేయనున్నారు.

## భౌతిక శాస్త్రవేత్త దీపక్‌ధర్‌కు అరుదైన పురస్కారం



**న్యూఢిల్లీ ఆగస్టు 10:** భారతదేశపు ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, ఐఐఎస్ఎస్ఏ ప్రొఫెసర్ దీపక్‌ధర్ అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. భౌతిక శాస్త్రరంగంలో అత్యున్నత పురస్కారాలలో ఒకటిగా భావించే 2026 డిరాక్‌మెడల్‌ను ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ ప్రకటించింది. గతంలో స్టీఫెన్ హాకింగ్స్ వంటి దిగ్గజాలు అందుకున్న ఈ పురస్కారం, సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో విశేష కృషి చేసిన వారికి లభిస్తుంది. ఈ ఏడాది ఈ గౌరవం పొందిన నలుగురు శాస్త్రవేత్తలలో ప్రొఫెసర్ ధర్ ఒకరు.

## అసోం-అరుణాచల్ సరిహద్దులో కాల్పులు, 8 మందికి గాయాలు



**గువాహతి, ఆగస్టు 10:** అసోం–అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మింగ్‌మాంగ్ బడాతి ప్రాంతంలో అరుణాచల్‌ప్రదేశ్ వైపునుంచి గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది గ్రామస్థులు గాయపడ్డారు. గోగాముఖ్ రెవెన్యూ సర్కిల్ పరిధిలోని సరిహద్దు ప్రాంతంలో ఈఘటన జరిగింది. అసోం భూభాగంలో అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఇరువర్గాలమధ్య వివాదంతలెత్తింది. దీంతో అరుణాచల్ వైపునుంచి వచ్చిన వ్యక్తులు అసోం గ్రామస్థులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు సమాచారం.

## బెంగాల్ రైతును కిడ్నాప్ చేసిన బంగ్లాదేశీయులు..



**జల్‌పాయ్‌గురి, ఆగస్టు 10:** పశ్చిమ బెంగాల్‌లోని జల్‌పాయ్‌గురి జిల్లా సరిహద్దులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరిహద్దు భద్రతా దళం ఒక బంగ్లాదేశీ చొరబాటుదారుడిని అరెస్ట్ చేసి నందుకు నిరసనగా బంగ్లాదేశీయులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించి దీపాంకర్ గోప్ అనే భారతీయ తేయాకు రైతును అపహరించి బంగ్లాదేశ్‌కు తీసుకెళ్లారు. తమ దేశానికి చెందిన వ్యక్తిని భారత్ విడుదల చేస్తేనే, రైతును తిరిగి పంపిస్తామని బంగ్లాదేశ్ సరిహద్దు బలగాలు, స్థాని కులు దబాయిస్తున్నట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** ట్రిబ్యునళ్ల నియామక ప్రక్రియను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో వివిధ అంశాలపై విపక్షాల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లుమూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

# చేసిన మంచిని చెబుదాం.. వైకాపాను కట్టడి చేద్దాం

● కుప్పం తెదేపా విజయోత్సవ సభలో ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం ● పథకాల్లో లబ్ది పొందుతూ రోడ్లపై వస్తారా: ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు ● ఎమ్మెల్సీ భరత్‌ది పార్ట్‌టైం రాజకీయం: టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి



విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలు చేస్తున్న మంచిని ప్రజలకు చెబుదామని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం కుప్పంలో తెదేపా రెండేళ్ల సుపరిపాలన విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు జరుగుతున్న మంచిని చెప్పడంలో ఎందుకు విఫలం అవుతున్నామో నేతలు, కార్యకర్తలు ఆలోచించాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు వేల కోట్లతో ఇక్కడ పరిశ్రమలు, కృష్ణాజలాలు తేవడంతో పాటు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటితో ప్రజలకు లబ్ది కలుగుతోందన్నారు. ఈ మంచిని ప్రజల ఇళ్లకు చేర్చాలన్నారు. అలాగే వైకాపా ఘనకీయులను గ్రామాల్లోనే కట్టడి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.
పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో లబ్ది పొందుతున్న వైకాపా నేతలు రోడ్లపై వచ్చి ధర్నాలు చేస్తామనడం సబబుకాదని అలా చేస్తామంటే పథకాల్లో లబ్ది మాకొద్దు అని ప్రకటించాలని సవాల్ విసిరారు. మెగా డిఎస్సీ2025 ద్వారా 16347 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసే దాన్ని రాద్ధాంతం చేయడం దారుణమన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి మాట్లాడుతూ కుప్పంలో పుడితే పేదరికం ఉండదన్నారు. సిఎం చంద్రబాబు తన నియోజకవర్గాన్ని ఆ విధంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ భరత్ పార్ట్‌టైం రాజకీయాలు చేస్తున్నారని ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ సిఎం వైఎస్ జగన్ బాగుండాలని కుప్పంలో పనిచేస్తుంటారని విమర్శించారు. ఆయన అభివృద్ధి వైపు నడుస్తారా దుర్మార్గం వైపు నడుస్తారా అనేది తమ కులం వ్యక్తిగా ఎమ్మెల్సీ భరత్‌ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. కుప్పంలో శాంతిభద్రతలు దెబ్బతీసే విద్రోహం అన్నారు. ఈసందర్భంగా నేతలు తమ ప్రసంగాల్లో కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, సిఎం పిఎ శ్రీకాంత్, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎపిఐపిసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఎంఎంసి ఛైర్మన్ జిఎం రాజు, పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్, ఉదయ్, వెంకటరమణ, సుబ్బు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, కడ సభ్యులు రాజకుమార్, సుగుణమ్మ, టిడిపి ఇన్‌చార్జ్ తులసీనాథ్, జనసేన ఇన్‌చార్జ్ నరేష్, క్లస్టర్ ఇన్‌చార్జులు కస్తూరి, హైదర్ వలి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలినేని, దామచర్ల వివాదంపై కూటమి పెద్దల ఆగ్రహం

● ఇరువురు సంయమనం పాటించాలని, బహిరంగ విమర్శలకు దూరంగా ఉండాలని ఆదేశం ● టెలి కాన్ఫరెన్స్‌లో టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు నిమ్మల, అచ్చెన్నాయుడు, నాదెండ్ల, ఎమ్మెల్సీ హరిప్రసాద్ చర్చలు

**ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 10 ప్రభాతవార్త:** ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య రాజకీయ వివాదం మరింత ముదురుతోంది. దామచర్లపై మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన బాలినేని, తనపై ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అదేవిధంగా తాను చేస్తున్న ఆరోపణలపై దామచర్ల కూడా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఒంగోలు నియోజకవర్గంలో తాను స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, దామచర్ల కూడా ఏ పార్టీ అండ లేకుండా స్వతంత్రంగా పోటీ చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. 'జనసేన మద్దతు లేకపోతే జనార్దన్ ఒంగోలు ఎమ్మెల్యేగా గెలిచేవారా? అని బాలినేని నిలదీశారు. పార్టీ గుర్తులు, రాజకీయ అండదండలు లేకుండా ప్రజల మధ్యకు వెళ్లి పోటీ చేస్తే ఎవరి బలం ఎంత అనేది తేలిపోతుందని అన్నారు. తాను ప్రజల తీర్పును ఎదుర్కొనేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నానని, రాజకీయంగా ఎలాంటి సవాలు వచ్చినా వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. దామచర్లపై తాను చేస్తున్న అవినీతి ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని బాలినేని తెలిపారు. ఇసుక, గ్రావెల్, మద్యం దుకాణాలు, భూ వ్యవహారాలకు సంబంధించి దామచర్ల తనపై చేసిన ఆరోపణలపై కూడా తాను సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై కాణిపాకం వినాయకుడి వద్ద ప్రమాణం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'నేను చేస్తున్న ఆరోపణలపై దామచర్ల కూడా కాణిపాకంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా? అని సూటిగా ప్రశ్నించారు. ఆరోపణలు నిజమా కాదా అన్నది ప్రజల ముందే తేల్చుకోవాలని అన్నారు. రాజకీయ వేదికలపై పరస్పరం విమర్శలు చేసుకోవడం కంటే విచారణ ద్వారా వాస్తవాలు బయటకు రావాలని సూచించారు. తనపై, దామచర్ల జనార్దన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తనపై ఎలాంటి విచారణ చేపట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, అదే విధంగా దామచర్లపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దామచర్ల తనను జైలులో వేయిస్తానని అన్నట్లు పేర్కొన్న బాలినేని 'మమ్మల్ని లోపల వేయిస్తావా మాకు చేతకాద్నా' అంటూ ప్రశ్నించారు. తనపై కేసులు పెట్టి తన అనుచరులను వేధిస్తున్నారని కూడా ఆరోపించారు. ఒంగోలు మున్సిపాలిటీలో రూ.8.5 కోట్ల నిధులు గల్లంతయ్యాయని ఆరోపిస్తూ ఆ నిధులు ఏమయ్యాయో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లోకి రాకముందు తన వద్ద ఉన్న ఆస్తులు, ప్రస్తుతం ఉన్న ఆస్తులపై విచారణ జరిపించాలని సూచించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా, ఎలాంటి విచారణ చేపట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. తనపై దామచర్ల చేస్తున్న ఆరోపణలకు ఆధారాలుంటే బయటపెట్టాలని, తాను చేస్తున్న ఆరోపణలకు దామచర్ల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
ఇదిలా ఉండగా బాలినేని, దామచర్ల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధంపై టిడిపి, జనసేన అధిష్ఠానాలు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. ఇద్దరు నేతలు బహిరంగంగా పరస్పరం ఆరోపణలు, విమర్శలు, సవాళ్లు చేసుకోవడం కూటమి ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా ఉందని పార్టీ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కూటమి పక్షాల సమన్వయ కమిటీ నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో బాలినేని, దామచర్ల వ్యవహారంపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. టెలీ కాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు రామా నాయుడు, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నట్లు తెలిసింది. ఆరోపణలు, అభ్యంతరాలు లేదా రాజకీయంగా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శించుకోకుండా పార్టీ అధినాయకత్వాల దృష్టికి తీసుకురావాలని సమన్వయ కమిటీ నేతలకు సూచించినట్లు సమాచారం.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవడం ప్రధానమని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, విద్యుత్ స్తంభాల మార్పు, వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు.
ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 58 వినతులు అందినట్లు సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.
9 జిల్లాల నుండి 58 మంది ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ వినియోగ దారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే ందుకు కృషి చేస్తున్నామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎండి శివశంకర్, డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, హేమలత, లత, పిఆర్‌ఒ మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# ఎపిఎస్‌పిఎఫ్ ఇంటర్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా ఎపి సెక్రటేరియట్ జట్టు

● రన్నరప్‌గా విజయవాడ గార్డ్స్



**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎపిఎస్‌పిఎఫ్) ఆధ్వర్యంలో ఇంటర్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం విజయవాడలో ఘనంగా నిర్వహించార. ఎపి ఎస్‌పిఎఫ్ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎయిర్‌పోర్ట్ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్ రమేష్ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు జరిగాయి. టోర్నమెంట్‌ను ముఖ్య అతిథిగా హాజరైన ఎపి ఎస్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బివి.రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు సిబ్బందిలో శారీరక, మానసిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకర రావు, విజయవాడ ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ కె.లక్ష్మీకాంత రెడ్డి, ఎయిర్‌పోర్ట్ సిఎస్‌ఓ ధర్మేంద్రతో పాటు విజయవాడ జోన్ వివిధ యూనిట్లకు చెందిన అసిస్టెంట్ కమాండెంట్లు పివిఎస్ఎన్ మల్లికార్జున రావు, క్రిష్ణమాచారి, హేమసుందర్, కుమార్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.
ఇంటర్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో ఎపి సెక్రటేరియట్, ఎపి హైకోర్టు, డా. ఎన్‌టిటిపిఎస్, విజయవాడ గార్డ్స్, ఎపిఎస్‌పిఎఫ్ హెడ్‌క్వార్టర్స్ తదితర యూనిట్లకు చెందిన ఆరు జట్లు పాల్గొన్నాయి. సుమారు 250 మంది క్రీడాకారులు, సిబ్బంది, సందర్శకులు హాజరై పోటీలను వీక్షించారు. పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. టోర్నమెంట్‌లో ఎపి సెక్రటేరియట్ జట్టు విజేతగా, విజయవాడ గార్డ్స్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి.
ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో పాటు విజేతలు, రన్నరప్ జట్లకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎపిఎస్‌పిఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకర రావు చేతుల మీదుగా ట్రోఫీలు, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఎపిఎస్‌పిఎఫ్ ఎయిర్‌పోర్ట్ యూనిట్ అధికారులు, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు.

# ఎన్‌టిఆర్ జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

**విజయవాడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ప్రజలకు ఆధార్ అప్‌డేట్, ఆధార్‌లో పేరు, చిరునామా మార్పు, ఫోన్ నెంబర్ మార్పు తదితర అవసరాల కోసం ఎన్‌టిఆర్ జిల్లాలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన స్వర్ణగ్రమాలు, స్వర్ణవార్డులు, కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 11 నుండి 14 వరకు, తిరిగి 17 నుండి 29వరకు జరుగుతాయన్నారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న శిబిరాలకు వెళ్ళి ఆధార్ సేవలు పొందవచ్చన్నారు. 15ఏళ్ళ వయస్సు గల పిల్లలకు తప్పని సరిగా ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కలెక్టర్ సూచించారు. స్వాతంత్ర్యం వచ్చి 80వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనే నేను కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు.
ఈనెల సోమవారం నుండి ఈనెల 15వతేదీ వరకు జరుగనున్న ఈకార్యక్రమాన్ని జయప్రధం చేయాలని కోరారు. ఈనెల 13 నుండి 15వరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ఇంటిపైనా జాతీయజెండా ఎగురవేయాలని కోరారు.


## తిరుమల సమాచారం



# తిరుమలలో తగ్గని భక్తుల రద్దీ

● కొనసాగుతున్న భక్తులతో వెలుపల క్యూలైన్లు

**తిరుమల, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వారాంతం సెలవులు ముగిసినా సోమవారం ఉదయానికి కూడా తిరుమలలో భక్తుల రద్దీ తగ్గలేదు. ఓ వైపు కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు శిలాతోరణం వరకు మూడు కిలోమీటర్లు లైన్లు వ్యాపించాయి. సోమవారం ఉదయానికి తిరుమలలో 60వేల మంది భక్తులు ఉండటంతో కొండ కిటకిటలాడుతోంది. ఉదయానికే వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఎనిమిది గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. సాధారణ రోజుల్లోనూ తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు 10వేలు, కాలినడక దివ్యదర్శనం టోకెన్లు 2వేలు విపరీతమైన భక్తుల రద్దీతో ఉదయం 5.30గంటలకే కేటాయించడంతో గంటల సమయంలో టోకెన్లు పూర్తయ్యాయి. భక్తుల రద్దీ పెరిగితే టోకెన్లు జారీ సమయం ఇష్టానుసారంగా మారిందనే భక్తుల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టిటిడి అధికారుల ఇష్టారాజ్యంగా ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీ మారింది.




# టిటిడికి ట్రక్ విరాళం

**తిరుమల, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. సోమవారం తిరుపతికి చెందిన వేంకటేశ్వర మోటార్స్ సంస్థ మేనేజింగ్ పార్టనర్ లోకనాథ రెడ్డి రూ.15.24 లక్షలు విలువైన ఎస్.ఎం.ఎల్. మహీంద్ర ట్రక్‌ను విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వాహన తాళాలను రికార్డులను ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు అందజేశారు.

# తనిఖీలు చేస్తున్నా.. కేసులు రాస్తున్నా తిరుమల ఘాట్‌లో తగ్గని ప్రమాదాలు

● అవగాహనలేని డ్రైవింగ్‌తో పోతున్న ప్రాణాలు





**తిరుమల, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశాంతంగా ఏడుకొండలస్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమవుతున్న భక్తులు ప్రయాణించే సొంత వాహనాలపై ఘాట్‌రోడ్డులో పట్టుకోల్పోతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుపతికి దిగే మొదటి ఘాట్‌రోడ్డులో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా.. స్టీరింగ్‌పై పట్టు తప్పినా క్షణాల్లో కళ్ళముందే ప్రమాదం ముంచుకొస్తోంది. తరచూ మొదటిఘాట్‌లో వాహనాల ప్రయాణ సమయంలో వేగ నియంత్రణపై అటు తిరుమల ట్రాఫిక్ పోలీసులు ఇటు విజిలెన్స్ సిబ్బంది తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నా నామమాత్రంగా కేసులు రాస్తున్నా వాహనదారుల్లో మాత్రం పూర్తిస్థాయిలో అవగాహన కల్పించలేకపోతున్నారు. దీనివల్ల యాత్రికుల వాహనాలు అదుపుతప్పి పిట్టగోడను ఢీ కొని పక్కనే ఉన్న కాల్వల్లోకి ఒరిగిపోవడం లేకుంటే 15-20 అడుగుల లోతులో ఉన్న చిన్నపాటి లోయల్లోకి బోల్తాపడి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి నిదర్శనంగా నాలుగురోజుల క్రిందట తిరుమల నుండి తిరుపతికి వెళుతున్న కర్ణాటక బన్నేరిగట్టకు చెందిన భక్తబృందం ప్రయాణిస్తున్న కారును డ్రైవర్ అయిన యజమాని డాక్టర్ సతీశ్‌కుమార్(70) నడిపిన సమయంలో 22వ మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి రైలింగ్‌ను ఢీ కొన్నాడు. వెంటనే 20అడుగుల లోయలో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మరో ముగ్గురు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. కారు నడిపిన సతీశ్‌కుమార్ ఆస్పత్రిలో మృతి చెందాడు. దీంతో యాత్రికుల కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇలాంటి సంఘటనలు వారంలో మూడు నాలుగు ప్రమాదాలు జరిగిపోతుండటం విశేషం. అయినా మొదటిఘాట్‌లో వాహనాల వేగనియంత్రణపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఇష్టమొచ్చినపుడు తనిఖీలు చేయడం, లేకుంటే విస్మరించడం చేస్తున్నారు. ఏదేని ప్రమాదాలు జరిగినపుడు వరుసగా వారంరోజులు వాహనాల తనిఖీ పేరుతో కేసులు రాయడం, చలానాలతో జరిమానాలు విధించడంతోనే చేతులు దులుపేసుకుంటున్నారు. ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి సొంత వాహనాల్లో వస్తున్న యాత్రికులే ప్రమాదాలకు గురవుతుండటం బాధాకరం. తిరుమల నుండి సొంత వాహనాల్లో బయలుదేరిన యాత్రికులకు జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద, మోకాళ్ళ పర్వతం వద్ద, 7వ మైలు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఇలా కొన్ని చోట్ల నిబంధనలు తెలియజేయడం, ఘాట్‌లో మలుపుల వద్ద వాహనాలను నడిపే సూచనలు చేయడం తిరుమల పోలీసులు గానీ, విజిలెన్స్ సిబ్బంది గానీ తప్పనిసరిగా మారింది. అయితే ఇవేమీ తమకు కాదన్నట్లు వ్యవహరిస్తుండటం విస్మయం కలిగిస్తోంది.

### ప్రమాదకరమైన మలుపుల వద్ద జాగ్రత్తలేవీ!?

తిరుమల పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం దేశం నలుమూలల నుండి యాత్రికులు వస్తున్నారు. 20శాతం మంది సొంత వాహనాల్లోనే తిరుమలకు చేరుకుంటున్నారు. ప్రతిరోజూ ఏడువేల వరకు వాహనాలు తిరుమలకు చేరుతుండగా అందులో సుదూర ప్రాంతాల నుండి ప్రయాణించి వస్తున్న యాత్రికుల వాహనాలు రెండువేల వరకు ఉంటున్నాయనేది టిటిడి సమాచారం. ఇదిగాక తిరుపతి- తిరుమల మధ్య స్థానికంగా నాలుగువేల వరకు ట్యాక్సీలు, తెలుపురంగు బోర్డులున్న వాహనాలు తిరుగుతున్నాయి. బయటి ప్రాంతాలనుండి వస్తున్న యాత్రికులకు తిరుమల ఘాట్‌పై పెద్దగా అవగాహన లేకపోవడం, మలుపుల వద్ద సుడులు తిరిగేలా వాహనాలను నడపడం వంటివి అనుభవం ఉండదు. ఈ సమయంలో అదుపు తప్పితే రైలింగ్‌ను ఢీకొని బోల్తా పడటం జరిగిపోతోంది. తిరుమల మొదటిఘాట్ తిరుపతికి దిగే సమయంలో సుడులు తిరిగే మలుపులు.. ఒళ్ళు జలదరించేలా వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. ప్రతి మలుపు ప్రమాదకరమని తెలిసినా నియంత్రణ లేని వేగంతో మొదటి ఘాట్‌లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. తిరుపతికి దిగే వాహనచోదకులు 20-40 కిలోమీటర్లు వేగంమించి వాహనాలను నడుపరాదు. ఘాట్‌లో ప్రయాణసమయం కూడా దాదాపు 40నిమిషాలుగా నిర్దేశించారు. చాలావరకు తిరుమలకు వస్తున్న యాత్రికుల వాహనాల డ్రైవర్లు సాధారణరోడ్లపై వాహనాలను నడిపే రీతిలోనే ఘాట్‌లోనూ వేగంగా నడుపుతుండటం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనేది పోలీసుల కథనం.

# కార్తికేయుని గ్రామోత్సవం: కేడియంపై దర్శనం


కేడియగం వాహనంపై షణ్ముఖుడు దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన చెంగల్వరాయ స్వామి, అనుబంధ ఆలయం అయిన కుమార స్వామి కొండపై వారం రోజుల పాటు నిర్వహించిన కార్తికేయుని మహోత్సవాల ప్రధాన ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకరించారు. బోయిలు మోసుకుంటూ కేడియంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, కుమార స్వామి ఆలయ పర్యవేక్షణ కమిటి చైర్మన్ నెమళ్ళూరు బుజ్జి, సతీష్, సుమతిలు వెంట రాగా గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. అనంతరం స్వామి అమ్మవార్లను దిగువ సన్నిధివీధిలోని వసంత మండపం వద్దకు చేర్చారు. వసంతోత్సవం నిర్వహించారు. అక్కడ ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, వేదపండితులు, పారోహితులు అర్థగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సూరి గురుకుల్ శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు షోడషాభిషేకాలు జరిపారు. అనంతరం ఉత్సవర్లు ఆలయంలోని చేర్చారు.
**ధ్వజావరోహణం:** ఆడికృత్తిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయంలో సోమవారం రాత్రి కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కలశాల్ని ఉద్వాసన గావించారు. అర్చకులు, రుత్వికులు కలశాల్ని వేదమంత్రాలను వేదపండితులు పఠిస్తుండగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. అక్కడ ధ్వజావరోహణ కార్యక్రమాల్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఇఒ బికె వెంకటేశులు, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


### అన్నదానానికి విశాఖవాసుల విరాళం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం విశాఖపట్టణానికి చెందిన వి.రామ సత్యనారాయణ, సునీత దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వారికి ఆలయ ఇఒ ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం అవకాశం కల్పించారు. వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని అందించారు.


నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న విశాఖ వాసులు

# ఔషధ మొక్కలపై అవగాహన సదస్సు

ప్రపంచ రికార్డులు సాధించిన సిఇఒ చంద్రశేఖర్‌కు సత్కారం




**తిరుపతి, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఔషధ మొక్కలు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. మానవ నాగరికత ఆరంభం నుంచి రోగాల నివారణకు, ఆరోగ్య పరిరక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ఔషధమొక్కల బోర్డు సహకారంతో సోమవారం తిరుపతిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల ప్రదర్శనను సిఇఒ పరిశీలించారు. సభకు ప్రిన్సిపాల్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించగా బోర్డు సిఇఒ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయుర్వేద, సంప్రదాయ వైద్య విధానాల్లో ఔషద మొక్కల పాత్ర చాలా కీలకమన్నారు. తులసి, పసుపు, అశ్వగంధ, కలబంద వంటి ప్రముఖ ఔషధ మొక్కలు, వాటి ఉపయోగాలను బాగా గుర్తించామన్నారు. జలుబు, దగ్గు, గొంతు నొప్పి నివారణకు, రోగ నిరోధక శక్తిని పెంచడానికి తులసి అద్భుతంగా పనిచేస్తుంది. గాయాలను మాన్పడంలో, యాంటీబియాటిక్‌గా శరీరంలో మంటను తగ్గించడంలో పసుపు సహాయపడుతుందన్నారు. అశ్వగంధ మానసిక ఒత్తిడిని తగ్గించి, శక్తిని, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందన్నారు. రక్తశుద్ధికి, చర్మవ్యాధుల నివారణకు, బ్యాక్టీరియాను అరికట్టడానికి వేప ఉపయోగపడు తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జున రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెడనలో గురుకుల బాలికలపై అత్యాచారం
## పోక్సో కేసు నమోదు... ఇద్దరు అరెస్టు

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పెడనలో గురుకుల బాలికలపై అత్యాచారం ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సోమవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 6న పెడన మండలం బల్లిపర్రు గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినిలు అదృశ్యమయ్యారని తెలిపారు. మచిలీపట్నం రుద్రవరంలోని టిడ్కో హౌసెస్ వద్ద బాలికలపై అత్యాచారం జరిగిందని ఎస్పీ అన్నారు. బాలికలపై ఇద్దరు ఆటోడ్రైవర్లు అత్యాచారం చేశారని చెప్పారు. నిందితులను శారదానగర్‌కు చెందిన మద్దాల శ్యామ్ కిరణ్ (20), కొక్కిలిగడ్డ సిద్దు(20)గా గుర్తించామన్నారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. 40 రోజుల్లో కేసు విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు ఎస్పీ విద్యాసాగర్ వెల్లడించారు.

## కారు ఢీకొని యువకుడు మృతి

**కావలి (నెల్లూరు), ఆగస్టు 10 ప్రభాతవార్త:** కారుఢీకొన యువకుడు మంద వాసు(21) మృతి చెందిన సంఘటన కావలి రూరల్ మండలం అన్నగారి పాలెం సమీపాన ఉన్న శ్రీ ముందరపుట్టమ్మ తల్లి దేవస్థానం సమీపాన జరిగింది. పోలీసులు సమాచారం మేరకు కావలి అడవి రాజుపాలెంకు చెందిన మంద వాసు, హరిజనవాడకు చెందిన పచ్చ సంతోష్‌బాబుతో కలిసి బోగోలు మండలం, జువ్వలదిన్నెలో ఏసీ రిపేరు చేసి మోటారు బైక్ పై వస్తుండగా అన్నగారిపాలెం సమీపాన శ్రీ ముందర కొట్టెమ్మ తల్లి ఆలయం సమీపానికి వచ్చేసరికి అతి వేగంగా వస్తున్న కారు మోటారు బైక్‌ను ఢీకొంది. మంద వాసు, సంతోష్‌బాబులకు బలమైన గాయాలు కావడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలించగా మంద వాసు మృతి చెందాడు. సంతోష్‌బాబు చికిత్స పొందుతున్నాడని తెలియజేశారు. కావలి రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టిప్పర్ ఢీకొని కూలీ మృతి

**కోట (నెల్లూరు), ఆగస్టు 10 ప్రభాతవార్త:** కోట మండలం విద్యానగర్–కొత్తపాళెం మార్గం మధ్యలో సోమవారం సాగరమాలకు చెందిన టిప్పర్ ఢీకొనడంతో కూలీ ఏడుకొండలు మృతిచెందాడు. ఏడుకొండలు తన భార్యతో కలిసి ఉపాధి హామీ పనులు చేసుకుని బైక్‌పై తిరిగి వస్తున్న సమయంలో సాగరమాలకు చెందిన టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో ఏడుకొండలు తీవ్రంగా గాయపడ్డాడు. 108వాహనంలో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. భార్యకు కాళ్లు విరిగిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు...ఒకరు మృతి

**దగదర్తి (నెల్లూరు), ఆగస్టు 10 ప్రభాతవార్త:** దగదర్తి మండలం సున్నబట్టి సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురు గాయాలు పాలైన సంఘటన సోమవారం 10 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు నెల్లూరు జ్యోతి నగర్ నందు నివాసముంటున్న పటాన్ ముస్లిం ఖాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు నుంచి ఉత్తరప్రదేశ్‌లో ఉన్న తన స్వగ్రామమైన బైసా గ్రామానికి తన కారులో తనే డ్రైవ్ చేస్తూ బయలుదేరి వెళ్తూ ఉండగా మార్గమధ్యం నందు జాతీయ రహదారి 16పై సోమవారం ఉదయం సుమారు 9.10గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి కావలికి వెళ్ళు జాతీయ రహదారి 16పై సున్నబట్టి గ్రామ పరిధిలో జామాయిల్ ఫారెస్టు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడం వలన ముస్లిం ఖాన్ కుటుంబ సభ్యులలో ముస్లిం ఖాన్ కూతురు పటాన్ జైనబ్ ఫాతిమా, ఖాన్ 3 సంవత్సరాలు బలమైన రక్త గాయాలు కలగడం వలన మరణించింది. మిగతా వారికి చిన్న చిన్న గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

## అడవి పంది అడ్డురావడంతో ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

**చేజర్ల (నెల్లూరు), ఆగస్టు 10 ప్రభాతవార్త:** అకస్మాత్తుగా రోడ్డుపైకి అడవి పంది రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందిన విషాధ సంఘటన చేజర్ల మండలంలో చోటుచేసుకుంది. పుట్టుపల్లి గ్రామానికి చెందిన షేక్ రహంతుల్లా(40) మృతి చెందారు. పుట్టుపల్లి గ్రామానికి చెందిన రంతుల్లా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నారు. ఆయనకు భార్య మస్తానమ్మతో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం భార్య, పిల్లలు, బంధువులతో కలిసి ఆటోలో నెల్లూరుకు షాపింగ్‌కు వెళ్లారు. షాపింగ్ అనంతరం రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా రెడ్డిగుంట వాగు వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో అకస్మాత్తుగా అడవి పంది రోడ్డుపైకి రావడంతో రంతుల్లా ఆటోను అదుపు చేయలేకపోయారు. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న రంతుల్లా ఆటో కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న ఆయన భార్య, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. బంధువుల సహాయంతో రంతుల్లాను పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్దారించారు. మృతుడి భార్య షేక్ మస్తానమ్మ ఫిర్యాదు మేరకు చేజర్ల ఎస్సై అయ్యప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## స్క్రబ్బర్స్ మార్కెటింగ్ మోసం కేసు... దర్యాప్తుకు సిట్ ఏర్పాటు

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని స్క్రబ్బర్స్ మార్కెటింగ్ మోసం కేసుపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు అయ్యింది. విజయవాడ సిపి రాజశేఖర్ బాబు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. క్రైమ్ డిసిపి తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో సిట్ దర్యాప్తు చేయనుంది. సిట్ సభ్యులుగా టాస్క్‌ఫోర్స్ ఎడిసిపి లతాకుమారి, ఎస్‌బి ఎసిపి భానుప్రకాశ్‌రెడ్డిలు ఉంటారు. కృష్ణా జిల్లా కనూరుకు చెందిన పసుపులేటి అంకుశం, ఈ ఏడాది ఫిబ్రవరిలో సత్యనారాయణపురంలోని ఆదిశేషయ్య వీధిలో మాషా అల్లాహ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఒక కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ వ్యాపారంలో మరో నలుగురు డైరెక్టర్లు కూడా భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. స్క్రబ్బర్ ప్యాకింగ్, కోళ్ల పెంపకం, చిప్స్ తయారీ వంటి వ్యాపారాల గురించి ప్రచారం చేయడం ద్వారా ఆయన ప్రజల నమ్మకాన్ని పొందారు. గిన్నెలు శుభ్రం చేసే స్క్రబ్బర్లను ప్యాక్ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో ప్రజలు ఒక మార్కెటింగ్ పథకం పట్ల పలువురు ఆకర్షితులయ్యారు. ఫలితంగా చాలా మంది ఆయా సామాగ్రిని తీసుకుని ప్యాకింగ్ పనిని పూర్తి చేశారు. అయితే నిర్వాహకులు ఆ ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించడంలో ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లను తిరిగి చెల్లించడంలో విఫలం కావడంతో ఈ పథకం కుప్పకూలింది. ఈ ఘటన విజయవాడలోని సత్యనారాయణపురంలో వెలుగు చూసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బాధితులు జిల్లా అంతటా ఉండటం కేసు విచారణకు పోలీసు సిపి సిట్ ఏర్పాటు చేసారు.

## మేనకోడళ్లపై అసభ్య ప్రవర్తన.. మేనమామకు ఐదేళ్ల జైలు

**గుంటూరు లీగల్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** సొంత మేనకోడళ్ళు అయిన ఇద్దరు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన మేనమామకు ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాడేపల్లి అంజిరెడ్డి కాలనీకి చెందిన వ్యక్తి కూలి పనులకు వెళ్తుండేవాడు. 2015 సంవత్సరంలో అదే కాలనీకి చెందిన యువతితో వివాహమైంది. వీరికి నలుగురు కుమార్తెలు. సంఘటనకు ఏడాది క్రితం భార్యతో విభేదాలు రావడంతో ఆమె నలుగురు పిల్లలతో పుట్టింటికి చేరుకుంది. 2025 ఏప్రిల్ 16 తేదీ రాత్రి 11 గంటలకు 8 ఏళ్ల వయసున్న రెండో కుమార్తె ఏడ్చుకుంటూ ఇంటి నుంచి బయటకు రావడంతో అదే కాలనీలో నివాసం ఉండే తండ్రి ఏం జరిగిందని ప్రశ్నించాడు. మేనమామ కొండపాటి లంకబాబు తన శరీర భాగాలను స్పృశిస్తూ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక చెప్పింది. 9 ఏళ్ల పెద్ద కుమార్తె కూడా తన పట్ల మేనమామ అలాగే ప్రవర్తించాడని చెప్పడంతో బాలికల తండ్రి తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే నెల 18వ తేదీ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా, రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నాడు. నిందితుడిపై నేరం రుజువు చేయడంతో ఐదేళ్ల జైలు శిక్షతోపాటు, రూ2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

# శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా?

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం
- తాడపత్రిలో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఉద్రిక్తత
- ముచ్చుకోట వద్ద మాజీ మంత్రి పెద్దిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిని అడ్డుకున్న పోలీసులు



**అనంతపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా తాడపత్రిలో వైయస్సార్సీ పార్టీ లేకుండా చేయాలని తాడపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని, తాడపత్రి వెళుతున్న నన్ను అడ్డుకోవడం దుర్మార్గమని వైఎస్ఆర్సిపి రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ శాంతి యుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం తాడపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో డిఎస్సీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి నాయకులను, కార్యకర్తలను తరలి రావాలని పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పోటీగా తమదైన శైలిలో టిడిపి నేత ,మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి కూడా తాడపత్రి పట్టణంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నియోజవర్గం నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపు ఇచ్చారు.. ఈ విధంగా రెండు పార్టీలు పట్టణంలో కార్యక్రమాలు నిర్వహిస్తే ఉద్రిక్త పరిస్థితులు ఎదురవుతాయని కారణంతో తాడపత్రి ఇన్చార్జి డీఎస్పీ శ్రీనివాస్ రెండు పార్టీల కార్యక్రమాలకు అనుమతి లేదని ప్రకటించారు. అయినప్పటికీ రెండు పార్టీల నేతలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం నుంచి తాడపత్రి పట్టణంలో చేపట్టబోయే వైసిపి నిలిచిన కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరారు. అయితే అనంతపురం తాడపత్రి మధ్యలో ముచ్చుకోట వద్ద మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, ఇతర నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తాడపత్రి కి వెళ్లకుండా వారిని నిలుపుదల చేయడంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ చర్యలను, పోలీసులు చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందే అని డిమాండ్ చేశారు. తాడిపత్రి నుంచి బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ పోలీసులతో, పెద్దారెడ్డి వాగ్వివాదం నకు దిగారు. వైసిపి కార్యకర్తలకు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఇదే సమయంలో మై ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తాడపత్రికి పెద్ద తరలివచ్చిన టిడిపి నాయకులు పోలీసుల అడ్డుకున్నారు.




## డియస్సీ అక్రమాలపై ఆత్మకూరులో విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ఆత్మకూరు (నెల్లూరు), ఆగస్టు 10 ప్రభాతవార్త:** డియస్సీ లో క్రీడాకారుల కోటా కింద ఉపాధ్యాయుల నియామకాల్లో అనేక అవకతవకలు జరిగాయని వీటిపై సమగ్రంగా సిబిఐ విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, వెస్ఆర్‌సిపి ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యేవరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పదవికి రాజీనామా చేసి పక్కకు తప్పుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆత్మకూరులో సోమవారం మున్సిపల్ బస్టాండ్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జెఆర్‌పేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు నిలిపివేయడంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసుల తీరును నిరసిస్తూ మేకపాటి విక్రమ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మహిళా నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. ఆర్‌డిఒ కార్యాలయానికి 50మంది మాత్రమే వెళ్ళి వినతిపత్రం అందజేయవచ్చని సిఐ గంగాధర్ తెలిపారు. దీంతో 50మంది నాయకులు, కార్యకర్తలు ఆర్‌డిఒ కార్యాలయం వైపు బయలుదేరగా పార్టీ క్యాడర్‌వారిని అనుసరించింది. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భార్గవేంద్రరెడ్డి, ఉదయగిరి వైసిపి పరిశీలకులు కూనం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అంబటి కృష్ణారెడ్డి, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపిపిలు, జడ్పీటిసి సభ్యులు, వైసిపి మండల కన్వీనర్లు, జిల్లా నాయకులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## వైకాపా ర్యాలీలను అడ్డుకున్న పోలీసులు

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం డిఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీమానా చేయాలని, డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ నిర్వహించాలనే డిమాండ్‌తో వైకాపా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలను పోలీసులు అడ్డుకున్నారు. వైకాపా నిరసన ర్యాలీలను పోలీసులు అడ్డుకోవడంతో జిల్లా వ్యాప్తంగా వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, నాయకులు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు వైకాపా నిరసన ర్యాలీలు జరుగకుండా అడ్డుకొని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఇతర వైకాపా నాయకులను అరెస్టు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్లకు తరలించడంతో వైకాపా నాయకులు, కార్యకర్తలు సంబంధిత పోలీస్ స్టేషన్లకు చేరుకుని ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. డిఎస్సీలో భారీగా అక్రమాలు జరిగినట్లు స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం అంగీకరించడం లేదని వైకాపా నాయకులు ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. డిఎస్సీలో అక్రమాలు జరిగినట్లు, స్పోర్ట్స్ కోటాలో అనర్హులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు ఆధారాలతో మాజీ సిఎం, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరూపించినా ప్రభుత్వం నుండి దీనిపై స్పష్టమైన వివరణ లేదని వైకాపా నాయకులు పేర్కొన్నారు. అలాగే డిఎస్సీలో పలు అక్రమాలపై సిబిఐ విచారణ నిర్వహించడంతో పాటు అక్రమాలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని వైకాపా నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.

## బ్యాంకాక్‌లో ఎపి యువకులకు ఇక్కట్లు.. అండగా నిలిచిన మంత్రి లోకేశ్

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగాల పేరుతో విదేశాలకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకులు తీవ్ర ఆపదలో చిక్కుకున్నారు. బ్యాంకాక్‌లో ఏజెంట్ల చేతిలో మోసపోయి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమను అక్రమంగా మయన్మార్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ వారు సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. ఈ ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించారు. ఆపదలో ఉన్న బాధితులకు అండగా నిలుస్తూ భరోసా ఇచ్చారు.

**నకిలీ ఉద్యోగాల వల:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు యువకులు మంచి భవిష్యత్తు కోసం ఉద్యోగాల వేటలో పడ్డారు. ఇదే అదనుగా భావించిన కొందరు కేటుగాళ్లు వారికి వల వేశారు. థాయ్‌లాండ్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి మాటలు నిజమేనని నమ్మిన యువకులు బ్యాంకాక్ వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక అసలు వాస్తవం తెలుసుకున్నారు. ఏజెంట్లు చెప్పిందంతా అబద్ధమని, తాము మోసపోయామని గ్రహించారు. ఆపదలో ఉన్న యువకులు తమను తాము రక్షించుకునేందుకు సోషల్ మీడియాను ఆశ్రయించారు. బ్యాంకాక్‌లో తాము పడుతున్న కష్టాలను, నరకాన్ని వివరిస్తూ ఓ వీడియోను రూపొందించారు. ఉద్యోగం పేరుతో తమను మోసం చేశారని అందులో ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా తమను రక్షించి, స్వదేశానికి సురక్షితంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి కన్నీటిపర్యంతమవుతూ విజ్ఞప్తి చేశారు. బాధితుల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి వచ్చింది.

ఆయన వెంటనే బాధితుల ఆర్తనాదాలపై ఎక్స్ వేదికగా స్పందించారు. బ్యాంకాక్‌లో చిక్కుకున్న యువకులకు అభయం ఇచ్చారు. మీ ఆందోళన, ఆవేదన నాకు అర్థమైంది. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు అని వారికి ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉందన్న భరోసాను కల్పించారు.

## దైవ నామాలను, భక్తి గీతాలను అపహాస్యం చేయడంపై
### ఉప ముఖ్యమంత్రి పవన్ అసహనం

**విజయవాడ, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయ నిరసనల కోసం పవిత్రమైన దైవ నామాలను, భక్తి గీతాలను అపహాస్యం చేయడంపై ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరు నగరంలో వైఎస్సార్సీపీ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో గోవింద నామాలను పేరడీలుగా పాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ అధికారిక ఎక్స్‌ఖి వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. పవిత్రమైన గోవింద నామాలను రాజకీయాలకు వాడుకోవడం దారుణమని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. పేరడీల పేరుతో భక్తుల మనోభావాలను వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందన్నారు. వారి వైనం కోట్లాది మంది భక్తుల ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వార్థం కోసం దేవుడిని వివాదాల్లోకి లాగడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు.

## నాగార్జునకొండ మ్యూజియంకు బ్యాటరీవాహనాలు ఇవ్వాలని వినతి

**విజయవాడ, ఆగష్టు 10, ప్రభాతవార్త:** నాగార్జునకొండ మ్యూజియంకు మంజూరయిన రెండు బ్యాటరీ వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిలభారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు కేంద్రపురావస్తుశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ త్రిపాఠికి వినతి పత్రం అందచేసారు. సోమవారం న్యూడిల్లీలో త్రిపాఠిని కలిసిన వీరాంజనేయులు మాట్లాడుతూ దివ్యాంగులు, చిన్నారులు, వృద్దులు మ్యూజియం వద్ద నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. వీరాంజనేయులు విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన త్రిపాఠి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## విఆర్ఏ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా ఈశ్వరయ్య

**విజయవాడ, ఆగష్టు 10, ప్రభాతవార్త:** ఆం ధ్రప్రదేశ్ విఆర్ఏ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. విజయవాడలోని దాసరి భవన్‌లో రాష్ట్రకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రడిప్యూటీ జనర్‌సెక్రటరీగా కొమ్మాది ఈశ్వరయ్య, కార్యదర్శులుగా నెల్లూరు అంకయ్య, బోట్ల నాగసుబ్బయ్య యాదవ్, కేశవరావు, రాజశేఖర్, గోపి, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విఆర్ఏల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని ఎన్నికైన నాయకులు ప్రకటించారు.

## వైసిపి వింత నిరసనలకు హెయిర్ కలర్స్‌కు డిమాండ్
### - జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కిరణ్ రాయల్

**తిరుపతి హెల్త్, ఆగష్టు 10, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో హెయిర్ కలర్స్‌కు బాగా డిమాండ్ పెరిగిందని,వైసిపి వృద్ధ నాయకులందరూ తలకు కలర్లు వేసుకుని జెన్‌జీ అని రోడ్లపై తిరుగుతున్నారని జనసేన తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఎస్సి అక్రమాల పేరుతో పెన్షన్లు తీసుకునే వారితో, వయస్సు పై బడిన వారితో నిరసనలు చేయడం హాస్యాస్పదం అన్నారు. జెన్ జి అంటే ఇదేనా అని జనం నవ్వుకుంటున్నారని కిరణ్ రాయల్ అన్నారు.

నెల్లూరులో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి అండ్ బ్యాచ్ తిరుమల శ్రీవారిని కించపరిచారని, వెంకటేశ్వర స్వామివారి కీర్తనలను అవహేళన చేస్తూ పాటలను వక్రీకరించారని, వైసిపి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిపై టిటిడి వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేసి, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోజా, భూమన కరుణాకర్ రెడ్డి, ఇతర వైపిసి నేతలందరు ముసలి జెన్ జీ లు అన్నారు. నిజమైన జెన్ జీలు జనసేనపార్టీలో ఉన్నారని కిరణ్ రాయల్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి హేమకుమార్ మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోలేదని, పాలన పోయినాక ప్రజల పైన, నిరుద్యోగుల పైన, అత్యుత్సాహం ప్రదర్శిస్తూ రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని అన్నారు.



## డిఎస్సీపై వైసిపి డ్రామాకు వీధి నాటకంతో టిఎన్ఎస్ఎఫ్ వినూత్న ప్రదర్శన

**తిరుపతి, ఆగస్టు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసిన డిఎస్సీ 2025పై వైసిపి నేతలు చేస్తున్న డ్రామాలతో టిఎన్ఎస్ఎఫ్ తిరుపతిలో వినూత్న ప్రదర్శన చేసింది. 2019-24 మధ్య కాలంలో ఐదేళ్ల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఇప్పుడు నిరుద్యోగులపై ప్రేమ ఎందుకు అని జగన్ సమాధానం ఇవ్వాలని సవాల్ విసిరారు. డిఎస్సీ నోటిఫికేషన్‌పై వైసిపి నేతలు చేస్తున్న రాజకీయ ప్రచారానికి కౌంటర్‌గా టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తిరుపతి ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద వినూత్న వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వీధి నాటకంలో రాజకీయ నాయకుల పాత్రలకు మాస్కులు ధరించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, భూమన అభినయ్ రెడ్డి, నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడు తదితర పాత్రలను ప్రతీకాత్మకంగా ప్రదర్శించారు. అలాగే న్యాయమూర్తి, న్యాయవాది,నిరుద్యోగ యువత పాత్రలను ఏర్పాటు చేసి, డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించిన అంశాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీధి నాటకం ద్వారా వివరించారు. 2019-2024 వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూసిన నిరుద్యోగులకు సరైన అవకాశాలు కల్పించలేని ప్రభుత్వం, గత ఐదేళ్లలో డీఎస్సీ నోటిఫికేషన్ గురించి పట్టించుకోకుండా ఇప్పుడు నిరుద్యోగులపై ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందని టీఎన్ఎస్ఎఫ్ ప్రశ్నించింది. అనంతరం ఆయా కేసులపై న్యాయస్థానాల్లో జరిగిన పరిణామాలను కూడా ఈ వీధి నాటకంలో ప్రదర్శించారు. కోర్టుల తీర్పులు, న్యాయపరమైన అంశాలను ప్రతీకాత్మకంగా చూపిస్తూ ప్రజలకు వివరించారు. తిరుపతిలో టిడిఆర్ బాండ్ల వ్యవహారం తదితర ప్రజా సమస్యలను కూడా వీధి నాటకంలో ప్రస్తావించారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, డ్రగ్స్‌కు బానిసలుగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయంటూ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ అంశాలకు సంబంధించి అభినయ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి పాత్రలను ప్రతీకాత్మకంగా చూపిస్తూ నాటకంలో వివరించారు. ఈ వీధి నాటక పాత్రను టిఎన్ఎస్ఎఫ్ వెంకటేశ్వర యూనివర్సిటీ అధ్యక్షుడు వెంకటేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్కే నాయుడు, విద్యార్థి సంఘాల నాయకులు హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పొలాలను పరిశీలించిన బేబీనాయన

**విజయనగరం, ఆగస్టు 10 ప్రభాతవార్త:** బొబ్బిలి శాసనసభ్యులు ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబీ నాయన) ఆదేశాలు ప్రకారం శివడవలస గ్రామంలో అడవి ఏనుగుల గుంపు వలన నష్టపోయిన మొక్కజొన్న పొలాలను పరిశీలించడం జరిగింది. గొట్టాపు కాసినాయుడు రైతుకు సంబంధించిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంటను ధ్వంసం అడవి ఏనుగుల గుంపు చేయడం జరిగింది. ఆ పంట పరిశీలన చేసి ప్రస్తుతం పంట మొక్కజొన్న గింజ పాలు పోసుకునే దశలో ఉండడం వలన నష్టమనేది ఎక్కువగా కనిపించింది. దీనిని సంబంధిత అటవీ శాఖ సిబ్బందికి ఈ వివరాలు సమర్పిస్తున్నామని తెలియజేస్తున్నాము. ఈ వివరాలు ప్రకారం అటవీ శాఖ వారి ద్వారా పంట నష్ట పరిహారం ఇప్పించుటకు కృషి చేస్తున్నాం.

## 313 కేజీల గంజాయి స్వాధీనం

**కావలి (నెల్లూరు), ఆగస్టు 10 ప్రభాతవార్త:** గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 313 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కావలి డిఎస్పీ వివి రమణ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 1వ తేదీ రాత్రి దగదర్తి మండలం సున్నపుబట్టి సమీపాన బొలెరా వాహనం బోల్తా పడింది. వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయిని గుర్తించారు. ఈ కేసు విషయమై కావలి రూరల్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో ఎస్సైలు మహేంద్ర, రామకృష్ణలు తమ సిబ్బందితో కలిసి తడ సమీపన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని డిఎస్పీ తెలియజేశారు. బొలెరో వామనంలో ఉన్న 313 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించామన్నారు. ఈ సమావేశంలో కావలి రూరల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఏఎస్సైలు మహేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు ఆవరణలో సాక్షి కిడ్నాప్ కేసులో మరో ముగ్గురు నిందితుల అరెస్టు


**తిరుపతి క్రైమ్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** తిరుపతిలో గతంలో జరిగిన బెల్ట్ మురళి హత్య కేసులు సాక్షి ఉన్నటువంటి మల్లారపు చిన్నాను కోర్టు ప్రాంగణంలో ద్విచక్ర వాహనంలో బలవంతంగా కిడ్నాప్ చేసి హత్య కేసులో తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలంటూ బెదిరించిన నిందితులలో నలుగురిని వెస్ట్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి విధితమే. ఇందులో భాగంగా మిగిలిన నలుగురు నిందితులలో మరో ముగ్గురు నిందితులను సోమవారం తిరుపతి వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వెస్ట్ సిఐ రామకృష్ణ మాట్లాడుతూ కిడ్నాప్ కేసులో పాత్రులైన వారిలో గతంలో నలుగురని అరెస్టు చేసామని, ప్రస్తుతం మరో ముగ్గురిని పసుపులేటి సురేష్, వినయ్, చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అనంతరం వీరిని కోర్టుకి తరలిస్తామని తెలిపారు. మిగిలిన మరో నిందితుడు విశ్వతేజును తీవ్రంగా గాలిస్తున్నామని త్వరలోనే అతనిని కూడా అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని వివరించారు.

## అభివృద్ధి చూసి ఓట్లు వేయండి
### గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్‌కుమార్



**కోట(నెల్లూరు), ఆగస్టు 10, ప్రభాతవార్త :** గ్రామాల్లోని అభివృద్ధి పనులు చేసిన వారికి ఓట్లు వేయాలని గూడూరు శాసన సభ్యులు డాక్టర్, పాశం సునిల్ కుమార్ కోరారు. ప్రజల ఆశీస్సులు, విశ్వానంతో మరింత అభివృద్ధి దిశగా ముందుగా సాగుతామని.. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూన్నామన్నారు. వాకాడు మండలంలోని నెల్లిపూడి గ్రామంలో సోమవారం రెండేళ్ల నమ్మకం.. సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను పూర్తి స్దాయిలో అమలు చేయడం జరిగిందన్నారు. మెగా డిఎస్‌సి, ద్వారా 16500 పోస్టులను బర్తీ చేయడం జరిగిందన్నారు. వైకాపాలో పాలనాలో ఒక్క టిచర్ పోస్టు భర్తీ చేయలేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అద్వర్యంలో రాష్ట్రం ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా అద్యక్షులు మధురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు. అంతక ముందు శాసన సభ్యులు సునిల్‌కుమార్‌కు ప్రజలు బ్రహ్మ రథం పట్టారు. ఆయన పై పూల వర్షం కురిపించారు.

# వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పూజా ఓటమి




**న్యూఢిల్లీ:** మహిళల హైజంప్ ఫైనల్‌లో జాతీయ సీనియర్ రికార్డు హోల్డర్ పూజా సింగ్ ఓటమితో ఏడవ స్థానంలో నిలవడంతో, భారత్ తన ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ ప్రచారాన్ని మూడు పతకాలతో(2 రజత, 1 కాంస్య) ముగించింది. ఈ ఏడాది ఆరంభంలో 1.93 మీటర్ల జాతీయ సీనియర్ రికార్డు నెలకొల్పిన 19 ఏళ్ల ఆ క్రీడాకారిణి, అగ్రశ్రేణి పోటీదారులలో ఒకరిగా ఈ పోటీలోకి ప్రవేశించింది. అయితే, ఫైనల్‌లో ఆమె 1.84 మీటర్లు మాత్రమే సాధించగలిగింది, ఆ తర్వాత 1.87 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైంది. దీంతో ఆస్ట్రేలియాకు చెందిన ఇజోబెల్ లూయిసన్‌రో 1.92 మీటర్ల ఎత్తును అధిగమించి స్వర్ణం గెలుచుకోగా, హంగేరీకి చెందిన లిలియానా బటోరి, స్పెయిన్‌కు చెందిన ఐటానా అలోన్సో 1.90 మీటర్ల ఎత్తును అధిగమించి మిగిలిన పోడియం స్థానాలను పంచుకున్నారు. కాగా భూమిక నెహటే, తహురా ఖాతున్, తను చౌదరి, థియా అరుముగంలతో కూడిన భారత మహిళల 4స400 మీటర్ల రిలే క్వార్టెట్ ఫైనల్‌లో 3:45.28 సమయంతో తొమ్మిదవ స్థానంలో, చివరి స్థానంలో నిలిచింది. యునైటెడ్ స్టేట్స్ 3:29.15 సమయంతో స్వర్ణం గెలుచుకోగా, ఆస్ట్రేలియా 3:31.39 సమయంతో రజతం, గ్రేట్ బ్రిటన్ 3:32.08 సమయంతో కాంస్యం గెలుచుకున్నాయి. అంతకు ముందు పురుషుల జావెలిన్ త్రోలో ఆశిష్ యాదవ్ రజతంతో దేశానికి ఖాతా తెరవగా, పురుషుల హైజంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ మరో రజతం గెలుచుకున్నాడు. పురుషుల లాంగ్‌జంప్‌లో షానవాజ్ ఖాన్ కాంస్యం సాధించాడు.

## బల్లారట్ స్క్వాష్ ఓపెన్‌లో
# రన్నరప్‌గా సాన్య




**న్యూఢిల్లీ:** పిఎస్‌ఎ ఉమెన్స్ ఛాలెంజర్ టూర్ 3 ఈవెంట్ అయిన 2026 బల్లారట్ ఓపెన్ ఫైనల్లో, సాన్యా వాట్స్ పరాజయంతో టోర్నీ నుండి నిష్క్రమించింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 24 ఏళ్ల రెండో సీడ్ క్రీడాకారిణి, టాప్ సీడ్, స్వదేశీ అభిమాన క్రీడాకారిణి అయిన సారా కార్డ్‌వెల్ చేతిలో 24 నిమిషాల్లో 6-11, 8-11, 6-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. గత వారం విక్టోరియా ఓపెన్ ఛాలెంజర్ 6కె ఈవెంట్ 2026లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, ఈ నెలలో ఆమెకు ఇది వరుసగా రెండవ ఫైనల్. పాకిస్థాన్‌కు చెందిన వజీహా అల్తాఫ్ వాకోవర్ ఇవ్వడంతో ఆమె రెండో రౌండ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత దక్షిణ కొరియా ప్రత్యర్థులపై వరుసగా రెండు విజయాలు సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆమె సుంగీ ఓహ్‌పై 6-11, 11-9, 12-10, 11-4 స్కోరుతో నాలుగు గేమ్‌ల హోరాహోరీ పోరులో గెలిచింది. ఆ తర్వాత సెమీస్‌లో ఐన్ జున్‌పై 11-5, 11-8, 11-4 స్కోరుతో స్ట్రెయిట్ గేమ్‌లలో విజయం సాధించింది. గత వారం విక్టోరియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత ఏడు స్థానాలు ఎగబాకిన ఆమె, ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ అయిన 136వ స్థానంలో ఉంది.




## ప్లేయర్ ఆఫ్ ద మంత్‌లో..
# టీమిండియా స్టార్లకు నో ప్లేస్

**న్యూఢిల్లీ:** ఐసీసీ ప్రకటించిన ప్లేయర్ ఆఫ్ ద మంత్ నామినీస్‌లో టీమిండియాకు చెందిన స్టార్ ప్లేయర్లకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్, వెస్టిండీస్ ఆల్ రౌండర్ జస్టిన్ గ్రీవ్స్, బంగ్లాదేశ్ బ్యాటర్ తంజిద్ హసన్ జూలై నెల పురుషుల నామినీస్ జాబితాలో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో రాణించకపోవడంతో ఈ జాబితాలో టీమిండియా ప్లేయర్లు ఎవరికీ ప్లేస్ దొరకలేదు. ఇక ఇంగ్లండ్ వైట్‌బాల్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జూలైలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో విశేషంగా రాణించాడు. అతడి కెప్టెన్సీలో ఇంగ్లండ్ భారత్‌పై వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకుంది. భారత్‌పై విజయాలు, వ్యక్తిగత ప్రదర్శన బ్రూక్‌ను ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు రేసులో నిలబెట్టాయి. అలాగే వెస్టిండీస్ ప్లేయర్ జస్టిన్ గ్రీవ్స్ జూలైలో ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో సెంచరీలతో పాటు, బౌలింగ్‌లో 5 వికెట్ల ఘనత కూడా సాధించాడు. బాంగ్లదేశ్ యువ బ్యాటర్ తంజిద్ హసన్ కూడా ఆ నెలలో వైట్‌బాల్ క్రికెట్‌లో మంచి ప్రదర్శన ఇచ్చాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన తంజిద్ జూలైలలో మరోసారి చూపించి నామినీల్లో చేరేలా చేసుకున్నాడు. కాగా గత నెలలో భారత్ జట్టు ఇంగ్లండ్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడింది. కానీ ఈ పర్యటనలో ఆశించిన స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోయింది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత్ టీ20లో ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-4తో కోల్పోయింది. వన్డే సిరీస్‌లో భారత్ మంచి ఆరంభాన్నిచ్చి ఇంగ్లండ్‌ను ఓడించినా, తర్వాత వరుసగా ప్రత్యర్థి చేతిలో 2-1తో ఓటమి చెందింది. ఈ సిరీస్‌లో భారత్ తరపున రోహిత్ శర్మ మాత్రమే ఓ వన్డే సెంచరీతో ఆకట్టుకున్నాడు.

# డ్యూరాండ్ కప్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు మోహన్ బగాన్

**న్యూఢిల్లీ:** సహల్ అబ్దుల్ సమద్ మొదటి అర్ధభాగంలో సాధించిన అద్భుతమైన హ్యాట్రిక్‌తో, మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు సిఐఎస్‌ఎఫ్ ప్రొటెక్టర్స్‌పై 6-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి డ్యూరాండ్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సహల్ అబ్దుల్ సమద్ తొలి అర్ధభాగంలోనే హ్యాట్రిక్ (17 నిముషం, 19, 37) సాధించి స్టార్‌గా నిలిచాడు. అలాగే మన్వీర్ సింగ్ (24), జేమీ మెక్లారెన్ (68), టెక్చమ్ అభిషేక్ సింగ్ (73) కూడా గోల్స్ చేశారు. ఈ విజయంతో మోహన్ బగాన్ జట్టు 9పాయింట్లతో గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలవగా, సిఐఎస్‌ఎఫ్ ప్రొటెక్టర్స్ ఒక్క పాయింట్ కూడా లేకుండా టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది. మోహన్ బగాన్, ఆరంభం నుంచే దాడిని ప్రదర్శించింది. అయినప్పటికీ



ప్రొటెక్టర్స్ జట్టు రక్షణ విభాగం పటిష్టంగా నిలిచింది. డెజాన్ డ్రాజిక్ అభిషేక్ సింగ్‌కు అద్భుతమైన పాస్ ఇవ్వడంతో సహల్ గోల్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఆ తర్వాత మన్వీర్, టెక్చ మ్ అందించిన అద్భుతమైన క్రాస్‌ను నియంత్రించి స్కోరును 3-0కి పెంచాడు. బంతిని అందుకున్న సహల్ అద్భుతమైన రీతిలో తన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. మోహన్ బగాన్ మొద టి అర్ధభాగంలో 75%బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించి,విరామసమయానికి 4 గోల్స్ ఆధిక్యం లోకి వెళ్లింది. మోహన్ బగాన్ చివరకు ఐదవ గోల్ జోడించ డానికి ముందు మన్వీర్ మరియు లిస్టన్ గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చారు. లిస్టన్‌తో కలిసి ఆడిన టెక్చామ్, బంతిని నెట్ పైకప్పులోకి పంపి ఘన విజయాన్ని పూర్తి చేశాడు.



# సూపర్ జెయింట్స్ కన్నేసిన ముంబయి

## వచ్చే సీజన్‌లో టైటిల్ లక్ష్యంగా ఎంపిక

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమైంది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 14 మ్యాచ్‌ల్లో పదింటిలో ఓడి తీవ్రంగా నిరాశపర్చింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఐదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు ఇది ఏ మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన కాదు. జట్టు నిండా స్టార్లు ఉన్నా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం ముంబై పతనాన్ని శాసించింది. ఈ ఘోర పరాజయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై ఇండియన్స్ వచ్చే సీజన్‌లో టైటిల్ గెలవడమే లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. జట్టును వీడాలని నిర్ణయించుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్లను ఇతర జట్ల నుంచి ట్రేడ్ చేసుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్, కోల్‌కత్తా నైట్ రైడర్స్‌తో ట్రేడ్ డీల్ గురించి చర్చలు జరిపిన ముంబై ఇండియన్స్ ఇతర ఫ్రాంచైజీలను కూడా సంప్రదించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లక్నో సూపర్ జెయింట్స్‌కు చెందిన ప్రిన్స్ యాదవ్, మొహ్‌సిన్ ఖాన్‌తో పాటు, నికోలస్ పూరన్‌లపై ముంబై కన్నేసినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యాను ఇచ్చి ఈ ముగ్గురి ఆటగాళ్లను జట్టులోకి తెచ్చుకోవాలనే ప్రయత్నాల్లో ముంబై ఉన్నట్లు సమాచారం. నికోలస్ పూరన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముంబై ఫ్రాంచైజీల తరఫున ఆడుతాడు. ఐపీఎల్‌లో కూడా అతన్ని తమ జట్టులోకి తీసుకోవాలనే యోచనలో ముంబై మేనేజ్‌మెంట్ ఉంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్‌కు కూడా కెప్టెన్ అవసరం ఉంది. రిషభ్ పంత్ ఆ జట్టును వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. టీమిండియా మాజీ క్రికెటర్ అశ్విన్ కూడా లక్నోతో ముంబై సంప్రదింపులు జరపవచ్చని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యాకు బదులుగా ప్రిన్స్ యాదవ్, మోహ్‌సిన్ ఖాన్‌తో పాటు నికోలస్ పూరన్‌ను ముంబై అడగవచ్చని అంచనా వేసాడు. లక్నో జట్టుకు కూడా కెప్టెన్ అవసరం ఉందని, హార్దిక్ పాండ్యాను తీసుకోవడం వారికి ప్రయోజనకరంగా ఉంటుందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అయితే ఒక్క హార్దిక్ పాండ్యా కోసం లక్నో సూపర్ జెయింట్స్ ముగ్గురు స్టార్ ఆటగాళ్లను వదులుకుంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, ముంబై ఇండియన్స్ ఓనర్స్ ముఖేష్ అంబానీ మధ్య మంచి వ్యాపారా లావాదేవీలున్నాయి. గత సీజన్‌కు ముందు శార్దూల్ ఠాకూర్‌ను ముంబై ఇండియన్స్ ట్రేడ్ చేసుకుంది. ఈ ట్రేడ్ అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ తరహాలోనే ముంబై తమకు కావాల్సిన ఆటగాళ్లను లక్నో నుంచి తీసుకోవచ్చే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సెబీ ఆంక్షలపై శాట్ ఆశ్రయించిన జీ ఎంటర్‌ప్రైజెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** సెక్యూరిటీస్ మార్కెట్‌లో ప్రవేశించకుండా సెబీ విధించిన ఆంక్షలను సవాల్ చేస్తూ జీ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ, సీఈఓ పునీత్ గోయెంకా సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను




ఆశ్రయించారు. అత్యవసర విచారణ, మధ్యంతర ఉపశమనం కోరడంతో ఈ కేసును బుధ వారం విచారించనుంది. తుది తీర్పువెలువడే వరకు మార్కెట్ యాక్సెస్ నిషేధాన్ని నిలిపివేయాలని వారు కోరారు. ప్రమోటర్ గ్రూప్ సంస్థ సన్‌బ్రైట్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 3,143.5 కోట్ల విలువైన పూర్తిగా కన్వర్టిబుల్ వారెంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూను కొనసాగించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.గతనెల 31న సెబీ జీ ఎంటర్‌ప్రైజెస్‌పై రెండు నెలల మార్కెట్ నిషేధం విధించగా, పునీత్ గోయెంకా, ప్రమోటర్ సుభాష్ చంద్రపై 12 నెలల చొప్పున ఆంక్షలు విధించింది.

జీపై రూ.30 లక్షలు, గోయెంకాపై రూ.58 లక్షలు, చంద్రపై రూ.60 లక్షలు జరిమానా విధించింది. జూబ్లీహిల్స్‌లోని జీ ఆస్తిని ఎస్సెల్ గ్రూప్‌కు చెందిన నాలుగు సంస్థలు ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి తీసుకున్న సుమారు ..726 కోట్ల రుణాలకు భద్రతగా ఉపయోగించడమే కేసుకు ప్రధాన కారణం.

# ఇంటెల్ షేర్ల పతనం..

## రూ.15 బిలియన్ల సేకరణకు నిర్ణయం

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ షేర్లు సోమవారం ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో దాదాపు 5 శాతం పడిపోయాయి. కంపెనీ సుమారు 15 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.1.3 లక్షల కోట్లు సమీకరించేందుకు కొత్తగా షేర్లను జారీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇన్వెస్టర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. గత ఏడాది కాలంలో ఇంటెల్ షేర్ ధర 400 శాతానికి



పైగా పెరగడంతో, అధిక విలువల వద్ద తాజా మూలధనాన్ని సమీకరించేందుకు కంపెనీ ఈ అవకాశాన్ని వినియోగించు కుంటోంది. ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌లో ఇంటెల్ షేరు 4.67 శాతం క్షీణించి 96.90 డాలర్లకు చేరింది. గత సెషన్‌లో ఇది 101.65 డాలర్ల వద్ద ముగిసింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా టెక్నాలజీ రంగంలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ, తమ ఉత్పత్తులకు కస్టమర్ల నుంచి డిమాండ్ బలంగా, స్థిరంగా కొనసాగుతోందని ఇంటెల్ తెలిపింది. ఫిజికల్ ఎఐ, కస్టమ్ సిలికాన్, అడ్వాన్స్‌డ్ చిప్ ప్యాకేజింగ్, ఇతర సంస్థల కోసం వాఫర్ తయారీ వంటి విభాగాల్లో గణనీయమైన వృద్ధి అవకాశాలను కంపెనీ గుర్తించింది.కొత్త షేర్ల విక్రయం ద్వారా లభించే నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు, ముఖ్యంగా క్యాపిటల్ వ్యయాలకు వినియోగించనున్నట్లు ఇంటెల్ వెల్లడించింది.

వాణిజ్యం




# స్వల్పలాభాలకే సెన్సెక్స్, నిఫ్టీ పరిమితం

**ముంబయి,ఆగస్టు 10:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్లు ఫోకస్ పెంచడంతో సోమవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. గత వారం ప్రవేశపెట్టిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానం చివరి నిమిషాల్లో మార్కెట్లో అధిక అస్థిరతకు కారణం కావడంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత కొనసాగింది. అమెరికా-ఇరాన్ పరిణామాలు, రుతుపవనాల పురోగతిని ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, దాని ప్రభావంతో ముడిచమురు ధరలు పెరిగే అవకాశాలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 43.27 పాయింట్లు పెరిగి 78,542.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 13.15 పాయింట్లు లాభపడి 24,583.80 వద్ద స్థిరపడింది. ప్రైవేట్ బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్లు నిఫ్టీకి మద్దతుగా నిలిచాయి. మరోవైపు పీఎస్‌యూ బ్యాంకులు, చమురు-గ్యాస్ షేర్లలో బలహీనత లాభాలను పరిమితం చేసింది. మిడ్‌క్యాప్ షేర్లలోనూ స్వల్ప లాభాలు నమోదయ్యాయి. బీఎస్‌ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.17 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.04 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో 2,225 షేర్లు లాభపడగా, 2,226 షేర్లు నష్టపోయాయి. మరో 207 షేర్లలో మార్పు లేదు. టైటాన్ కంపెనీ 3.02 శాతం కంపెనీ కన్సాలిడేటెడ్ పన్ను తర్వాత లాభం 62.9 శాతం పెరిగి రూ.1,777 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ 2.24 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.76 శాతం లాభపడ్డాయి.స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ 8.42 శాతం ర్యాలీ చేసింది. ఏకీకృత నికర లాభం 136.94 శాతం పెరిగి రూ.103.28 కోట్లకు చేరింది.ఆయిల్ ఇండియా 2.30 శాతం పెరిగింది. ఏకీకృత నికర లాభం 252.83 శాతం పెరిగి రూ.2,870.21 కోట్లకు చేరింది. పవర్ మెక్ ప్రాజెక్ట్స్ 3.26 శాతం పడిపోయింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 44 శాతం తగ్గి రూ.79.78 కోట్లకు చేరింది.కేన్స్ టెక్నాలజీ ఇండియా 3.14 శాతం క్షీణించింది. ఆర్తి ఫార్మాల్యాబ్స్, యూనివర్సల్ కేబుల్స్ బలమైన త్రైమాసిక ఫలితాలతో 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.డెల్హివరీ 1.07 శాతం లాభపడింది.సాల్జర్ ఎలక్ట్రానిక్స్ బలహీన లాభదాయకత నేపథ్యంలో 5.58 శాతం పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 46 సెంట్లు లేదా 0.55 శాతం పెరిగి బ్యారెల్‌కు 84.01 డాలర్లకు చేరింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.3050 వద్ద కొనసాగింది. గత సెషన్‌లో ఇది 95.1750 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.38 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,52,400 వద్ద కొనసాగింది.

# జూలైలో ఇ-వే బిల్లుల జోరు.. 5.98 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ,ఆగస్టు 10:** దేశ ఆర్థిక వ్యవస్థలో వస్తువుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయనడానికి సంకేతంగా గత జులైనెలలో ఈవే బిల్లుల జారీ పెరిగింది. జీఎస్టీ ట్యాక్స్ నెట్‌వర్క్ డేటా ప్రకారం జులైలో 13.979 కోట్ల ఈవే బిల్లులు జారీ అయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 13.191 కోట్లతో పోలిస్తే ఇది 5.98 శాతం వృద్ధిగారికార్డయింది. ఈ ఏడాది మార్చిలో నమోదైన 14.060 కోట్ల ఈవే బిల్లులే ఇప్పటివరకు అత్యధికం. జూన్‌లో నమోదైన 13.677 కోట్లతో పోలిస్తే జూలైలో ఈవే బిల్లుల జారీ 2.21 శాతం పెరిగింది.అయితే, త్రైమాసిక ప్రాతిపదికన వృద్ధి వేగం కొంత తగ్గింది. ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఈ వే బిల్లుల వృద్ధి 15.7 శాతంగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అది 12.4 శాతానికి తగ్గింది.రాష్ట్రాల మధ్య రూ.50వేలకు మించి విలువైన సరుకుల రవాణాకు ఈవే బిల్లు తప్పనిసరి. అంతర్రాష్ట్ర రవాణాకు సంబంధించిన ఈ పరిమితి రాష్ట్రాలను బట్టి మారుతూ ఉంటుంది.పన్ను వసూళ్లకు సానుకూల సంకేతాలుశ్రీద్రి ఇండియా భాగస్వామి ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జూలైలో ఈవే బిల్లుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 5.98 శాతం పెరగడంతో పాటు, నెలవారీగా కూడా వృద్ధి నమోదు కావడం దేశీయ వాణిజ్యం, సరఫరా గొలుసులు పటిష్ఠంగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తోందన్నారు. ఆగస్టు జీఎస్టీ వసూళ్లు కూడా బలంగా ఉండే అవకాశం ఉందని, అయితే తుది ఆదాయం లావాదేవీల విలువ, వాటి స్వభావంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నెలవారీ ఆర్థిక సమీక్షలో ప్రపంచవ్యాప్తంగా




అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగాన్ని కొనసాగించింది. దీనికి దేశీయ డిమాండ్‌లోని స్థిరత్వం ప్రధానంగా దోహదపడింది.అయితే కొన్ని హైఫ్రీక్వెన్సీ సూచీలు, ముఖ్యంగా ఈవే బిల్లుల జారీ, తయారీ రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ వృద్ధి వేగంలో కొంత మందగమనాన్ని చూపించాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.ఇదే సమయంలో సేవల రంగం మరింత బలపడిందని, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌కు అనుకూల పరిస్థితులు దీనికి మద్దతుగా నిలిచాయని పేర్కొంది.




# రోజుకు రూ.7700 కోట్లు పెరిగిన మస్క్ సంపద

**న్యూయార్క్,ఆగస్టు 10:** ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంపద ఏడాది కాలంలో భారీగా పెరిగింది. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద ఏకంగా 320 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.27 లక్షల కోట్లకు పైగాపెరిగింది. రోజుకు సగటున 875 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.7,700 కోట్లు చొప్పున ఆయన సంపద పెరిగినట్లు బెస్ట్‌బ్రోకర్స్ వెల్లడించింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ జాబితాను ఆధారంగా చేసుకుని అధ్యయనం జరిగింది. 2025 జులై 27న, 2026 జులై 27న ప్రపంచ కుబేరుల సంపదను పోల్చి చూశారు. గత ఏడాది కృత్రిమ మేధ, టెక్నాలజీ రంగాల్లో భారీ వృద్ధి కనిపించింది. దీంతో ఈ రంగాలకు చెందిన పలువురు వ్యాపారవేత్తల సంపద గణనీయంగా పెరిగింది. మస్క్ తర్వాత అత్యధికంగా సంపద పెరిగిన వ్యక్తిగా డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మైఖేల్ డెల్ నిలిచారు. ఆయన సంపద ఏడాదిలో 107.6 బిలియన్ డాలర్లు పెరిగింది. డీప్‌సీక్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ సంపద 2025లో 1బిలియన్ డాలర్ల నుంచి 2026లో 39.5 బిలియన్ డాలర్లకు చేరింది. అంటే ఏడాదిలో ఏకంగా 3,850 శాతం పెరిగింది. దీంతో ఆయన ప్రపంచంలోని టాప్50 కుబేరుల జాబితాలో చేరారు. మస్క్ తొలిసారి 2021లో ఫోర్బ్స్ కుబేరుల జాబితాలోచోటు సంపాదించారు. అప్పటి నుంచి ఆయన సంపద కొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉంది.

## నాన్‌లైఫ్ బీమా ప్రీమియం వృద్ధి 5.7%కే పరిమితం

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** దేశంలోని నాన్‌లైఫ్ బీమా సంస్థల స్థూల ప్రత్యక్ష ప్రీమియం వృద్ధి జూలైలో మందగించింది. గత ఏడాది ఇదే నెలలో దాదాపు 16 శాతంగా ఉన్న వృద్ధి, ఈ ఏడాది జూలైలో 5.7 శాతానికి పరిమితమైంది. మల్టీలైన్




సాధారణ బీమా సంస్థల ప్రీమియం వృద్ధి తగ్గడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.నాన్‌లైఫ్ బీమా సంస్థల పరిశ్రమ సంఘం జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ విడుదల చేసిన డేటా ప్రకారం మల్టీలైన్ సాధారణ బీమా సంస్థలు, స్టాండలోన్ హెల్త్ ఇన్సూరర్లు, ప్రత్యేక ప్రభుత్వ రంగ బీమా సంస్థలను కలిపి జూలైలో మొత్తం స్థూల ప్రత్యక్ష ప్రీమియం 31,397.6 కోట్లుగా నమోదైంది.మల్టీలైన్ జనరల్ ఇన్సూరర్ల ప్రీమియం ఏడాది ప్రాతిపదికన 7.7 శాతం పెరిగి 26,335.3 కోట్లకు చేరింది. హెల్త్ ఇన్సూరర్ల ప్రీమియం ఒక్కటే 28.8 శాతం వృద్ధితో 4,666 కోట్లుగా నమోదైంది. అయితే ప్రత్యేక ప్రభుత్వ రంగ బీమా సంస్థల ప్రీమియం 75 శాతానికి పైగా క్షీణించి రూ. 396 కోట్లకు పడిపోయింది. జూన్‌లో నాన్‌లైఫ్ బీమా సంస్థల స్థూల ప్రత్యక్ష ప్రీమియం 27,196.3 కోట్లుగా ఉండగా, వార్షిక వృద్ధి 15.9 శాతంగా నమోదైంది. మేలో ప్రీమియం 24,195 కోట్లుగా, 8.7 శాతం వృద్ధితో నమోదైంది. ఏప్రిల్‌లో 8.4 శాతం పెరిగి 36,417.7 కోట్లకు చేరింది. ప్రముఖ బీమా సంస్థల్లో న్యూ ఇండియా అస్యూరెన్స్ జూలైలో ప్రీమియం 4.5 శాతం పెరిగి రూ.4,322.66 కోట్లకు చేరుకుంది.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | మంగళవారం 11 ఆగస్టు 2026 | I


# అట్టహాసంగా అంతర్రాష్ట్ర స్కేటింగ్ పోటీలు

## ఏపీ, తెలంగాణ నుంచి విద్యార్థుల హాజరు



**రావులపాలెం, ఆగస్ట్ 10 (ప్రభాతవార్త) :** విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రావులపాలెం సెయింట్ ఫ్యాట్రిక్స్ అకాడమీలో అంతర్రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. అకాడమీ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ బినోయ్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలను అయినవిల్లి మండలం ఎస్సై వై.జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ నుంచి పలువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రదర్ బినోయ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకూ విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన నిర్వాహకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సై వై.జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తులో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడా అవకాశాలు కల్పిస్తున్న సెయింట్ ఫ్యాట్రిక్స్ అకాడమీ యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల ఆవరణలో, రహదారిపై ఏర్పాటు చేసిన ట్రాక్‌లపై విద్యార్థులు ప్రదర్శించిన స్కేటింగ్ విన్యాసాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమీ కమ్యూనిటీ లీడర్ బోస్కో, స్పోర్ట్స్ సెక్రటరీ రెవరెండ్ బ్రదర్ శశిరాజు, పీఈటీలు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ప్రియాంక సంతాప సభ

## నివాళులర్పించిన యాజమాన్యం విద్యార్థులు
## ప్రియాంక కుటుంబానికి 20 లక్షలు సాయం



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10 (ప్రభాతవార్త)** జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో సోమవారం డాక్టర్ ప్రియాంక సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కళాశాల యాజమాన్యం విద్యార్థులు నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ మాట్లాడుతూ ఆమె సౌజన్యం జ్ఞాపకాలు మనమధ్య చాలా కాలం ఉండిపోతాయి అని అన్నారు. ప్రియాంక లేరన్న విషయం చాలా బాధాకరమన్నారు. ఆమెకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి ప్రకటించడం వల్ల ఒక నమ్మకం వచ్చిందని ప్రియాంక తండ్రి ఆమె కుటుంబం చేసిన పోరాటానికి మొదటి నుంచి సంఘీభావంతో ఉన్నామన్నారు. ఇన్ని విధాలుగా సహకరించిన ప్రియాంక లోటు తీరేది కాదన్నారు. ఈ కష్టకాలంలో ప్రియాంక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షలు పరిహారాన్ని ప్రకటించిందని జీఎస్ఎల్ నుంచి కూడా 20 లక్షల రూపాయలు సాయం ఇవ్వాలని మేనేజ్మెంట్ నిర్ణయించిందని తెలిపారు. ప్రియాంక గుర్తు చేసుకుంటూ ఆమె మృతికి జీఎస్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సాధిక ,డెర్మటాలజీ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ సీతారం, ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటరమణ , రెసిడెంట్ తేజస్విని ,డాక్టర్ సుభాషిని, ప్రొఫెసర్ శ్రీనివాసరావు, రేడియాలజీ స్టూడెంట్ ఉమేష్ విద్యార్థుల నివాళు లర్పించారు. సీటు బెల్టు లేకుండా కారు హెల్మెట్ లేకుండా బైక్ నడపరాదన్న విధానానికి జీఎస్-ఎల్ సంస్థ మొదటి నుంచి కట్టుబడి ఉందని క్యాంపస్ లో స్టూడెంట్స్ టూ వీలర్స్ రాకపోకలని క్రమంగా నిరోధించగలమని ఇందుకు ప్రత్యామ్నాయంగా రాజమండ్రి నుంచి క్యాంపస్కు నాలుగు బస్సులను నడుపుతామని డాక్టర్ సందీప్ పేర్కొన్నారు. డాక్టర్ ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించడానికి జీఎస్ఎల్ డెర్మటాలజి విభాగం డాక్టర్లు స్టూడెంట్స్ వెళ్లి 20 లక్షలు చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేస్తారని తెలిపారు.

# వాడపల్లి వెంకన్న కు నిత్యకళ్యాణం... పాల్గొన్న అశేష భక్త జనం...

## నిత్యాన్న పథకానికి రూ.1,20,000/-విరాళం...





**ఆత్రేయపురం, ఆగస్టు 10,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్యకళ్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది.వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. దొడ్డిపట్ల చెందిన చెరుకువాడ సంతోష్ కుమార్ రాజా, కీర్తి దంపతులు, చిరంజీవి అరుష్ , అకుల్, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 120000/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు


## ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలి





**రంపచోడవరం, ఆగస్టు 10: ప్రభాతవార్త.** ఆదివాసీలు తమ హక్కుల పరిరక్షణతో పాటు అభివృద్ధి సాధించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని ఎస్టీ కమిషన్ చైర్మన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ గిరిజన తెగల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ ప్రతి ఆదివాసీ బిడ్డకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. [illegible] డీఎఫ్‌వోలు శివకుమార్ గంగల్, గనికిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, తహసీల్దార్లు, గిరిజన సంఘాల నాయకులు, వివిధ గిరిజన తెగల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఇది సబ్‌హెడ్డింగ్‌లు లేకుండా పూర్తిగా ఒకే మేటర్‌గా, పత్రికలో నేరుగా ప్రచురించడానికి అనువుగా ఉంటుంది.

# అన్నదాన భవన నిర్మాణాన్ని పరిశీలించిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ



**అన్నవరం, ఆగస్టు 11, (ప్రభాతవార్త)** అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి రత్నగిరిపై కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ప్రసాద్' స్కీమ్ నిధుల భాగస్వామ్యంతో జరుగుతున్న నిర్మాణాల్ని ప్రభుత్వ టెక్నికల్ అడ్వైజరీకమిటీ పరిశీలించింది. కొండపై నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణ పనులను ఉన్నతాధికారుల బృందం పర్యవేక్షించింది.? ఆలయ ఈవో నల్లం సూర్య చక్రధరరావు, దేవస్థానం ఈఈ రామకృష్ణ, ఇతర అధికారులు ప్రభుత్వ టెక్నికల్ అడ్వైజరీ బృందం సభ్యులు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సుబ్బారావు, ఈఈ విజయ భాస్కరరెడ్డి, ఏపీ టూరిజం ఏఈ వెంకటేష్ భవన నిర్మాణ పురోగతిని పర్యవేక్షించారు. నిర్మాణాన్ని ఎలాంటి రాజీ లేకుండా అత్యున్నత నాణ్యతా ప్రమాణాల్ని పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ?భక్తుల సౌకర్యార్థం రత్నగిరికి వచ్చే వేలాది మంది భక్తులకు ఏకకాలంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్న ప్రసాద వితరణ జరిగేలా అన్ని మౌలిక వసతులతో పటిష్టమైన నిర్మాణాన్ని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేసి ఇవ్వాలని బృందం సభ్యులు సూచించారు. నిర్మాణానికి సంబంధించి సాంకేతికపరమైన సూచనలిచ్చిన సభ్యులు పనులు పూర్తయ్యేలోపు ఎలాంటి సహాయం కావాలన్నా తమని సంప్రదిస్తే అవసరమైన సూచనలు ఇస్తామని అడ్వైజరి బృందం సభ్యులు చెప్పారు.

# జీ హుజూర్

## కలిసి కదిలిన నేతలు... కదంతొక్కిన క్యాడర్

### డీఎస్సీ అవకతవకలపై నిరసన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు10,ప్రభాతవార్త** వారంతా వైసిపి క్యాడరే. అయినా మార్గాలు వేరు. అభిప్రాయ బేధాలతో పార్టీకి కలిగే చేటు గమనించిన అధిష్టానదిద్దుబాటు చర్యలతో పార్టీలో ఏ పదవులు లేకున్నా బలమైన వర్గాన్ని కూడగట్టిన రమణారావుని కలుపుకు వెళ్లాల్సిన పరిస్థితి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో వైఎస్ఆర్సిపి లో మాజీ మంత్రి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ పినిపే విశ్వరూప్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ, పార్టీ సీనియర్ నాయకుడు కుంచే వెంకట రమణారావు వర్గాలుగా ఉన్నారు. వైఎస్ఆర్సిపి తలపెట్టిన డీఎస్సీ లో అక్రమాలపై సిబిఐ విచారణ, విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామాలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన ఆందోళనలో పినిపే, చింతా,కుంచే కలిసి ఆందోళన లో భాగస్వామ్యం వహించారు. నేతలంతా కలవడంతో క్యాడర్లో ఉత్సాహం వెల్లి విరిసింది. నియోజవర్గం నుంచి మంత్రిగా విశ్వరూప్, పార్లమెంటు సభ్యులుగా అనురాధ ప్రాతినిధ్యం వహించారు. అయితే రమణారావుకు ఇంతవరకు పార్టీలో పదవులు లేకున్నా క్రియాశీలక నేతగా బలమైన వర్గాన్ని కూడగట్టారు. రమణారావు తన సొంత సంస్థ ద్వారా నిత్యం సేవా కార్యక్రమాలతో మమేక మవుతున్నారు. స్థానిక సంస్థల్లో రానున్న ఎన్నికల్లో పట్టు బిగించేందుకు ఇప్పటినుండి వైసీపీ అధిష్టానం పావులు కదుపుతోంది. దీంతో ఈ ముగ్గురు నేతలు పార్టీ కార్యక్రమాలలో చేయి చేయి కలిపారు.పార్టీలో కుంచెకు కూడా బాధ్యతలు ఉండాలని కుంచె వర్గం మరోపక్క పట్టుబడుతుంది.

**డీఎస్సీ అవకతవకలపై భారీ నిరసన**

డీఎస్సీ నియామకాలలో జరిగిన అవకతవకలపై తక్షణమే సీబీఐ తో సమగ్ర విచారణ జరిపించాలని, ఈ అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ భారీ నిరసన చేపట్టడం జరిగింది. మాజీ మంత్రి, పి.ఏ.సి.సభ్యులు, అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ పినిపే విశ్వరూప్ అధ్యక్షతన అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ నేతృత్వం లో నిర్వహించారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే పునరుద్ధరించాలని, నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎంఎల్సీ బొమ్మి ఇజ్రాయెల్,మాజీ ఎంపీ చింతా అనురాధ,సీనియర్ నేత కుంచే రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ సభ్యులు



**వి.ఆర్.పురం,ఆగస్టు10,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ సోమవారం మండల కేంద్రం రేఖపల్లి లోని కస్తూరి బా గాంధీ గురుకుల పాఠశాల, గుర్రంపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. గుర్రంపేట పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. బాలలకు ప్రతి సంవత్సరం పంపిణీ చేసే ఎస్.ఆర్.కె.వి.ఎం కిట్ల నాణ్యత, పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుండి రేఖపల్లి కస్తూర్బా విద్యాలయానికి వెళ్ళారు. అక్కడ విద్యార్థినిల చదువులు, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. వంటశాల, దాని పరిసరాలను చూశారు. వంట గది, స్టోర్ రూం పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ఆర్.ఒ వాటర్ ప్లాంట్ పనిచేయటం లేదని, తాగునీటికి ఇబ్బంది అవుతుందని ఆయన దృష్టికి తీసుకొని వెళ్ళారు. దీనిపై స్పందించిన ఆయన సమగ్ర శిక్ష వారితో మాట్లాడి నీటి పథకానికి మరమత్తులు చేయిస్తామన్నారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మధుసూదన్ వెంట ఐసిడిఎస్ సిడిపిఒ మల్లిక, ఎంఇఒ 2 సి. హెచ్.బాబురావు, కె.జి.బి.వి ఎస్.ఒ వెంకమ్మ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనుల పై క్షేత్రస్థాయి పరిశీలన

## పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివరామ ప్రసాద్



**పిఠాపురం, ఆగస్టు 10( ప్రభాతవార్త )** పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ( పాడా ) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి. శివరాం ప్రసాద్ సోమవారం జల్లూరు, ఎఫ్ కె పాలెం, గ్రామాల్లో పర్యటించి డబ్ల్యు డి సి - పిఎంకెఎస్వై 2.0 కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటర్షెడ్ అభివృద్ధి పనుల పురోగతి పై చర్చించారు. చెరువుల అభివృద్ధి,నీటి సంరక్షణ,భూ సంరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అనుబంధ, అభివృద్ధి పనుల అమలు తీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటర్ షెడ్ ప్రాంతాలలో పర్యటించి నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపు,భూమి ఉత్పాదకతను మెరుగుపరచడమే లక్ష్యంగా పనులను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని పిడి సూచించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల రైతులు ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను నిర్ణయించిన లక్ష్యాల మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనులలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి చేసిన చెరువులు వాటి పరిసర ప్రాంతాలను పచ్చదనం,ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని పి.డి.శివరామ ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రినీ మర్యాద పూర్వకంగా కలసిన ఎటపాక టీడీపీ పార్టీ నాయకులు---




**ఎటపాక: ఆగస్టు 10 ( ప్రభాత వార్త):** ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ని మర్యాద పూర్వకముగా కలిసిన ఎటపాక మండలం టీడీపీ పార్టీ నాయకులు తోటకూరి శ్రీనివాసరావు, తోటకూరి సంజులు. ఈ సందర్బంగా ఎటపాక మండలంలో ఉన్న రెవెన్యూ పెండింగ్ సమస్యలను గురించి వివరించండి జరిగింది.అలానే చింతూరు డివిజన్ లో ఆర్టీసీ బస్ లు తక్కువ గా తిరుగుతుండడం వలన ప్రయాణికులు ఇబ్బంది పడుచున్నారని, ప్రస్తుతం మూడు బస్సులు ఉండగా మరో ఐదు బస్సులు కేటాయించాలని, అలానే శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం భూములు తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు ఆక్రమించుకోటానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వ్యక్తుల నుండి దేవాలయ భూములను కాపాడాలనీ కోరారు.అలానే చింతూరు డివిజన్ లో ఉన్న ఎస్సి, బీ సీ మైనారిటీ వారికీ ఇల్లులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలనీ కోరారు. 11 కే వి విద్యుత్ లైన్ కి సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. ఎటపాక మండలంలో ముంపు గ్రామాలను పోలవరం 41 కాంటూర్ లో కలిపి వరద నుండి ప్రజలను కాడాలని కోరారు. ముఖ్యమంత్రికి చింతూరు డివిజన్ లో పలు సమస్యలపై వినతి పత్రం అందజేయడం జరిగింది.అనంతరం ముఖ్యమంత్రి వర్యులు ఈ సమస్యలు ఫై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారంచేస్తానని హామీ ఇచ్చారు.

# లీ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం

## ఎముకల,కీళ్ల పటిష్టతకు అందరూ వ్యక్తిగతంగా దృష్టి పెట్టాలి... లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి.




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు10, ప్రభాతవార్త.** ఎముకలు, కీళ్లు ఆరోగ్యవంతం గా ఉండాలంటే ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా శ్రద్ద తీసుకోవాలని,రోజు పోషకాల తో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సాధ్యమౌతుందని లీ పౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి పేర్కొన్నారు. ?కాకినాడలో లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు వేశారు. లీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ కాకినాడ, జెసిఐ కాకినాడ పోర్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీనగర్‌లోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాల్‌లో ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో మొత్తం 150 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఎముకల ఖనిజ సాంద్రత , శరీర ఆకృతి విశ్లేషణ , శరీర కొలతలు, నడుము మరియు నిరుల నిష్పత్తి , చేతి పట్టు సామర్థ్యం హిమోగ్లోబిన్ (హెచ్.బి), రక్తంలో చక్కెర పరిమాణం , రక్తపోటు మరియు శరీర ఉష్ణోగ్రత వంటి సమగ్ర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.?పరీక్షల అనంతరం అనుభవజ్ఞులైన వైద్యులు మరియు పోషకాహార నిపుణులు నివేదికలను పరిశీలించి, వారి ఆరోగ్య మెరుగుదలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అలాగే బాధితులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లీ పౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ మనిషి శరీరంలో అతి ముఖ్యమైన భాగాలుగా ఎముకలు,కీళ్లు చెప్పవచ్చని వాటిని నిత్యం అరోగ్యకరం ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో లీ హెల్త్ మేనేజర్ సురేష్,క్యాంప్ కో ఆర్డినేటర్లు జయలక్ష్మి మరియు సరోజిని, వైద్యులు డాక్టర్ రావు బాబు, న్యూట్రిషనిస్టులు మాధురి, క్రాంతి, జి.ఎన్.ఎమ్ భాగ్యలత, యోగా మాస్టర్ అఖిల్ సూర్యతేజ మరియు లీ టీమ్ సభ్యులు ,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి కృష్ణమూర్తి, కార్యదర్శి వి. నూక రాజు, కోశాధికారి పి. రాజు, జెసిఐ అధ్యక్షుడు పి. అనిరుద్, కోశాధికారి వీరేష్, ప్రాజెక్ట్ చైర్మన్ జీఎల్ జగన్నాథ రావు, కో ప్రాజెక్ట్ చైర్మన్ కొమ్మిశెట్టి కుమార్, రీజియన్ చైర్మన్ డి. రామసుబ్రమణ్యం, కార్యదర్శి ఎంవిఆర్ మోహన్ కుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి. సత్యనారాయణ, సెక్రటరీ కే. సురేశ్, కోశాధికారి ఎం. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



# మాదిగలకు ఎమ్మెల్సీ హామీ చంద్రబాబు నెరవేర్చాలి


## లేదంటే 2029 ఎన్నికల్లో మాదిగల సత్తా చూపిస్తాం



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 10, (ప్రభాతవార్త)** గత ఎన్నికల సందర్భంగా కోనసీమ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మాదిగ లకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముమ్మిడి వరపు చిన్న సుబ్బారావు విజ్ఞప్తి చేశారు స్థానిక ప్రెస్ క్లబ్లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గత ఎన్నికల్లో కూటమి పార్టీలకు మాదిగలు సంపూర్తిగా మద్దతు తెలిపారని దాంతో అధికారం లోకి వచ్చిందని అన్నారు .మాలల బెదిరింపులకు చంద్రబాబు నాయుడు లొంగిపో తున్నారని, మాదిగలకు రాజ్యాధికారం ఇస్తే వారి మాలల ఓట్లు రావనే భయపడుతున్నారని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే తాము కూడా అదే పని చేస్తామని అన్నారు. 2014లోనూ 2024 లోనూ చంద్రబాబు నాయుడు మాదిగలను మోసం చేశారని గుర్తు చేశారు. ఈసారి ఈసారి ఎమ్మెల్సీ పదవి కచ్చితంగా మాదిగలకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. లేని యెడల 2029 ఎన్నికల్లో మాదిగల సత్తా చూపిస్తారని కూటమి పార్టీలను ఓడించడమే లక్ష్యంగా గ్రామ గ్రామాన చైతన్య వంతులు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోలేటి రాంప్రసాద్ రాచర్ల సుధాకర్ ఆళ్లగడ్డ సతీష కూరాకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# తుని లో తనిఖీలు నిర్వహించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి

- అంగన్వాడి కేంద్రాల నిర్వహణా తీరుపై ఆగ్రహం
- ఇద్దరు అంగన్వాడి కార్యకర్తలపై చర్యలు
- హాస్టల్స్ తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న ప్రతాప్ రెడ్డి



**తుని, ఆగస్టు 10,( ప్రభాతవార్త )** రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి తుని మండలంలో సోమవారం అంగన్వాడి కేంద్రాలలోను , ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలోను తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తుని పట్టణంలోని స్థానిక గవరపేట లో గల కోడ్ నెంబర్ 78, కోడ్ నెంబర్ 38 అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డులు నిర్వహణలో అలసత్వం వహించడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ అంగన్వాడీ కార్యకర్తలను విధుల నుండి తొలగించాలని సిడిపిఓ ని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికలపాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో చక్కని ఫలితాలు సాధించాలని విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయుల పనితీరును అభినందించారు. అనంతరం స్థానిక జ్యోతి నగర్ లో గల సంక్షేమ హాస్టళ్ళ ను, వి. కొత్తూరు వద్దగల హాస్టళ్ళ ను తనిఖీ చేసి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్ లో విద్యార్థులకు ఆహారం అందుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్య ద్వారా ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్ని రకాల వసతులను సమకూరుస్తుందన్నారు. అటువంటి విద్యార్థుల కోసం ఒక వ్యవస్థ నడపబడుతుందన్నారు. పేద విద్యార్థులకు అందించే ఆహారంలో స్వార్థ ప్రయోజనాలు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధవళేశ్వరంలో నూతన రైతుబజారు ప్రారంభానికి సన్నాహాలు



**ధవళేశ్వరం,ఆగస్ట్ 10(ప్రభాతవార్త)** ధవళేశ్వరం గ్రామ ప్రజల ఏళ్లనాటి కల నెరవేరబోతోంది. రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి చొరవతో గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుబజారు ప్రారంభానికి సిద్ధమైంది. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆధునిక వసతులతో రైతుబజారును నిర్మించారు. రైతులు పండించిన కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు ఈ రైతుబజారు ఉపయోగపడనుంది. దీంతో మధ్యవర్తుల ప్రమేయం తగ్గి రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రజలకు తక్కువ ధరలకు తాజా కూరగాయలు అందుబాటులోకి రానున్నాయి. రైతుబజారు నిర్మాణ పనులు పూర్తికావడంతో త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ప్రజలు, రైతులు రైతుబజారు ప్రారంభం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే విద్య కు అధిక ప్రాధాన్యత ఎమ్మెల్యే సత్య ప్రభ

## ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థి మిత్ర కిట్ల పంపిణ



**శంఖవరం ఆగస్టు 10 ప్రభాతవార్త** రాష్ట్రంలో విద్య అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ పేర్కొన్నారు. శంకవరం మండలం నెల్లిపూడి శివారు అగ్రహారం స్కూల్లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పథకంలో భాగంగా పాఠశాలలో కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద విద్యార్థుల చదువులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థి మిత్ర కిట్ల ద్వారా తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. కిట్‌లోని సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని, రూ.2,279 విలువగల కిట్ ను 35.94 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు . కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ పంపిణీ పథకం ద్వారా పుస్తకాలు, బ్యాగ్, యూనిఫామ్, షఉస్, బెల్ట్ నాణ్యత తో అందించడం జరుగుతుంది అన్నారు.. గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరిట ఇంట్లో ఒక్కరికి మాత్రమే 13 వేలు ఇస్తే, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.. మధ్యాహ్న భోజనము లో సన్న బియ్యం వినియోగించడం జరుగుతుంది అన్నారు. అనంతరం సొసైటీ చైర్మన్ బద్ది రామారావు రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ రాష్ట్ర టిడిపి పార్టీ కార్యదర్శి పర్వత సురేష్ ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువత అధ్యక్షులు కీర్తి సుభాష్ బద్ది రమణ బద్ది రామకృష్ణ సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు తలపంటి బుజ్జి ఆత్మ వైస్ చైర్మన్ కరణం సుబ్రమణ్యం మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమణ ఎన్డీఏ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కూనవరంలో 52వ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కూనవరం, ఆగస్టు 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కూనవరంలో 52వ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్ ) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ జండా ఆవిష్కరణను నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు ప్రసంగించారు. యుటిఎఫ్ 52 సంవత్సరాల ప్రస్థానం కేవలం ఒక ఉపాధ్యాయ సంఘ చరిత్ర మాత్రమే కాదని, ఉపాధ్యాయుల ఆత్మ గౌరవం, హక్కులు, విద్యార్థుల భవిష్యత్, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం సాగిన నిరంతర పోరాట చరిత్ర అని అన్నారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన సీనియర్ ఉపాధ్యాయ నాయకులు, కార్యకర్తల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ కార్యకర్త బాధ్యత అని అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యను కాపాడుకోవటం కోసం, విద్యార్థులకు సమానమైన విద్య అవకాశాలను కల్పించడం కోసం యుటిఎఫ్ తన పోరాటాన్ని సాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు పి. రాజారావు, ఆనంద్, రాంబాబు, ధనలక్ష్మి, సత్యవతి, లక్ష్మి, కుమారి, బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## "కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా" జైల్ భరో "



పిఠాపురం, ఆగస్టు 10(ప్రభాతవార్త) సి ఐ టి యు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. నిరసన వ్యక్తం చేస్తున్న రైతులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషు బాబ్జి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పిరెడ్డి,సిపిఎం మండల కన్వీనర్ చిన్న,మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకమైన చట్టాలను నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం తగదని కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26,000 ఇవ్వాలని, ఈ విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని నాయకులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు నాగేశ్వరరావు,కెవివి సత్యనారాయణ,నారాయణరెడ్డి,పిఠాపురం రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు కోటేటి రాజు,నాగేశ్వరరావు, విశ్వనాథం, జి వీరబాబు,గొల్లప్రోలు మండల సిఐటియు నాయకులు సందీప్,కాల్దారి రాఘవ,వి సూర్యనారాయణ, అప్పన్న,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీ పరీక్షల్లో దృష్టి సారించాలి : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, ఆగస్టు 10, (ప్రభాతవార్త) విద్యార్థులు చదువుకుంటూనే మరో వైపు పోటీ పరీక్షల పై దృష్టి సారించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు విద్యార్థులకు సూచించారు. రాజమహేంద్రవరం ఎడ్యుకేషన్ స్పెషల్ విద్యారంగం పత్రిక గత ఏప్రిల్ లో రాష్ట్రస్థాయిలో గోదావరి తెలుగు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొత్తపేట విద్యావాణి మందిరం విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఆరో తరగతికి చెందిన కమ్మనత్తి శాంతి, తొమ్మిదో తరగతికి చెందిన పిల్ల మన్నెమ్మ మొదటి ర్యాంకు, ఏనిమిదో తరగతికి చెందిన కమ్మనత్తి శిరీష మొదటి ర్యాంకు సాధించి ప్రశంసా పత్రం గోల్డ్ మెడల్ మేమెంటో నాలుగు వందల రూపాయల చెక్ సాధించారు. వీరిని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులను రాష్ట్ర ర్యాంకులు సాధించినందుకు అభినందించారు. చదువు తో పాటు పోటీ పరీక్షల్లో దృష్టి పెట్టడం ఈ పోటీ ప్రపంచంలో అత్యంత ముఖ్యమైనది అని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ రాయోజు అనురాధ ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్న కందేటి సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా యుటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



ఐ.ఆర్.పురం, ఆగస్టు10, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)52 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఐ.ఆర్.పురం మండలంలో ఆ సంఘం ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలోని దిమ్మె వద్ద ఆ సంఘం సీనియర్ నాయకులు పూసం.రామారావు యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.జగదీష్ మాట్లాడారు. యుటిఎఫ్ 1974 ఆగస్టు 10 వ తేదీన అమలాపురంలో స్థాపించబడిందని చెప్పారు. యుటిఎఫ్ వ్యవస్థాపకులు అమలకిరాజీవి అప్పారి.వెంకటస్వామి, దాచూరి.రామిరెడ్డి, సత్యనారాయణ,సూర్యనారాయణరాజుల త్యాగాలను మరువలేమన్నారు. యుటిఎఫ్ ప్రభుత్వ విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కోశాధికారి ఎస్.బాబు, ఎస్.జయరామకృష్ణ, ఎస్.చందర్రావు, ఎస్.ప్రసాద్, ఎ.రాము, టి.అర్జున్, కె.శ్రీమహాన్, వెంకటేశ్, బాలు, రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో.



తాళ్లరేవు, ఆగస్టు 10 (ప్రభాతవార్త):కార్మికుల రైతాంగం సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మిక, కౌలు రైతులు, కార్మిక సంఘాల దేశవ్యాప్త జైల్ బరో పిలుపు మేరకు తాళ్లరేవులో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి స్థానిక పోస్ట్ ఆఫీస్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు కమిడి సత్య శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, వల్ల రాజబాబు మాట్లాడారు. దేశంలో బీజేపీ మోదీ పాలనలో కార్మికులు, కర్షకులు, కార్మికుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మిక చట్టాలు రద్దుచేసి తెచ్చిన నూతన లేబర్ కోడ్ వల్ల కార్మికులు తీవ్ర అభద్రతాభావం లోకి నెట్టేశారని అన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన రైతుకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. పని ఖర్చులపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించాలన్నారు. ఇక కౌలు రైతులకు పంట రుణాలు అందడంలేదని తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నారన్నారు. కౌలు రైతులు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.700 వేతనం 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. యూస్ ల పేరుతో స్మార్ట్ మీటర్ల వ్యవస్థ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు.

## ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో అంతర్గత రెవెన్యూ పోలీస్ విభాగం ఏర్పాటు చేయాలి


### పోలీస్ స్టేషన్లకు న్యాయవాదులను నియమించాలి



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 10 (ప్రభాత వార్త) పోలీస్, రెవెన్యూ శాఖలపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తగ్గించి విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులకు సంబంధం లేని సెక్షన్లు నమోదు చేయడం, నేర పరిశోధనలో లోపాలు, అధికార దుర్వినియోగం వల్ల బాధితులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. క్రిమినల్ కేసుల్లో కనీసం పదేళ్ల అనుభవం ఉన్న న్యాయవాదిని ప్రతి పోలీస్ స్టేషన్కు ప్రత్యేక అధికారులతో నియమిస్తే అక్రమ కేసులు, తప్పుడు సెక్షన్లు తగ్గి న్యాయస్థానాల్లో కేసులు బలంగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ శాఖలో భూ రికార్డుల మార్పులు, అధికార దుర్వినియోగం, అవినీతి అడ్డుకట్ట వేయాలంటే ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో అంతర్గత రెవెన్యూ పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో మానవ హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేసి, వాటికి బాధితులకు న్యాయం చేసేలా మరిన్ని అధికారాలు కల్పించాలని కోరారు. పౌర హక్కులు, పౌర సేవలు చట్టబద్ధంగా అమలైతేనే శాంతిభద్రతలు మెరుగుపడతాయన్నారు. ప్రజలు నూతన రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, అది త్వరలోనే సాధ్యమని మేడా శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ సెక్యులర్ సిమ్హా దుర్గారావు అధ్యక్షత వహించగా పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గోదావరి పై ఉడిమూడి వంతెనను

## పిఆర్ ఛీఫ్ ఇంజనీర్ బాబు నాయక్ పరిశీలన




ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు10,ప్రభాతవార్త ఎంతో ప్రతిష్టాత్మకంగా గోదావరి వశిష్ఠ నది పై లంక గ్రామాలకు ఉపయోగ పడే విధంగా సుమారు 71.43 కోట్ల తో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఈఎన్సీ బి బాలునాయక్ క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. వచ్చే మార్చ్ కు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.ఎంపిపి గిడ్డి సత్య నారాయణ,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పిఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ 49.50 నుండి 21 కోట్లు పెంచి 71.43 కోట్లతో బ్రిడ్జి బాక్స్ కల్వర్టు నిర్మించడానికి రివైజ్ శాంక్షన్ ఇచ్చి బ్రిడ్జి నిర్మాణం ఆగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపించడం జరిగిందని అన్నారు.డిప్యూటీ ఇఇ, ఎస్ఇ, ఇఇ, డిఇ లు పర్యవేక్షణ చేస్తున్నారు. నిర్మాణ పనుల వివరాలను కాంట్రాక్టర్ పిపి రాజు ,ఇంజనీరింగ్ సిబ్బంది ఎస్ ఇ వివరించారు. వంతెన పనులు 36000 క్యూబిక్ మీటర్ల మట్టి కలెక్టర్ తో సంప్రదించి ఫ్లడ్ దినిపోయిన తర్వాత అని చెప్పట్టడానికి తగు చర్యలు తీసుకొంటామన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు లంక కొత్త నివాసాలు (గోయెస్) నిర్మించాలని ఎంపిపి దృష్టికి తీసుకొని వచ్చారు..

## ఆదుర్రు ప్రధాన రహదారిని అభివృద్ధి చేయండి



మామిడికుదురు.ఆగస్టు 10(ప్రభాతవార్త) ఆదుర్రు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ ఆగ్రామ మాజీ సర్పంచ్ బళ్ల శ్రీనివాస్, నగరం ఏఎంసీ డైరెక్టర్ పినిశెట్టి శేఖర్, పెదసింగు స్వామి సోమవారం మామిడికుదురులోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ జి.భవానీకి వినతిపత్రం అందించారు.ఉపాధ్యాయుల జగన్నాథశాస్త్రి ఇంటి వద్ద నుంచి మోరిపోలం వరకు ఉన్న రోడ్డు అభివృద్ధి చేయాలన్నారు.సుమారు 17 సంవత్సరాల క్రితం వేసిన ఈ రోడ్డు నాటి నుంచి నేటి వరకు అభివృద్ధికి నోచుకోలేదన్నారు.రోడ్డు పై పెద్ద పెద్ద గోతులు పడడంతో రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వెంటనే ఆరోడ్డుకు మరమ్మత్తులు చేసి దీనిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని వారు కోరారు.

## ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం....లైవ్ రిసీవర్ మిస్సింగ్..



ఆత్రేయపురం, ఆగస్టు 19,(ప్రభాత వార్త) ప్రజా వేదిక నిర్వహించే కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైవ్ ప్రసార వ్యవస్థకు సంబంధించిన రిసీవర్ మిస్సైనట్లు సమాచారం వెలుగులోకి రావడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుంది.ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా వేదిక సమావేశాల ప్రత్యక్ష ప్రసారాల కోసం ఉపయోగించే ఈ పరికరం ఎప్పుడు, ఎలా మిస్సయిందనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం గమనార్హం. దీనిపై విచారణ చేపట్టాల్సిన అధికారులు కూడా ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత మే నెలలో శని, ఆదివారాల్లో మండల పరిషత్ కార్యాలయాన్ని సినిమా షుటింగ్ కోసం వినియోగించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఆ సమయంలోనే రిసీవర్ మిస్సై అయ్యి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మూడు నెలల అవుతున్న ఏమి తెలియనట్లు అధికారులు వ్యవహరించటం గమనార్హం. ప్రభుత్వ ఆస్తికి చెందిన పరికరం మిస్సైన నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కార్యాలయ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కూటమి రెండేళ్ల పాలనలో రాష్ట్ర , గ్రామాల అభివృద్ధి ...

### వద్దిపర్రుగ్రామంలో రూ.65 లక్షల నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే, బండారు...



ఆత్రేయపురం, ఆగస్టు 10,(ప్రభాత వార్త) రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. సోమవారం మండల పరిధిలో వద్దిపర్రు గ్రామంలో రెండేళ్ల కూటమి ప్రభుత్వం నమ్మకం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదటగా గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.65 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. వద్దుపర్రు గ్రామంలో ప్రభుత్వ భూమి 589 ఎకరాలు ఉంటే, దేవస్థానం భూమి 20 ఎకరాలు ఉందని, గ్రామ కంఠం 17 ఎకరాలు ఉందని తెలిపారు. లేఅవుట్లో కూడా 324 స్థలాలు ఉన్నాయని తెలియజేశారు. రైతులకు అన్ని విధాలా మేలు చేయడమే తమ లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్. డి. రామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ వినాయకుడు, ఆర్డబ్ల్యూఎస్ ఎ ఈ. శ్రీధర్, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, సీనియర్ టీడీపీ నాయకులు ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు, తోట రజిని, మద్దింశెట్టి వీర వెంకట సత్యనారాయణ, నరాలశెట్టి వెంకన్న, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, తోటకూర సుబ్బరాజు, దొడ్డిపనేని త్రినాథ్, తిరుపతి రాజు, పాలింగి రవిచంద్ర, కుటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజయలక్ష్మి చారిటీస్ పేదలకు సహాయం....



సఖినేటిపల్లి ఆగస్టు 10, ప్రభాత వార్త: అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెంలో శ్రీ విజయలక్ష్మి చారిటీస్ చైర్మన్ లింగోలు మహాలక్ష్మి ఎల్ ఐ సి రిటైర్డ్ ద్వారా పేద వితంతువులకు, వృద్ధులకు, పింఛన్లకు ముఖ్యఅతిథిగా ఉండి గ్రామానికి చెందిన నల్లా విజయలక్ష్మి ట్రస్ట్ అధినేత నల్లా సత్య కృష్ణ కిరణ్ ప్రసాద్ పాల్గొని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవడం కొరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయలక్ష్మి చారిటీస్ చేస్తున్న గొప్ప సేవకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ట్రస్ట్ మరింత విస్తరించి అనేక నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఇప్పటికే ఉత్తీర్ణత చెందిన విద్యార్థిని, విద్యార్థులకు ఆర్థిక సహాయం, నిరుపేదలకు చీరలు పంపిణీ కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెద్దం పేర్రాజు, బిజెపి నాయకులు మాలే శ్రీనివాస నగేష్, కటికరెడ్డి లక్ష్మణరావు, రావూరి పెద్దబ్బులు, ఆదిమూలం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ద్రాక్షారామం బస్టాండ్‌లో వికృత చేష్టలు..

### తరగతులు ఎగ్గొట్టి జంటలుగా అసభ్య ప్రవర్తన

### బస్టాండ్‌పై పోలీసుల ప్రత్యేక నిఘా తప్పనిసరి



రామచంద్రపురం, ఆగస్టు 09 (ప్రభాతవార్త): పవిత్ర పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామలోని ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ఆవరణ అకృత్యాలకు నిలయంగా మారుతోంది.కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థినీ విద్యార్థులు తరగతులు ఎగ్గొట్టి, బస్టాండ్ మూలల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటాన్ని ప్రశ్నించిన కాంప్లెక్స్ సిబ్బందిపై విద్యార్థులు దౌర్జన్యానికి దిగిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.బుద్ధి చెప్పబోతే రివర్స్ అయ్యారు రోజూ మాదిరిగానే కాంప్లెక్స్ ఆవరణలో పలువురు ఇంటర్,ఐటిఐ విద్యార్థులు గుంపులు గుంపులుగా చేరి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారు.బస్టాండ్ నిర్మానుష్య ప్రాంతాల్లో జంటలుగా చేరి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ పలువురు వృద్ధులు,మహిళా ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో కాంప్లెక్స్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు.ఇది పబ్లిక్ ప్లేస్,ఇలా ప్రవర్తించడం సరికాదు వెంటనే కాలేజీలకు వెళ్లండి అని పద్ధతిగా మందలించారు.అయితే, తమ తప్పును తెలుసుకోవాల్సిన విద్యార్థులు మా ఇష్టం,మమ్మల్ని అడగడానికి మీరెవరు? అంటూ సదరు సిబ్బందిపైకి తీవ్ర ఆగ్రహంతో విరుచుకుపడ్డారు.చేతిలో కర్ర పట్టుకుని హెచ్చరించిన సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగి, భౌతిక దాడికి సిద్ధపడటంతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది.తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో, వేలకు వేలు ఫీజులు చెల్లించి కళాశాలలకు పంపుతుంటే.. పిల్లలు మాత్రం దారి తప్పి ఇలాంటి పనులకు పాల్పడటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.బస్టాండ్లలో ఇలాంటి అల్లరి మూకల ఆగడాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని,సమయం వృథా చేస్తూ తిరిగే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రయాణికులు,స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు తహసీల్దార్ తేజస్విని హెచ్చరిక



అడ్డతీగల, ఆగస్టు 11, ప్రభాతవార్త మండలంలో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరుగుతోందని అడ్డతీగల తహసీల్దార్ తేజస్విని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. భూసేకరణ పనులను రెవెన్యూ శాఖ అధికారులు నేరుగా నిర్వహిస్తున్నారని, ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం ఎటువంటి మధ్యవర్తులను, ఏజెంట్లను లేదా ప్రైవేట్ వ్యక్తులను నియమించలేదని తెలిపారు.?పరిహారం ఇప్పిస్తామని, భూముల వివరాలు పరిశీలిస్తామని లేదా రికార్డులు ధృవీకరిస్తామని చెప్పే బ్రోకర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని భూయజమానులు, రైతులకు సూచించారు. అటువంటి అనధికార వ్యక్తులకు ఎలాంటి నగదు చెల్లించవద్దని, వ్యక్తిగత పత్రాలను అందజేయవద్దని హెచ్చరించారు. ?భూసేకరణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా అడ్డతీగల తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం తరఫున అధికారిక సమాచారం కేవలం అధికారుల ద్వారానే వెలువడుతుందని, రెవెన్యూ ప్రతినిధులమని చెప్పుకునే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## డీఎస్సీలో అక్రమాలపై సిబిఐ విచారణ చేపట్టాలి

### భరత్ ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



రాజమహేంద్రవరం సిటీ ,ఆగస్టు 10 (ప్రభాతవార్త) వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ ఆధ్వర్యంలో డీఎస్సీలో స్కాంపై సీబీఐ విచారణ చేపట్టాలని, ఫీజు రియంబర్స్మెంట్ ,నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ సోమవారం బైక్ ర్యాలీ బయలుదేరిన భరత్ ను ఆయన ఇంటి వద్దనే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో ఆయన నివాసం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ భరత్ అక్కడే ధర్నాకు దిగారు. ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కాలని చూడడం దారుణమని పోలీసులతో వైసిపి ఆందోళన అడ్డుకోలేరని భరత్ పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసిపి శాంతియుతంగా ర్యాలీ చేయడానికి సిద్ధమైతే ఈ విధముగా హౌస్ అరెస్ట్ ఎలా చేస్తారని పోలీసులను ఆయన నిలదీశారు. పోలీసులను అడ్డుపెట్టుకొని కూటమి ప్రభుత్వం నిరంకుశంగా పాలన సాగిస్తుందని విమర్శించారు. మెడికో విద్యార్థిని ప్రియాంకను కారుతో గుద్ది హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు డీఎస్సీ అక్రమాలపై న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు . ఈ విషయంలో లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీమ్ సంస్థ, సి.ఎం.సి.ఆధ్వర్యంలో450 మందికి కంటి పరీక్షలు.



తాళ్లరేవు, ఆగస్టు 10( ప్రభాతవార్త): క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు, జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పిఠాపురం సిఎంసి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక హైస్కూల్ పక్కన ఉన్న బాప్టిస్ట్ చర్చిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా 450 మందికి పలు పరీక్షలు నిర్వహించారు.60 మందికి శస్త్ర చికిత్సలు నిమిత్తమై సిఎంసి ఆసుపత్రికి తరలించారు.110 మందికి కళ్ళజోళ్ళ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉచిత జనరల్ సర్జరీ ఓ.పి., ఉచిత ఆర్థోపెడిక్ ఓ.పి. నిర్వహించారు. పిఠాపురం సిఎంసి డైరెక్టర్ డాక్టర్ అమృత లాల్,ఆ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించగా, జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ కె ఎస్.ఎస్. శరత్ చంద్ర, ఆర్థోపెడిషియన్ జి. ఆదినారాయణ రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా తాళ్ళరేవు మండలంలోని పలు ప్రాంతాల నుంచి శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాళ్ళరేవు లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కొత్తపేటలో మోషే సుఖోపవాస ప్రార్థనలు



కొత్తపేట, ఆగస్టు 10, (ప్రభాతవార్త) కొత్తపేటలో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో మోషే సుఖో ఉపవాస ప్రార్థనలు ఘనంగా ముగిసాయి స్థానిక సమితి రోడ్ లోని బేతేలు మందిరం బైబిల్ మిషన్ పాస్టర్ రె వ యదిద్య దేవదాస్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు విశ్వాసులతో ఈ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు జూలై 1వ తేదీన ప్రారంభమైన సుఖూపవాస ప్రార్థనలు ఆగస్టు 9వ తేదీతో ముగిసాయి గత 40 రోజులు పాటు కొనసాగిన ప్రత్యేక ప్రార్థనల్లో సమాజ హితవు సంక్షేమం అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ పల్లికొండ సుధా జానకి దేవి సుధీర్ ప్రేమ విందు ఏర్పాటు చేశారు

## నిరసన ర్యాలీకి వెళ్లకుండా గిరజాల బాబుని అడ్డుకున్న పోలీసులు..

### గిరజాల బాబు హౌస్ అరెస్ట్



కడియం, ఆగస్టు 10 (ప్రభాతవార్త)మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన నిరసన ర్యాలీకి వెళ్లకుండా రాజమహేంద్రవరం రూరల్ మాజీ కోఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబుతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కడియంలోని గిరజాల బాబు నివాసం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి, ఆయనను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం వంచించిందని వైసీపీ నాయకులు ఆరోపించారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు గిరజాల బాబు, పార్టీ కార్యకర్తలు సిద్ధమవుతున్న సమయంలో పోలీసులు వారి నివాసానికి చేరుకుని హౌస్ అరెస్ట్ చేయడం పట్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాలపై అనుమానాలు, ఆరోపణలకు తెరదించి నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు.

## జైల్ బరో సందర్భంగా కార్మిక, రైతు హక్కుల కోసం రాస్తారోకో



దేవరపల్లి, ఆగస్టు 10 (ప్రభాతవార్త): కార్మిక, రైతు హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దేవరపల్లి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. జాతీయ కార్మిక సంఘాలు, ఆల్ ఇండియా కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త జైల్‌భరో పిలుపులో భాగంగా తొలుత బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరిస్తున్నారని నాయకులు విమర్శించారు. కనీస వేతనం రూ.31 వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పని కల్పించాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, విదేశీ వాణిజ్య ఒప్పందాలను నిలిపివేయాలని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు భగత్, సీపీఎం నాయకుడు రత్నాజీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పిన్నమనేని సత్యనారాయణ, సీపీఐ నాయకుడు ఆచంట సత్యనారాయణ, పి.పెంటయ్య, సీహెచ్.రమేష్, నూకరాజు, ఎస్.కె.మస్తాన్, అక్కబత్తుల రాజు, కే.కార్తీక్, అక్కబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం చదువుకు ఆటంకం కాకూడదు

### 11 మంది పేద విద్యార్థులకు సూర్య పీఠం ట్రస్టు ఆర్థిక సహాయం



గోకవరం : ఆగష్టు 10 ప్రభాత వార్త పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో 11 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఒక్కో విద్యార్థికి రూ.5,000 చొప్పున చెక్కులను ఈగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పువ్వల సూర్యమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్, ట్రస్టీ తోట సాయిబాబు మాట్లాడుతూ చదువు ద్వారా చక్కటి జ్ఞానం, సంస్కారం అలవడి, తద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. అన్ని వర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలని, విద్యకు పేదరికం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కాకూడదన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు సూర్య పీఠం ట్రస్టు తన వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షింతల రాజా, దోసపాటి సుబ్బారావు, కొత్తపల్లి సత్యనారాయణ, కొరిపిల్లి అప్పలస్వామి, పిల్లంగోరు పాపారావు, నంగినీడి రాంబాబు, చిటికెల పాండు, దేవిశెట్టి చక్కర్రావు, మార్నీడి రంగబాబు, సుంకర త్రిమూర్తులు, సిద్ధా వాసు తదితరులు పాల్గొన్నారు

## సార్వా వరికి ఎల్‌నీనో ప్రభావం.. ప్రకృతి వ్యవసాయంతో ఎదుర్కోవాలి

### రైతులకు అధికారుల సూచన.. 'రైతన్న మీకోసం' శిక్షణలో అవగాహన



గోకవరం: ఆగష్టు 10 ప్రభాత వార్త సార్వా వరి పంటపై ఎల్‌నీనో ప్రభావాన్ని తట్టుకునేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. గోకవరం మండలం రంపయర్రంపాలెం రైతు భరోసా కేంద్రంలో 'రైతన్న మీకోసం' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, పంటల యాజమాన్యం పై అవగాహన కల్పించారు. డీపీఎం తాతారావు మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా గోల్డెన్ బయో, ఘన జీవామృతం, ద్రవ జీవామృతాలను వినియోగించాలని సూచించారు. రసాయనిక మందులకు బదులుగా వేపపిండి, అగ్ని అస్త్రం, తూటికాడ ద్రావణాలను ఇంగువతో కలిపి వినియోగించాలన్నారు. వరి పంట బెట్టను తట్టుకునేలా పేడ, మూత్రం, ఇంగువ ద్రావణంతో పాటు ప్రతి 20 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతాన్ని పంటకు అందించాలని తెలిపారు. విత్తన గుళికలను ఉపయోగించడంతో పాటు గొర్రు ద్వారా అపరాలు, బోర్డర్ క్రాప్‌గా జొన్నలను సాగు చేయాలని సూచించారు. వరి పంటలో కలుపు నివారణకు నూకలు చల్లే విధానాన్ని వివరించారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ డీడీఏ అడ్డాల పార్వతి మాట్లాడుతూ ఎల్‌నీనో ప్రభావంతో చీడపీడలు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏడీఏ దేవరకొండ శ్రీనివాసరావు పంటల వికేంద్రీకరణ, ఈ–క్రాపింగ్, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ఇతర శాస్త్రవేత్తలు వరిలో ఆకునల్లి, ఎండాకు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణతో పాటు నీటి యాజమాన్యం పై పలు జాగ్రత్తలను వివరించారు. రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పి. రాజరాజేశ్వరి, శాస్త్రవేత్తలు డాక్టర్ భవాని ప్రసాద్, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, ప్రవీణ, అప్పారావు, నీటి సంఘం చైర్మన్ ఉంగరాల రాము, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలపై హర్షం



రంపచోడవరం, ఆగస్టు 10: ప్రభాతవార్త. పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఈ వేడుకల్లో భారీ సంఖ్యలో ఆదివాసీలు, మహిళలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్లు, గిరిజన కళా ప్రదర్శనలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజనుల హక్కులు, చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల నిర్వహణపై వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్లు, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని తెలిపారు. సంప్రదాయ కళలు, సంస్కృతిని యువతకు పరిచయం చేసేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామానికి చెందిన కంగల శ్రీనివాస్ దొర మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్లు, కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పాల్గొనడం గిరిజన సమాజ అభివృద్ధిపై ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమన్నారు. రాష్ట్ర డైరెక్టర్లు గాంధీబాబు, జి. పెద్దిరాజు, షేక్ సుభాని, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్డీవో కే. స్వాతి, డీఎఫ్‌వోలు శివకుమార్ గంగల్, గనికిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దేవదానం, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామ్మోహన్, పీహెచ్‌వో నరేంద్రకుమార్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి. సరిత, డీఆర్డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకరరావు, డ్వామా పీడీ రాంప్రసాద్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కే. ఉమా, జడ్పీటీసీలు గొర్లె బాలాజీబాబు, పండ వెంకటలక్ష్మి, ఎంపీపీలు బంధం శ్రీదేవి, సార్ల లత, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీటీసీలు కుంజం వంశీ, వెంకటేశ్వరరావు దొర, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ విమర్శలు దారుణం


### కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి సలాం కొట్టాలి : జనసేన నాయకుడు నవనాసి విష్ణు



గోకవరం ఆగష్టు 10 ప్రభాత వార్త ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, పటిష్టంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు విమర్శలు చేయడం చాలా దారుణమని గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు నవనాసి విష్ణు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, అభ్యర్థులకు పరీక్ష నిర్వహించిందని తెలిపారు. అభ్యర్థులు ఎంతో కష్టపడి పరీక్షలు రాసి మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించారని, అలాంటి డీఎస్సీ ప్రక్రియను కూడా వైసీపీ రాజకీయంగా తప్పుపట్టడం సరికాదన్నారు. వైసీపీ ఎన్ని దీక్షలు, ఆందోళనలు చేసినా ప్రజల్లో విశ్వసనీయత లేదని విష్ణు అన్నారు. డీఎస్సీకి సంబంధించి న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాల్లో కూడా పిటిషన్లు తిరస్కరణకు గురైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు సైతం వైసీపీ ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ప్లకార్డులతో నిరసనలు వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను వైసీపీ నాయకులు రాజకీయ కోణంలో చూడటం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ అభినందించాలని, ఎప్పటికైనా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సలాం కొట్టాల్సిందేనని జనసేన నాయకుడు నవనాసి విష్ణు అన్నారు

## దేశంలో పెరుగుతున్న ఐబిడి కేసులు

### లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే పేగులకు తీవ్ర నష్టం




రాజమహేంద్రవరం,ఆగస్ట్ 10(ప్రభాతవార్త) దేశంలో ఇన్ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబిడి) కేసులు వేగంగా పెరుగుతున్నాయని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ గోపి శ్రీకాంత్ హెచ్చరించారు. పదేపదే విరేచనాలు, మలంలో రక్తం, జిగురు, కడుపునొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలను పైల్స్ లేదా సాధారణ ఇన్ఫెక్షన్‌గా భావించి నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించకపోతే పేగులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. కొలొనోస్కోపీ, బయాప్సీ తదితర పరీక్షలతో ఐబిడిని నిర్ధారించవచ్చని తెలిపారు. ప్రాసెస్డ్ ఫుడ్ తగ్గించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో ఐబిడికి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్

### "యడ్లపల్లి శాంతిప్రియ"కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



గండేపల్లి. ఆగస్టు 10. ప్రభాతవార్త గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"యడ్లపల్లి శాంతిప్రియ" శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ తిరుపతి నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ తిరుపతి కి చెందిన ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి నేతృత్వంలో శాంతిప్రియ సమర్పించిన "థీసిస్ శీర్షిక: " ఎంపవరింగ్ ది రూరల్ విమెన్ త్రు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా."యడ్లపల్లి శాంతిప్రియ " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా. శాంతిప్రియ కు అభినందనలు తెలియజేశారు.


## మామిడాడ జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులు పూర్తి

### ఆగస్టు 15న రైతులకు నీరందించేందుకు చర్యలు:



జగ్గంపేట ఆగస్టు 10 (ప్రభాతవార్త ) జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో 3 కోట్ల 82 లక్షల రూపాయలతో నిర్మించిన జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులు పూర్తయ్యాయి. సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ పథకం పనులను పరిశీలించారు. ఈ పథకం ద్వారా మామిడాడ, ఇర్రిపాక, మర్రిపాక, నరేంద్రపట్నం పరిధిలోని కొంత భాగం, గొల్లలగుంట గ్రామాల్లో మొత్తం 4000 ఎకరాలకు సాగునీరు అందనుంది. దశాబ్దాలుగా నీటి కోసం ఎదురుచూసిన రైతుల కల నెరవేరనుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున రైతులకు నీరు విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గత జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారి కృషి ఫలితంగానే నేడు వేలాది ఎకరాలకు శాశ్వత సాగునీరు అందుబాటులోకి వస్తోంది. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు,కొత్తకొండబాబు, పాండ్రంగి రాంబాబు, చదరం చంటిబాబు, బస్వా చినబాబు,బోదిరెడ్ల సుబ్బారావు, జ్యోతుల సత్యమూర్తి, బొడ్డేటి సుమన్, వేగి రామకృష్ణ, , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస తైక్వాండో క్లబ్ కు పతకాల పంట..




### వివిధ విభాగాల్లో 48 పతకాలు సాధించిన విద్యార్థులు..

అంబాజీపేట, ఆగస్టు 10,(ప్రభాతవార్త ): అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ ను పతకాల పంట వరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 32వ ఇంటర్ క్లబ్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలు ఈనెల 9న కాకినాడ జిల్లా స్పోర్ట్స్ స్టేడియంలో జరిగాయి. బాలుర- బాలికల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ క్రెడిట్ విభాగాలలో నిర్వహించిన పోటీలలో 48 గోల్డ్, రజితం, కాంస్య పతకాలు సాధించినట్లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు.స్థానిక జెడ్పీ హైస్కూల్లో పతకాలు సాధించిన విద్యార్థులను పలువురు సోమవారం అభినందించారు. ఈ పోటీలలో 22 బంగారు పతకాలు,14 రజితం,12 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు.గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 23 వరకు ప్రకాశంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన రిఫరీ పితాని లక్ష్మి భార్గవితో పాటు కోచ్లు పి.నాగభూషణం, బి.కుసువీర్, పి.వి.రాఘవేంద్రలకు పలువురు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ షాక్ తో గిరిజన మహిళ మృతి..

### విద్యుత్ అధికారులకు పిర్యాదు



రాజవొమ్మంగి, ఆగస్టు 10, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం అమీనాబాద్ పంచాయితీ ఏ. వనకరాయి గ్రామానికి చెందిన పల్లాల మంగాదేవి (38 ) సం. సోమవారం ఇంటి వద్దే విద్యుత్ షాక్ గురై చనిపోయింది. జడ్డంగి పి. హెచ్. సి కి తరలించారు. విద్యుత్ షాక్ వల్ల మంగాదేవి చనిపోయినట్లు జడ్డంగి పి. హెచ్. సి డా. నాగార్జున తెలిపారు. రాజవొమ్మంగి విద్యుత్ అధికారులకు కుటుంబీకులు పిర్యాదు చేయగా సిబ్బంది ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మంగాదేవికి భర్త నాగిరెడ్డి, రాజా, కీర్తి లావణ్య, సుబ్బారెడ్డి ముగ్గురు సంతానం ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకొంటూ జీవిస్తున్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, టిడిపి నాయకులు కె. శ్రీనివాస్ రెడ్డి, వేమా చిన్నారావు, ఆవూరి చెల్లారావు పలువురు మంగాదేవి మృతి పట్ల సంతాపం తెలిపారు.

## రోగులకు పండ్లు పంపిణీ



రాజవొమ్మంగి, ఆగస్టు 10, ప్రభాతవార్త రాజవొమ్మంగి ఆదర్శ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం యు. టి. ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోలగాని శ్రీను, కానేం శ్రీను ఆధ్వర్యంలో జరిగాయి. మండల సీనియర్ కార్యకర్త మఠం ఉదయ్ గంగ మనోహర్ కుమార్ (ఉదయ్ ) యు. టి. ఎఫ్ జెండాను ఆవిష్కరణ చేశారు. జిల్లా కోశాధికారి టి. బొజ్జయ్య యు. టి. ఎఫ్ ఆవిర్భావం, పోరాటాలు, విజయాలు, అమరజీవుల ఆశయాలను వివరించారు. జిల్లా సహధ్యక్షురాలు బీరబోయిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళలు పోరాటాల్లో పాల్గొని విజయాలను ఎలా సాధించారో తెలిపారు. జిల్లా కార్యదర్శి పొట్టబోయిన రమణ మాట్లాడుతూ హక్కులు పోరాటాలతోనే సాధ్యమని అన్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మఠం శాంతిబాబు మాట్లాడుతూ మనం పొందుతున్న ప్రతీ రాయితీ యు. టి. ఎఫ్ పోరాట ఫలితమే అని వెల్లడించారు. మండల ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను మాట్లాడుతూ... 1974 ఆగస్టు 10 న యు.టి.ఎఫ్ ఆవిర్భావించిందన్నారు. లక్ష మూడువేల సభ్యత్వం కలిగి రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా నిరంతరం హక్కుల సాధనకు ఉద్యోగ ఉపాధ్యాయుల ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తున్న సంఘం యు.టి.ఎఫ్ అని వ్యాఖ్యానించారు. సుమారు 11 వేల మంది సి పి.ఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులను ఓ. పి ఎస్ ఉద్యోగులుగా ప్రకటించడం పట్ల యు. టి ఎఫ్. కృషి మరువలేనిదన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, యూటీఫ్ సభ్యులు చోడి రామారావు ఆర్ధిక సహకారంతో రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొలగాని శ్రీను, కానెం శ్రీను తో పాటు జిల్లా కార్యదర్శి పొట్ట బోయిన రమణ, గౌరవ అధ్యక్షులు మఠం ఉదయ్ గంగ మనోహర్ కుమార్ (ఉదయ్ ), జిల్లా కోశాధికారి, తీగల బొజ్జియ్య, జిల్లా మహిళా సహధ్యక్షురాలు బీర బోయిన వెంకటలక్ష్మి, జిల్లా కౌన్సిలర్స్ పైడిమల్లి రమేష్ బాబు, మండల కార్యదర్శి రాజబాబు, కొండబాబు, లక్ష్మమ్మ, రాజ్యలక్ష్మి,, పార్వతి, గంగాభవాని, ప్రశాంతి, పుష్పలత, షహనాథ్, రామస్వామి, సింహాచలం, హరిచంద్ర ప్రసాద్, జయలక్ష్మి, తదితర సంఘ సభ్యులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## పివిఎన్ మాధవ్ జన్మదినం సందర్భంగా భారీ ఎత్తున అన్నదానం



కాకినాడ రూరల్, ఆగస్టు 10(ప్రభాతవార్త) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ 53వ జన్మదినం పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, కాకినాడ రూరల్ మండలం -1 ఇంచార్జ్ గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 500 మందికి భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్న వితరణ కార్యక్రమం ప్రారంభించగా పైడా భవన ప్రసాద్ ,ఎనిమిరెడ్డి మాలకొండయ్య ,దువ్వూరి సుబ్రహ్మణ్యం ,కుండల సాయి కుమార్ యాదవ్ ,దాట్ల సాహితీవర్మ ,చోడిశెట్టి రమేష్ ,యార్లగడ్డ రామ కుమార్ , కొక్కిలిగడ్డ గంగరాజు ,పెండెం శ్రీదేవి ,చెక్క రమేష్ ,తుమ్మలపల్లి నాని, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవకు జన్మదిన శుభాకాంక్షలు అందజేస్తూ ఆయన జన్మదిన సందర్భంగా అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టిన గీసాల శ్రీనివాసరావును అభినందించారు. ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ఇటీవల కేకులు కట్ చేయడం కొవ్వొత్తుల ఆర్పడం వంటి విదేశీ సంస్కృతిని యువత అనుసరిస్తోందని ప్రత్యామ్నాయంగా భారతీయ సంస్కృతిని అనుసరిస్తూ పుట్టినరోజున దేవాలయాలకు వెళ్ళటం పూజలు నిర్వహించటం మన ఇళ్లలో ఉండే పెద్దలు ముఖ్యంగా తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వారి ఆశీర్వాదం పొందటం సముచితంగా ఉంటుందని ఈ విధంగా పిల్లలకు అలవాటు చేయాలని బిక్కిన ఈ భారతీయ సంస్కృతిని యువతకు చిన్నారులకు నేర్పే బాధ్యతను పెద్దలు తీసుకోవాలని ఆయన కోరారు.

## అడ్డతీగలలో తక్కువ ధరకే బియ్యం విక్రయాలు



అడ్డతీగల, ఆగస్టు 10, ప్రభాతవార్త మండల కేంద్రమైన అడ్డతీగలలో రైస్ మిల్లుల అవుట్లెట్ స్టోర్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను ప్రారంభించారు. అడ్డతీగల రేషన్ షాపులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ను తహసీల్దార్ తేజస్విని ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ తేజస్విని మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్లో కిలో స్టీమ్ బియ్యం రూ.62 ఉండగా, ప్రత్యేక కౌంటర్లో రూ.52కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. అలాగే బహిరంగ మార్కెట్లో కిలో రా బియ్యం రూ.58 ఉండగా, రూ.50కే అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బీర బాలయోగి, వంకా సతీష్, దంగేటి సత్తిబాబు, పూడిక ఆదిలక్ష్మి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రియాంక మృతి పై నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి

### విశ్వ హైందవ పరిషత్




పిఠాపురం, ఆగస్టు 10( ప్రభాతవార్త ) రాజమహేంద్రవరం జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ మేడికో డాక్టర్ ప్రియాంకకు సంబంధించిన మృతి ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వ హైందవ పరిషత్ డిమాండ్ చేసింది. సోమవారం పిఠాపురం బంగారమ్మ సర్కిల్ వద్ద విశ్వ హైందవ పరిషత్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు,సురేంద్ర దత్త మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ప్రజలు, మహిళలు, యువతుల భద్రతపై ఆందోళన పెరిగిందని పరిషత్ నాయకులు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని భవిష్యత్తులో ఎలాంటి ఘటనలు మనరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు, న్యాయ వ్యవస్థ పై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా డాక్టర్ ప్రియాంక కేసును పారదర్శకంగా, దర్యాప్తు చేసి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. డాక్టర్ ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసనను తెలియజేస్తామని విశ్వ హైందవ పరిషత్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య ఆకొండి,కొండేపూడి శివ,చిన్న సోనా బాబు,నితిన్ శ్రీ,శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై ప్రశ్నిస్తే నిర్బంధమా? వైసీపీ ధ్వజం



గోపాలపురం, ఆగస్టు 10 (ప్రభాతవార్త): డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయానికి నిరసనగా నిర్వహించిన శాంతియుత ర్యాలీకి వెళ్లకుండా గోపాలపురం మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఇందులో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో పాల్గొనకుండా తనను ఇంటికే పరిమితం చేయడంపై శ్రీరామ్మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలు, నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అరెస్టులు, హౌస్ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని, డీఎస్సీ వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఖాదర్ వలి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులను హౌస్ అరెస్టులతో అడ్డుకోవడం సరైన విధానం కాదన్నారు. డీఎస్సీ నియామకాల్లో పారదర్శకతపై నిరుద్యోగుల్లో ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని, ప్రశ్నించే గొంతులను అణచివేయకుండా సమస్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు, ఆన్సర్ భాష, కాకులపాటి శ్రీను సైతం ఈ హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండించారు.

## మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి



కాట్రేనికోన ఆగస్టు 10, (ప్రభాత వార్త) డీఎస్సీ అవకతవకలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని పలువురు నిరుద్యోగులు,వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు వైకాపా ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ ,మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ అవకతవకలతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదమంది నిరుద్యోగులు దగాపడ్డారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డీఎస్సీపై సిబిఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కాట్రేనికోనలోని తిమ్మాపురం నుండి తహసిల్దారు కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను , సభ్యులు పితాని బాలకృష్ణ ,కాశి బాలమునికుమారీ, దొరబాబు, జడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ కుమార్ ,నడింపల్లి సూరిబాబు, నాతి సత్యనారాయణ, నడింపల్లి సందీప్ వర్మ,గంటి సుధాకర్ ,నల్లా నరసింహమూర్తి మోకా చంద్ర నాగరత్నం,యేడిద సుబ్బారావు, జగడం బాలయోగి , ఎంపీపీ కోలాటి సత్యవతి సత్యం , కాశి హనుమంతరావు,అక్కల శ్రీధర్ ,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## స్థలం వివాదంలో రెండు వర్గాల మధ్య పోరు

### కుల దూషణల వివాదంలోరూరల్ ఎమ్మెల్యే నానాజీ వర్గం



కాకినాడ రూరల్, ఆగస్టు 10,(ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో స్థలం వివాదంలో రెండు వర్గాల మధ్య పోరు అధికార కూటమి నేతల మధ్య అంతర్గత విభేదాలు తీవ్ర రూపం దాల్చాయి. వాకలపూడి కి చెందిన జనసేన పార్టీ నాయకుడు చింతకాయల శ్రీనుకు చెందిన స్థలాన్ని ఆక్రమించుకోవడానికి చూస్తున్న కబ్జాదారులకు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సమీప బంధువు దన్నుగా నిలుస్తున్నారని, ఆయన ప్రమేయంతోనే ఈ దౌర్జన్యాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. అంతేకాకుండా, ఈ వివాదంలో మత్స్యకార సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే బంధువుల అండతో జరుగుతున్న అన్యాయాలను, కుల దూషణలను నిరసిస్తూ చింతకాయల శ్రీను ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.కబ్జాదారుల వెనుక ఎమ్మెల్యే మేనల్లుడి హస్తం ఉందని జనసేన మత్స్యకార సామాజిక వర్గ నాయకుడు చింతకాయల శ్రీను ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నానాజీ వర్గం తీరుపై, కబ్జాదారులకు ఇస్తున్న బాసటపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.పార్టీ కోసం ప్రాణపణంగా పనిచేసిన నా సొంత స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కబ్జాదారులకు ఆయన అనుచరులు నేరుగా దన్నుగా నిలవడం అత్యంత దారుణం అని,వారి ప్రమేయంతోనే ఈ దౌర్జన్యం జరుగుతోందని ఆరోపించారు.ఈ వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, సర్పవరం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు మా వారిపై లాఠీఛార్జ్ చేయడంతో అనేకమందికి గాయాలయ్యాయని, తమపై తీవ్ర రాజకీయ ఒత్తిడి తెచ్చి మాపై తప్పుడు కేసులు పెట్టించాలని చూస్తున్నారని స్వయంగా పోలీసులే చెబుతున్నారని మీడియాకు వివరించారు. ఈ అక్రమ భూకబ్జా వ్యవహారంపై తక్షణమే అధిష్టానం జోక్యం చేసుకుని కబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కోతుల బెడదపై అటవీశాఖ అధికారికి జనసేన నాయకులు వినతి



యు.కొత్తపల్లి, ఆగస్టు 10 (ప్రభాతవార్త) : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి, అమీనాబాదు, మూలపేట గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, జనసేన పార్టీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు రావు అక్షయ్ కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) ఎన్. రామచంద్రరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేసారు. అధిక సంఖ్యలో కోతులు గ్రామాల్లోని నివాస ప్రాంతాలు, ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, పొలాల్లోకి ప్రవేశించి కూరగాయలు, పండ్లతోటలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల భద్రతతో పాటు వన్యప్రాణులకు సంబంధించిన అంశం కావడంతో సమస్యను అత్యవసరంగా పరిగణించి నిపుణుల ఆధ్వర్యంలో కోతులను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన



గోపాలపురం, ఆగస్టు 10 (ప్రభాతవార్త): మాదకద్రవ్యాల వినియోగం, మహిళలపై వేధింపులు, బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక నేరాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కరగపాడులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దేవరపల్లి సీఐ బి. నాగేశ్వర్ నాయక్ పర్యవేక్షణలో గోపాలపురం ఎస్ఐ వి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు నేరాలకు దారితీసి కుటుంబ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని ఎస్సై వివరించారు. యువత చట్టబద్ధమైన మార్గంలో నడుచుకుంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులు పిల్లల కదలికలపై శ్రద్ధ వహించాలని సూచించారు.

## డీఎస్సీలో అక్రమాలు నిరసిస్తూ తునిలో వైసిపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

### - పాల్గొన్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



తుని, ఆగస్టు 10,( ప్రభాతవార్త ) కూటమి ప్రభుత్వ నిర్వహించిన మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నిరసన వ్యక్తం చేస్తూ తుని నియోజకవర్గ వైసిపి ఆధ్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైసిపి నేతలు, కార్యకర్తలు, డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ఈ మంత్రి దాడిశెట్టి రాజా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.తుని పట్టణంలోని కొట్టాంసెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, శ్రీనివాస థియేటర్ సెంటర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా గొల్ల అప్పారావు సెంటర్,రామా థియేటర్ వరకు భారీ బైక్ ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్రవ్యాప్తంగా యువత నిరసన తెలియజేస్తున్నారన్నారు . యువతకు వైఎస్ఆర్సిపి పూర్తి మద్దతు తెలియజేసిందన్నారు. 16 వేల డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ వస్తే లక్షలాది మంది అభ్యర్థులు కష్టపడి చదివి పరీక్షలు రాశారన్నారు. అయితే క్రీడాకారులు, దివ్యాంగుల కోటాలో అవకతవకలు జరిగినట్లు రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు ఆరోపణలు చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు నిరసన తెలియజేస్తుంటే స్పందించాల్సిన ముఖ్యమంత్రి,విద్యా శాఖ మంత్రి ఉద్యోగాలు వచ్చిన అభ్యర్థులతో ఎదురుదాడులు చేస్తున్నారన్నారు. కష్టపడి చదివిన అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చిన విషయంలో తాము మాట్లాడటం లేదని, వాళ్లు స్వతహాగా కష్టపడి చదివి ఉద్యోగాలు పొందారన్నారు. అయితే డీఎస్సీ పరీక్షలు రాయకుండానే కొందరు అభ్యర్థులు ఉద్యోగాలు పొందినట్లు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు బహిర్గతంగానే వస్తున్నాయన్నారు. ఈ విషయంపై స్పందించి వివరణ ఇవ్వాల్సింది పోయి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. యువతను తప్పు పట్టి వారిపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. డీఎస్సీ అవకతవకలపై సిబిఐ విచారణ చేపట్టి బాధ్యులపై కట్టిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి రాజా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసిపి నేతలు, కార్యకర్తలు డీఎస్సీ రాసిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## యానాంలో దీపావళి బాణసంచా లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం, ఆగస్టు 10: (ప్రభాతవార్త) దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయాల కోసం నూతన లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు పుదుచ్చేరి జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ప్రకటించింది. 2026 నవంబర్ 8న దీపావళి పండుగ జరగనున్న నేపథ్యంలో, పేలుడు పదార్థాల నియమాలు--2008 ప్రకారం ఫారం--LE5లో 100 కిలోల బాణసంచాను కలిగి ఉండి విక్రయించేందుకు లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ లైసెన్సుల కోసం సాధారణ ప్రజల నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. 2026 ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. యానాం ప్రాంతానికి సంబంధించి దరఖాస్తుల ఆహ్వానంపై సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్, యానాం తెలుగులో నోటీసు జారీ చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన తనిఖీ నివేదికలను 2026 అక్టోబర్ 16లోగా ఆన్లైన్ పోర్టల్లో సమర్పించాల్సి ఉంటుంది.పేలుడు పదార్థాల చట్టం, పేలుడు పదార్థాల నియమాలు--2008లోని నిబంధనలను అధికారులు కచ్చితంగా పాటించాలని జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించారు.

## డీఎస్సీ అవకతవకలకు నారా లోకేష్ బాధ్యత వహించాలి

### మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి డిమాండ్



రంపచోడవరం, ఆగస్టు 10: ప్రభాతవార్త. డీఎస్సీ నియామక ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నాగులపల్లి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. డీఎస్సీ అవకతవకలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుంచి పాత దేవి గుడి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కర్రీ పాపారాయుడు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## గ్రీవెన్స్ లో నాలుగు అర్జీలు స్వీకరణ



కాట్రేనికోన ఆగస్టు 10 (ప్రభాతవార్త) కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు, తహసీల్దార్ వి రవికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పి జి ఆర్ ఎస్ మిక్కిలి దోహద పడుతుందని ఈ సందర్భంగా కొనియాడారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ లో 4 అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తి బాధ్యత వహిస్తూ తమ శాఖలకు సంబందించిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చూపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శంకర్ నారాయణ సుబ్రమణ్యం, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సంచార ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన బాబి

### - పీహెచ్సీలో మాధవరపు సేవలు



కె గంగవరం, ఆగస్టు 10, (ప్రభాతవార్త): సి ఎస్ ఆర్ నిధుల ద్వారా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏర్పాటు చేసిన గ్రామీణ సంచార వైద్యశాల (మొబైల్ వ్యాన్) ఉచిత మెడికల్ క్యాంపు లో భాగంగా కె గంగవరం మండలం కుందూరు గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు మేడిశెట్టి బాబి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది ని పరీక్షించుగా అవసరమైన వారికి ఉచితంగా రక్త పరీక్షలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు అనూష, సిబ్బంది ఎల్ టి జ్యోతి,ఫార్మసిస్ట్ అనూష, ఏఎన్ఎం రాజేశ్వరి, చంద్రరావు, ప్రకాష్ రావు, లతోపాటు టిడిపి పార్లమెంటరీ కార్యదర్శి సిర్రా సురేష్,సుంకర శ్రీను, ఒంటిపల్లి రవి, కొప్పాక సుమన్, చెల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కుందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 మంది గర్భిణీ స్త్రీలకు భవానీ వెంకట్ మాధవరపు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలు రొట్టెలు మిఠాయిలు అందజేసినట్లు మాధవరపు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ వైద్యులు సుధీర్, డివిజనల్ నోడల్ ఆఫీసర్ జి శ్రీమన్నారాయణ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన ఆరోగ్య విషయాలపై పలువురు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సుబ్రహ్మణ్యం హెచ్ వి స్టాఫ్ నర్స్ ఆశా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

### వైఎస్సార్సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి - వైఎస్సార్సీపీ భారీ బైక్ ర్యాలీ




రావులపాలెం, ఆగస్ట్ 10 (ప్రభాతవార్త ) : డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కొత్తపేట నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రావులపాలెం నుంచి కొత్తపేట వరకు సాగిన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమైంది. కొత్తపేట నియోజకవర్గ పరిశీలకుడు పాటి శివకుమార్ పాల్గొన్నారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు బైక్లపై కొత్తపేటకు చేరుకున్నారు. అనంతరం కొత్తపేట సెంటర్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆరోపణలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## జగ్గంపేట మార్కెట్ కమిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే కు వినతి,



జగ్గంపేట ఆగస్టు 10 (ప్రభాతవార్త )జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ అధ్యక్షతన సంఘ భవనంలో జరిగింది. సమావేశంలో రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.అనంతరం చైర్మన్ అడపా భరత్, పాలకవర్గ సభ్యులు రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తగిన నిధులు మంజూరు చేయాలి.మార్కెట్ యార్డ్ నిధులతో మెటల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి.రైతుల సౌకర్యార్థం గోకవరం, కిర్లంపూడి గ్రామాల్లో మార్కెట్ కమిటీ గోడౌన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం ముక్కొల్లు, గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించాలి. ఆగస్టు 15న మార్కెట్ కమిటీ భవనంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు.ఈ వినతులపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సహకారంతో జగ్గంపేట మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేస్తామని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అడపా భరత్, వైస్ చైర్మన్ బొదిరెడ్డి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు బోదిరెడ్ల సుబ్బారావు, పీలా మహేష్, గుమ్మల్ల అనంతలక్ష్మి, సింగలూరి రామ్ దీపు, గమిని దుర్గాప్రసాద్, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

## కిన్నపర్తి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అడ్డతీగల,ఆగస్టు 10, ప్రభాతవార్త అడ్డతీగల మండలంలోని కిన్నపర్తి గ్రామంలో గోకిరి సూరిబాబు (32) సోమవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సూరిబాబు తన నివాసంలో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సూరిబాబు మృతి విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అడ్డతీగల సీఐ గజేంద్ర కుమార్, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సూరిబాబు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps